ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY




శుక్రవారం 19 జూన్ 2026 | సంపుటి: 28 సంచిక: 78
Friday 19 June 2026 | Vol.No 28 Issue No .78
హైదరాబాద్ | Hyderabad
పేజీలు: 12+12
వెల: రూ.1.00
PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
www.visionandhra.in

## మాదక ద్రవ్యాల నిర్మూలనకు చర్యలు

- నేడు ఎల్‌బి స్టేడియంలో విద్యార్థులతో ప్రమాణం
- పాల్గొననున్న సిఎం రేవంత్, గవర్నర్ శుక్లా



హైదరాబాద్,జూన్ 18 : తెలంగాణ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్యా వాతావరణం , మాదకద్రవ్యాల నిర్మూలనకు కట్టుబడి ఉందని మరోసారి చాటిచెబుతూ, జూన్ 19న శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్.బి. స్టేడియంలో రాష్ట్ర స్థాయి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనుంది. కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి గారు రెసిడెన్షియల్ విద్యాసంస్థల విద్యార్థులకు 'విద్యార్థి హక్కుల కిట్లు' పంపిణీ చేయనున్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధి, సంక్షేమం, వసతి సదుపాయాల కల్పనలో భాగంగా 20రకాల వస్తువులతో కిట్లు అందజేస్తున్నారు. కార్యక్రమంలో పాఠశాలలు, కళాశాలలను మాదకద్రవ్య రహితంగా

మిగతా 2లో..

## ప్రభుత్వ భూముల కబ్జా నిరోధానికే హైడ్రా

- పేదల జోలికి వెళ్లకుండా.. కబ్జాదారుల భరతం పడుతోంది
- హైదరాబాద్ కాలుష్యం నివారించేందుకే వనమహోత్సవం
- ఎవరు అడ్డుపడ్డా మూసీ ప్రక్షాళన కొనసాగుతుంది
- మూసీ మురికి కన్నా కల్వకుంట్ల విషం ప్రమాదం
- గుర్రంగూడ ఎకో పార్క్‌లో వనమహోత్సవం
- మొక్కను నాటి ప్రసంగించిన సిఎం రేవంత్ రెడ్డి







రంగారెడ్డి,జూన్18 :ఎవరైనా ప్రభుత్వ భూములను కబ్జా చేయాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. కబ్జాలతో ప్రజలకు సమస్యలు రాకూడదనే హైడ్రా తీసుకువచ్చామని ప్రస్తావించారు. హైడ్రాను ఒక భూతంలా కొందరు చూపెడుతున్నారని ధ్వజమెత్తారు. హైడ్రా పేదల జోలికి వెళ్లదని.. కబ్జాదారుల భరతం పడుతుందని స్పష్టం చేశారు. గుర్రంగూడ ఎకో పార్క్‌ను కబ్జా చేయాలని కొంతమంది చూశారని ఆరోపించారు. వనస్థలిపురంలో దేవుడి భూములనూ కూడా కబ్జా పెట్టారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం గుర్రంగూడ ఎకో పార్క్‌లో వన మహోత్సవం కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. హరితనిధి ద్వారా నాగలింగం మొక్కను ముఖ్యమంత్రి నాటారు. రోబోటిక్ ఏనుగును ఆవిష్కరించారు. ఈ క్రమంలో గుర్రంగూడ ఎకో పార్క్ నమూనాను అటవీ అధికారులు.. సీఎంకి వివరించారు. ఎకో పార్క్‌లో రూ.35.50 కోట్లతో

మిగతా 2లో..

## ఆర్టీసీ ఉద్యోగులకు శుభవార్త

- 11శాతం ఫిట్‌మెంట్ అమలుకు నిర్ణయం
- జూలై 1 నుంచే అమలు చేస్తామన్న మంత్రి పొన్నం



హైదరాబాద్,జూన్18 : తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు మంత్రి పొన్నం ప్రభాకర్ శుభవార్త చెప్పారు. ఆర్టీసీ సమ్మెలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులకు జులై 1 నుంచి 11 శాతం ఫిట్‌మెంట్ అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ఆదేశాలు జారీ చేశారు. గురువారం టీజీఎస్‌ఆర్టీసీ ఉన్నతాధికారులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా

మిగతా 2లో..

## హర్మూజ్ తెరుచుకున్నా ఇంధన ధరలు తగ్గవు

**ఇప్పట్లో తగ్గించే ఉద్దేశ్యం లేదన్న కేంద్రం**

న్యూఢిల్లీ,జూన్18 : అమెరికా- ఇరాన్ మధ్య కుదిరిన ఒప్పందంతో పశ్చిమాసియా సంక్షోభానికి తెరపడింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ముడి

మిగతా 2లో..

## వానాకాలం సాగుకు రైతులకు అండగా ప్రభుత్వం

- 30న రైతు భరోసా నిధులు విడుదల, • మధిర వేదికగా సిఎం రేవంత్ చేతుల మీదుగా అందచేత, • ఏడు రకాల సన్నాలకు బోనస్ ఇవ్వాలని నిర్ణయం, • ధాన్యం కొనుగోళ్లలో కేంద్రం తీరుపై ఆగ్రహం, • కేబినేట్ భేటీలో పలు అంశాలపై చర్చ, • వివరాలు వెల్లడించిన మంత్రి ఉత్తమ్ కుమార్



హైదరాబాద్,జూన్18 : ఈనెల 30వ తేదీన రైతు భరోసా నిధులు విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. గురువారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశమైంది. ఈ సమావేశంలో ఈ మేరకు కేబినెట్ నిర్ణయం తీసుకుంది. వరుసగా తొమ్మిది రోజుల పాటు రైతుల ఖాతాల్లో ప్రభుత్వం ఈ నిధులను జమ చేయనుంది. 30న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మధిరలో నిర్వహించే సభలో సీఎం రేవంత్ రెడ్డి ఈ నిధులను విడుదల చేయనున్నారు. రైతు భరోసా కింద రైతులకు ప్రభుత్వం ఏటా ఎకరానికి రూ.12 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తోంది. ఈ పెట్టుబడి సాయాన్ని రెండు పంటల కాలాలకు ఖరీఫ్, రబీ కాలంలో విడగొట్టి, ప్రతి సీజన్‌కు ఎకరాకు రూ. 6,000 చొప్పున నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. మరోవైపు.. 23వ ప్రధాన

మిగతా 2లో..

## మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ఉర్దూ అకాడమీ గోల్డెన్ జూబ్లీ వేడుకల సందర్భంగా ముషాయిరా
- వేగంగా రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణం
- కొత్త శ్మశాన వాటికల స్థల సేకరణపై కలెక్టర్లకు ఉత్తర్వులు
- డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి
- సమావేశానికి హాజరైన మంత్రి హజారుద్దీన్ కార్పొరేషన్ చైర్మన్లు



హైదరాబాద్,జూన్ 18 : రాష్ట్రంలోని మైనార్టీల సామాజిక, ఆర్థిక, విద్యాభివృద్ధికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇందుకోసం బడ్జెట్‌లో భారీగా నిధులను కేటాయించామని, వాటికి సంబంధించిన అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన వేగవంతం చేస్తున్నామని ఆయన వెల్లడించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మైనార్టీల సంక్షేమం, వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శనివారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం

మిగతా 2లో..

## రామగుండం ఎరువులు మనకే కేటాయించాలి

- కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ఢిల్లీ వెళతాం
- ఒక్క మొక్కజొన్న గింజకూడా కొనని కేంద్రం
- రైతుబీమా పథకం కింద ఎల్ఐసికి బీమా మొత్తం చెల్లింపు
- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి



హైదరాబాద్,జూన్ 18 : రామగుండం ఎరువులు పొందేలా కేంద్ర ప్రభుత్వంపై ఉద్యమిస్తామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. ప్రతి నెల రెండు లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఇస్తామని అన్నారని.. కానీ హామీ ఇచ్చిన మేరకు కేంద్రం యూరియా సరఫరా ఎందుకు చేయట్లేదని ప్రశ్నించారు. గురువారం సచివాలయంలో మీడియాతో మంత్రి తుమ్మల మాట్లాడారు. ఢిల్లీకి వెళ్లి సరిపడా యూరియా తెలంగాణకు ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతామని పేర్కొన్నారు. కేంద్రం ఎంఎస్పీ

మిగతా 2లో..

## హైదరాబాద్‌లో జనసేన కార్యాలయం

*నేడు ప్రారంభించనున్న పవన్ కళ్యాణ్*



హైదరాబాద్,జూన్ 18 : నగరంలో జనసేన తెలంగాణ పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రారంభించనున్నారు. శుక్రవారం మధ్యాహ్నం

మిగతా 2లో..

## టిఎంసికి హైకోర్టులో ఎదురుదెబ్బ

- రితబ్రత బెనర్జీ నియామకంపై సవాల్ , • మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమన్న హైకోర్టు



కోల్‌కతా,జూన్18 :తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా తిరుగుబాటుచేసిన ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై కోల్‌కతా హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులిచ్చేందుకు నిరాకరించింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ కృష్ణారావు నేతృత్వంలోని ధర్మాసనం.. తదుపరి విచారణ జరిపేంత వరకు స్పీకర్ నిర్ణయం అమలులో ఉంటుందని స్పష్టం

మిగతా 2లో..

## పవన్ కళ్యాణ్‌పై ఎందుకు కేసు పెట్టలేదు

- కెటిఆర్ సిరిసిల్లకు విజిటింగ్ టూరిస్ట్
- టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత విమర్శలు



కరీంనగర్,జూన్ 18 : ప్రాంతీయవాదాన్ని వేర్పాటువాదంతో పోల్చిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పై రాష్ట్ర ప్రభుత్వం

మిగతా 2లో..

## నీట్ రీటెస్ట్ నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు

- వదంతులను నమ్మొద్దని విద్యార్థులకు వినతి
- 21న రీ టెస్టు కోసం ఏర్పాట్లు పూర్తి : ఎన్‌టిఎ




న్యూఢిల్లీ,జూన్18 :నీట్-యూజీ రీటెస్టును పకడ్బందీగా నిర్వహించేందుకు విస్తృతమైన ఏర్పాట్లు చేసినట్లు 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ'

మిగతా 2లో..

## ప్రైవేట్ స్కూల్ ఫీజులను డిస్‌ప్లే చేయాలి

- పబ్లిక్ డొమైన్‌లో తప్పనిసరి ప్రదర్శించాలి, • అనాథ పిల్లలకు కూడా తల్లికి వందనం అమలు, • విద్యాశాఖ అధికారులతో సమీక్షలో మంత్రి లోకేశ్




అమరావతి,జూన్18 : ప్రైవేట్, అన్ ఎయిడెడ్ స్కూళ్ల అనుమతుల్లో అనవసర నిబంధనలు తొలగించాలని విద్యా,ఐటి శాఖల మంత్రి నారా లోకేశ్ సూచించారు. ప్రైవేట్ స్కూళ్ల ఫీజులను బోర్డులపై, పబ్లిక్ డొమైన్‌లో తప్పనిసరిగా ప్రదర్శించాలని స్పష్టం చేశారు. అనాథ పిల్లలకు కూడా 'తల్లికి వందనం' పథకం ప్రయోజనాలు అందించాలని ఆదేశాలు జారీ చేశారు. గార్డియన్లు లేని పిల్లలకు జిల్లా కలెక్టర్ ద్వారా నిధుల పంపిణీపై దృష్టి సారించాలన్నారు. అనాథ పిల్లల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేసే విధానంపై ఆలోచన చేయాలన్నారు.

మిగతా 2లో..


## ఆక్వా ఫీడ్ ధరలు తగ్గించాలి

- కిలో ధర 4 వరకు తగ్గించిన వ్యాపారులు
- సిఎంతో ఆక్వా ఫీడ్ వ్యాపారుల భేటీ
- ఆక్వా, టొబాకో, మామిడి రైతుల సమస్యలపై చంద్రబాబు సమీక్ష



అమరావతి,జూన్18 :ఆక్వా ఫీడ్ ధర తగ్గించాలని తయారీదారులను సీఎం చంద్రబాబు నాయుడు కోరడంతో వారు సానుకూలంగా స్పందించారు. దీంతో ఆక్వా రైతులు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నిర్దేశిరచడంతో ఆక్వా ఫీడ్ ధర కేజీకి రూ.4 తగ్గించేందుకు తయారీదారులు అంగీకరించారు. దీంతో కేజీ ప్రస్తుతం రూ.112 నుంచి రూ.108కి ఫీడ్ ధరలు తగ్గనున్నాయి. ఆక్వా, టొబాకో, మామిడి రైతుల సమస్యలపై గురువారం అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆక్వా రైతులతోపాటు ఫీడ్ తయారీదారులతో ఆయన సమావేశమయ్యారు. ధరల స్థిరీకరణలో భాగంగా ఆక్వా రైతులు, తయారీదారులతో కమిటీ వేయాలని ఉన్నతాధికారులను ఆయన ఆదేశించారు. 20 రోజుల్లో ఈ కమిటీ నివేదిక ఇవ్వాలని వారికి స్పష్టం చేశారు. అనంతరం ధరపై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు,

మిగతా 2లో..



## కొత్త డార్క్ వెబ్‌గా టెలిగ్రామ్ యాప్

- నేరగాళ్లకు అడ్డాగా మారిన మెసేజింగ్ ప్లాట్‌ఫామ్
- కేంద్రప్రభుత్వం సంచలన ఆరోపణలు
- ఢిల్లీ హైకోర్టుకు నివేదిక సమర్పణ

న్యూఢిల్లీ,జూన్18 : మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ టెలిగ్రామ్‌పై కేంద్రం సంచలన ఆరోపణలు

మిగతా 2లో..

## పవన్ కళ్యాణ్‌పై ఎందుకు కేసు పెట్టలేదు

ఎందుకు కేసు పెట్టలేదని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత ప్రశ్నించారు. కేసు పెట్టడం చేతగాని ప్రభుత్వం తెలంగాణలో ఉందని విమర్శించారు. కరీంనగర్‌లో తెలంగాణ రక్షణ సేన జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఈ విషయాన్ని ప్రాధాన్యత లేని అంశంగా భావిస్తోందన్నారు. రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక పలువురు నేతలు తెలంగాణ భావజాలంపై దాడి చేస్తున్నారని ఆరోపించారు. ఉద్యమానికి అండగా నిలిచిన కరీంనగర్‌లో తెలంగాణ తల్లి విగ్రహం లేకపోవడం ప్రజల త్యాగాలను అవమాన పరిచినట్లేనని కవిత అన్నారు. ఇకపోతే మాజీమంత్రి కేటీఆర్‌పై కల్వకుంట్ల కవిత షాకింగ్ కామెంట్స్ చేశారు. కేటీఆర్ సిరిసిల్లాకు వీకెండ్‌లో వచ్చి వెళ్లిపోతారని ఎద్దేవా చేశారు. సిరిసిల్లలో కవిత పర్యటించి. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ సర్కార్ రైతన్నల నడ్డి విరిస్తే కేటీఆర్ ఎందుకు మాట్లాడట్లేదని ప్రశ్నించారు. సిరిసిల్లలో సెస్ ఆగమాగం అయితే కేటీఆర్ ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు. రైతు డిస్కంలపై ఇప్పటి వరకు కేటీఆర్ ఎందుకు నోరెత్తలేదని కవిత ప్రశ్నల వర్షం కురిపించారు. రైతు డిస్కం కావాలో, వద్దో ఆయన ఎందుకు చెప్పలేదని నిలదీశారు. నేరెళ్లలో అక్రమ ఇసుక సంపాదన కోసం దళితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని ధ్వజమెత్తారు. నేరెళ్ల బాధితులకు ఇప్పటి వరకు ఎలాంటి న్యాయం జరగలేదని చెప్పుకొచ్చారు. నేరెళ్ల ఇసుక బాధితుల తరపున కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. కార్పొరేటర్‌గా వచ్చి.. నేరెళ్ల బాధితుల ఓట్లతో బండి సంజయ్ కేంద్రమంత్రి అయ్యారని కవిత పేర్కొన్నారు.

## నీట్ రీటెస్ట్ నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు

ఎన్‌టిఎ తెలిపింది. విద్యార్థులు ప్రశాంతంగా ఉండి.. పరీక్ష సన్నద్ధతపై దృష్టి పెట్టాలని సూచించింది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 21న రీటెస్టు ఉంటుందని.. పరీక్ష వాయిదా పడుతుందన్న వదంతులను, సోషల్ మీడియా వేదికగా జరిగే దుష్ప్రచారాన్ని నమ్మొద్దని 'ఎక్స్' వేదికగా సందేశం విడుదల చేసింది. ఎన్‌టీఏ నుంచి వచ్చే అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని తెలిపింది. మరోవైపు.. పరీక్ష నిర్వహణపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అభ్యర్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే మే 3నాటి పరీక్షను రద్దు చేశాం. ఈ వ్యవహారం నుంచి పాఠాలు నేర్చుకుని పరీక్షా ప్రక్రియను మరింత బలోపేతం చేశాం. సంబంధిత మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు, భద్రతా సంస్థల సమన్వయంతో పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేశాం. పటిష్ఠమైన, బహుళ అంచెల భద్రతా చర్యలు తీసుకుంటున్నాం. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. పరీక్ష సంబంధిత ఒత్తిడిని ఎదుర్కొంటున్న విద్యార్థులు 'మానస్' మానసిక ఆరోగ్య హెల్ప్‌లైన్ నంబర్‌ను (14416) సంప్రదించి సాయం కోరవచ్చని ఎన్‌టీఏ సూచించింది.పరీక్షకు ఇంకా మూడు రోజులే మిగిలి ఉన్నాయి. ఇప్పటికే సిద్ధమయ్యారు.. కాబట్టి అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడంపైనే దృష్టి పెట్టండి. ప్రశాంతంగా ఉండండి. బాగా విశ్రాంతి తీసుకోండి. మీ నుంచి ఇదే కోరుకుంటున్నాం అని అభ్యర్థులను ఉద్దేశించి ఎన్‌టీఏ పేర్కొంది. తల్లిదండ్రులు, అధ్యాపకులు కూడా.. విద్యార్థులను ప్రశాంతంగా ఉంచాలని, ధ్రువీకరించని సమాచారాన్ని వారితో షేర్ చేసుకోవద్దని విజ్ఞప్తి చేసింది. వారు స్థిరమైన మనసుతో, నిశ్చింతగా పరీక్షకు వెళ్లేలా చూడాలని సూచించింది. పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో మే 3నాటి నీట్-యూజీ పరీక్ష రద్దయిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది.

## ప్రైవేట్ స్కూల్ ఫీజులను డిస్‌ప్లే చేయాలి

ఇకపోతూ పీఎంశ్రీ నిధుల వినియోగంలో దేశంలోనే నంబర్-1గా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. పీఎంశ్రీ పథకంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపిన అధికారులకు అభినందనలు తెలియజేశారు. గురువారం విద్యాశాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 844 స్మార్ట్ కిచెన్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ వేగవంతం చేయాలన్నారు. మెగా పీటీఎం నాటికి విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీని పూర్తి చేయడమే లక్ష్యమన్నారు. 430 కేజీబీవీల్లో 1.06 లక్షల మంది బాలికలకు బంక్ బెడ్స్ ఏర్పాటు చేయాలన్నారు. 53,180 బంక్ బెడ్స్ ఏర్పాటుకు తక్షణ చర్యలు చేపట్టాలని లోకేశ్ ఆదేశించారు. ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీల్లో కూడా బంక్ బెడ్స్ ఏర్పాటు చేయాలని మంత్రి తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 2.03 లక్షల మంది విద్యార్థులకు కిట్ల పంపిణీ చేయాలన్నారు. తెలుగు అకాడమీ పుస్తకాలు త్వరలో ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తాయని లోకేశ్ వెల్లడించారు. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ ద్వారా తెలుగు అకాడమీ పుస్తకాల విక్రయాలకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, హాజరు పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కర్నూలు, అనంతపురం, మార్కాపురం, అల్లూరి, పోలవరం ప్రాంతాలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల హాజరు 95 శాతానికి తగ్గకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని నాణ్యతతో, పారదర్శకంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. మ్యాథ్స్, సైన్స్, తెలుగులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. మాతృభాష తెలుగును విస్మరించొద్దని ఉపాధ్యాయులకు మంత్రి సూచనలు చేశారు. బ్రిడ్జ్ కోర్సు మెటీరియల్ సిద్ధం చేసి విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. వెనుకబడిన విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించాలని సూచించారు. హైస్కూల్ విద్యార్థులకు క్రోమ్ బుక్స్‌తో కంప్యూటర్ ల్యాబ్స్ ఏర్పాటు చేయాలని మంత్రి లోకేశ్ ఆదేశాలు జారీ చేశారు.

## హైదరాబాద్‌లో జనసేన కార్యాలయం

12.00 గంటలకు మల్కం చెరువు సమీపంలోని పార్టీ నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభిస్తారు. ఈ నూతన కార్యాలయంతో తెలంగాణలో పార్టీ విస్తరణకు పవన్ కల్యాణ్ శ్రీకారం చుట్టనున్నారని తెలుస్తోంది. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఇప్పటికే రాష్ట్రంలోని జనసైనికులు, వీరమహిళలు, నాయకులకు ఆహ్వానం అందినట్లు తెలుస్తోంది. పార్టీ నూతన కార్యాలయం ప్రారంభోత్సవానికి భారీగా జనసైనికులు తరలి వస్తారని నేతలు అంచనా వేస్తున్నారు. తెలంగాణ రాజకీయాల్లో జనసేన కార్యకలాపాలకు ఈ నూతన కార్యాలయం కేంద్రంగా మారనుందనే ప్రచారం సాగుతోంది. ఈ కొత్త కార్యాలయం ఏర్పాటు తర్వాత.. రాష్ట్రంలో పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణం, చేరికలపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫోకస్ చేస్తారని తెలుస్తోంది.

## టిఎంసికి హైకోర్టులో ఎదురుదెబ్బ

చేసింది. ఈ పిటిషన్ తదుపరి విచారణకు ముందే అఫిడవిట్ల మార్పిడిని పూర్తి చేయాలని ఇరు పక్షాలను ఆదేశించింది న్యాయస్థానం. ప్రతివాదులు మూడు వారాల్లోగా తమ వ్యతిరేక అఫిడవిట్‌ను దాఖలు చేయాలని, దానిపై మరో పక్షం వారు రెండు వారాల్లోగా స్పందించాలని గడువు విధించింది. ఈ విషయంపై తదుపరి విచారణ జులై 28కి వాయిదా వేసింది. దీంతో ఈ కేసు ఫలితం వెలువడే వరకు రితబ్రత బెనర్జీ గుర్తింపు పొందిన ప్రతిపక్ష నేతగా కొనసాగనున్నారు. కాగా.. టీఎంసీ నుంచి బహిష్కృతమైన రితబ్రత బెనర్జీ.. ఆ పార్టీకి వ్యతిరేకంగా తిరుగుబాటు ఎమ్మెల్యేలకు న్యాయకత్వం వహిస్తున్నారు. దీంతో బెంగాల్ రాజకీయ సంక్షోభంలో వివాదం రాజుకుంది. తమకు 58 మంది టీఎంసీ ఎమ్మెల్యేల మద్దతుందని పేర్కొంటూ, ఆమె మేనల్లుడైన అభిషేక్ బెనర్జీకి వ్యతిరేకంగా ఓ చీలిక వర్గాన్ని ఏర్పాటు చేశారు రితబ్రత. అయితే.. తిరుగుబాటు వర్గం వాదనను అంగీకరిస్తూ రితబ్రతను ప్రతిపక్ష నాయకుడిగా ఆ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రతీంద్ర బోస్ నియమించడంతో ఈ వివాదం మరింత ముదిరింది. స్పీకర్ నిర్ణయం అధికారికంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీని పక్కనపెట్టిందని, శాసనసభ పార్టీల గుర్తింపును నియంత్రించే రాజ్యాంగ నిబంధనల్ని ఉల్లంఘించిందని వాదిస్తూ.. దీదీ వర్గం కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.

## హర్మూజ్ తెరుచుకున్నా ఇంధన ధరలు తగ్గవు

చమురు ధరలు దిగిరానున్నాయి. అయితే, ముడి చమురు ధరలు తగ్గినా.. భారత్‌లో వెంటనే ఇంధన ధరలను మాత్రం తగ్గించలేమని కేంద్రం తాజాగా స్పష్టం చేసింది. పెట్రోలియం, సహజ వాయువు, పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ ఇటీవల ఇంధన ధరలు పెంచడంపై గురువారం మాట్లాడారు. లీటరుకు దాదాపు రూ.3.94 మాత్రమే పెంచామన్నారు. అయితే, అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గినంత మాత్రాన.. ఆ పెంపును వెంటనే తగ్గించలేమన్నారు. హర్మూజ్ జలసంధి తెరుచుకున్నప్పటికీ.. ప్రస్తుతం అక్కడ నౌకల రాకపోకల రద్దీ ఎక్కువగా ఉంటుందన్నారు. దీంతో తక్కువ ధరకు లభించే ముడి చమురు భారత్‌కు వచ్చేందుకు ఇంకా సమయం పడుతుందని తెలిపారు. ఇలా పలు అంశాల వల్ల ఇంధన ధరలను వెంటనే తగ్గించలేమని స్పష్టంచేశారు. ఇక, పశ్చిమాసియా యుద్ధం మొదలైనప్పటి నుంచి దేశంలోని చమురు కంపెనీలు తీవ్రంగా ప్రభావితమయ్యాయన్నారు. ఆ సమయంలో ఇంధన ధరలపై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించేందుకు ఏ రాష్ట్రం ముందుకు రాలేదన్నారు. దీంతో ఆ భారమంతా కేంద్రంపై పడిందన్నారు. దీని కారణంగా కేంద్రం రూ.12వేల కోట్ల మేర ఆదాయం కోల్పోయిందన్నారు.

## ప్రభుత్వ భూముల కబ్జా నిరోధానికే హైడ్రా

అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్‌లో రూ.17.84 కోట్లతో అభివృద్ధి పనులని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. 2018లో కొందరి కుట్ర వల్ల కొడంగల్‌లో ఓడిపోయానని చెప్పుకొచ్చారు. ఇక తాను ఏమీ చేయలేనని కొందరు భావించారని అన్నారు. మల్కాజ్‌గిరి ప్రజలు తనను ఎంపీగా గెలిపించారని తెలిపారు. ప్రశ్నించే గొంతు ఉండాలని నాడు ఎంపీగా తనను గెలిపించారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. తనను ఓడించాలని కొందరు ఎన్నో కుట్రలు పన్నారని ధ్వజమెత్తారు. ఇక్కడి ప్రజల అభిమానమే తనను ముఖ్యమంత్రిగా నిలబెట్టిందని వివరించారు. ఎల్బీనగర్ ప్రజలు తనకు 30 వేలకుపైగా ఓట్ల మెజారిటీ ఇచ్చారని అన్నారు. తన సొంతూరు కొండారెడ్డిపల్లి లాంటిదే తనకు ఎల్బీనగర్ అని అభివర్ణించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఎల్బీనగర్ అభివృద్ధిని పట్టించుకోలేదని మండిపడ్డారు. సీఎంగా ఎల్బీనగర్ సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానని మాటిచ్చారు. రంగారెడ్డి జిల్లాకు అన్నివిధాలా అండగా నిలుస్తున్నామని స్పష్టం చేశారు. కోహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కాలుష్య కోరల్లో చిక్కుకుని ఢిల్లీ ప్రజలు బాధపడుతున్నారని సీఎం వ్యాఖ్యానించారు. మన హైదరాబాద్‌కు అలాంటి పరిస్థితి రావొద్దనే మొక్కల పెంపకాన్ని ప్రోత్సాహిస్తున్నామని వివరించారు. మూసీ పునరుజ్జీవం చేస్తామంటే కొందరు అడ్డుపడుతున్నారని ఆగ్రహించారు. మూసీ ఒడ్డున నివసిస్తున్న ప్రజలను తరలించి.. అభివృద్ధి చేస్తామంటే కొందరు మోకాలడ్డుతున్నారని మండిపడ్డారు. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీకి ప్రణాళికలు సిద్ధం చేశామని స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీ కడతామంటే మళ్లీ ఫార్మా కంపెనీలు తెస్తామంటున్నారని చెప్పుకొచ్చారు. ఫ్యూచర్ లేనివాళ్లు ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తామంటున్నారని దుయ్యబట్టారు. ముందు సిద్దిపేట గెలిచిరండి.. ఆ తర్వాత రద్దుపై మాట్లాడదామని హితవు పలికారు. 60 శాతం గ్రీనరీ పెంచుతామంటే కేసులు వేశారని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరేమనుకున్నా మూసీ నది ప్రక్షాళన చేసి తీరుతామని రేవంత్‌రెడ్డి అన్నారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కి.మీ మేర ఈ పనులు చేపడతామని చెప్పారు. సబర్మతి, గంగా రివర్‌ఫ్రంట్‌ల కంటే మెరుగ్గా అంతర్జాతీయ స్థాయిలో దీన్ని తీర్చిదిద్దుతామన్నారు. కాలుష్య రహిత వాతావరణం ప్రజలకు ఇవ్వాలని ప్రయత్నిస్తున్నాం. నగర అవసరాల కోసం 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నాం. ఫ్యూచర్ లేని నేతలు ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని చెబుతున్నారు. వాళ్ల ఫ్యూచర్‌ను ప్రజలు నిర్ణయిస్తే.. ఫాంహౌస్‌కు పరిమితమయ్యారు. ఫ్యూచర్‌సిటీని రద్దు చేస్తానన్న ఆయన ఈసారి సిద్దిపేటలో గెలవరు. కొందరు ఎన్జీటీలో కేసులు వేస్తున్నారు. మూసీలో కాలుష్యం కంటే.. కల్వకుంట్ల వాళ్ల కడుపులో కాలుష్యమే ఎక్కువ. ఎవరు అడ్డుపడినా అంతర్జాతీయస్థాయిలో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించి తీరుతాం అని అన్నారు. కేసీఆర్ ఫ్యామిలీపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. గుర్రంగూడలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు అభివృద్ధి పనులను వర్చువల్ గా ప్రారంభించారు సీఎం రేవంత్. మూసీ పునరుజ్జీవం చేస్తామంటే అడ్డుపడుతున్నారని.. మూసీలో ఉండే కాలుష్యం కంటే కల్వకుంట్లోళ్ల కడుపులో విషం ఎక్కువని అన్నారు. మూసీ పునరుజ్జీవం వద్దంటున్న సుధీర్ రెడ్డి గతంలో మూసీ కార్పొరేషన్ చైర్మెన్ పదవి ఎలా తీసుకున్నారని ప్రశ్నించారు. భూకబ్జాలతో ప్రజలకు సమస్య రావొద్దని హైడ్రా తెచ్చామని... హైడ్రాను భూతంలా చూపిస్తున్నారని మండిపడ్డారు. హైడ్రా పేదల జోలికి వెళ్ళదని.. కబ్జాదారుల భరతం పడుతుందని అన్నారు. ఢిల్లీ కాలుష్య కోరల్లో చిక్కుకొని ప్రజలు ఇబ్బంది పడుతున్నారని.. మన హైదరాబాద్ కు ఆ పరిస్థితి రావొద్దని మొక్కల పెంపకం చేపట్టామని అన్నారు.

## వానాకాలం సాగుకు రైతులకు అండగా ప్రభుత్వం

మంత్రి కిసాన్ యోజన పథకం సంబంధిత నిధులను కేంద్రం ఈ నెల 20న విడుదల చేయనుంది. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలోని తారకేశ్వర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేయనున్నారు. దీంతో ఒక్కో రైతు ఖాతాలో రూ. 2 వేలు చొప్పున నగదు జమ కానుంది. దీంతో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు 10 రోజుల తేడాతో రైతుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నాయి. సచివాలయంలో మంత్రులతో ప్రత్యేకంగా నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై సీఎం చర్చించారు. హైదరాబాద్ మెట్రో రైలు, ధాన్యం కొనుగోళ్లు, వీబీజీ రాంజీ పథకం, కేంద్ర ప్రభుత్వ వైఖరి తదితర అంశాలపై మంత్రులతో చర్చలు జరిపారు. వానాకాలం రైతు భరోసా నిధులు విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నామని భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. జూన్ 30వ తేదీన మధిరలో రైతు సమ్మేళనం పేరిట నిర్వహించే బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులు విడుదల చేస్తారని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్ల సమావేశంలో వివరించారు. ఏడు రకాల సన్నాలకు బోనస్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. మార్కెట్లో వాటికి ఉన్న డిమాండ్ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మన రాష్ట్రం నుంచి కేంద్రం తక్కువ ధాన్యం సేకరించడంపై ఈ సమావేశంలో ఆందోళన వ్యక్తమైందని పేర్కొన్నారు. మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని డిమాండ్ చేశామని తెలిపారు. కేంద్రం కనీస మద్దతు ధర ఇచ్చి కొనే ధాన్యాన్ని మాత్రమే తెలంగాణ కొనాలని నిర్ణయించామన్నారు. ఎరువుల కోటాను వెంటనే విడుదల చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై పలుమార్లు కేంద్రానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖలు రాశారని గుర్తు చేశారు. త్వరలో ఢిల్లీకి వెళ్లి ఆయా అంశాలను కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని నిర్ణయించామన్నారు. రామగుండంలో తయారయ్యే యూరియాలో అత్యధిక శాతాన్ని తెలంగాణకే కేటాయించాలని కేంద్రానికి స్పష్టం చేశారు. అలాగే హైదరాబాద్ మెట్రో విస్తరణకు కూడా సహకరించాలని కేంద్రాన్ని కోరారు. అందుకు మెట్రో రెండో దశకు అనుమతి ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఐఆర్ఎఫ్‌సీ నుంచి రావాల్సిన రుణాన్ని వెంటనే విడుదల చేయించాలని కేంద్రాన్ని కోరుతున్నట్లు తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి అడ్డంకులు లేకుండా ప్రాజెక్టుల అనుమతులు ఇప్పించడానికి కలిసి రావాలని బీజేపీ ఎంపీలకు ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ పిలుపునిచ్చారు. ఇకపై డిజిటల్ క్యాబినెట్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. జూన్ 21వ తేదీన జరిగే నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని ఈ కేబినెట్ భేటీలో నిర్ణయించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఇక వీబీ- జీ ఆర్ఏఎం జీ పై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సబ్ కమిటీలో మంత్రులు సీతక్క, తుమ్మల, ఉత్తమ్ ఉంటారు. దీనిపై ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం తర్వాత.. జూన్ 25 లోపు ప్రభుత్వానికి కేబినెట్ సబ్ కమిటీ నివేదిక అందజేయనుందని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు.

## మాదక ద్రవ్యాల నిర్మూలనకు చర్యలు

తీర్చిదిద్దాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా విద్యార్థులతో కలిసి 'మాదకద్రవ్య రహిత పాఠశాలలు / కళాశాలలు' లక్ష్యంతో సామూహిక ప్రతిజ్ఞ చేయిస్తారు. ఈ ప్రతిజ్ఞ ద్వారా విద్యార్థుల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన పెంపొందించడం, నివారణ చర్యలను బలోపేతం చేయడం, విద్యాసంస్థల్లో సురక్షితమైన, ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన అభ్యాస వాతావరణాన్ని ప్రోత్సహించడం ప్రధాన ఉద్దేశ్యం. కార్యక్రమం లో దాదాపు 15వేల మంది విద్యార్థులు పాల్గొంటారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. వివిధ సంక్షేమ శాఖలు, విద్యా శాఖ సంబంధిత అధికారులకు కార్యక్రమ నిర్వహణకు అవసరమైన బాధ్యతలు కేటాయించబడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల సంక్షేమం, మాదకద్రవ్యాల నిర్మూలన, విద్యా రంగ బలోపేతానికి ఈ కార్యక్రమం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలవనుంది.

## ఆర్టీసీ ఉద్యోగులకు శుభవార్త

పొన్నం మాట్లాడుతూ.. నాగర్ కర్నూల్, పెద్దపల్లి బస్ డిపో పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. వేములవాడ, కథలాపూర్ బస్ స్టేషన్లకు త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. హుజూర్‌నగర్, కోదాడ, నాగర్‌కర్నూల్ బస్ స్టేషన్లకు కూడా మంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ములుగు బస్ స్టేషన్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మహాలక్ష్మి పథకంపై ప్రత్యేక అధ్యయనం చేయాలని సూచించారు. మహిళా సంఘాలకు చెందిన 553 బస్సుల పనితీరుపై మంత్రి నివేదిక కోరారు. రాష్ట్రంలో 1,050 ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణపై సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించారు. ఆర్టీసీ వద్ద 10,173 బస్సులు.. 38,128 మంది ఉద్యోగులు ఉన్నారని, రోజుకు 61 లక్షల మంది ప్రయాణికులు టీజీఎస్‌ఆర్టీసీ సేవలు పొందుతున్నట్లు తెలిపారు. పెండింగ్ కారుణ్య నియామకాలను వెంటనే పూర్తి చేయాలని అధికారులను పొన్నం ఆదేశించారు. తొలగించిన ఉద్యోగుల్లో 244 మందికి ఇప్పటికే విధుల్లోకి అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. ఉద్యోగి శంకర్ కుటుంబానికి రూ.1 కోటి చెక్కును ఆర్టీసీ అందజేయనున్నట్లు తెలిపారు. శంకర్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో పాటు, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినట్లు చెప్పారు. దక్షిణ భారత రవాణా శాఖ మంత్రులతో త్వరలో ప్రత్యేక సమావేశం జరగనుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

### రామగుండం ఎరువులు మనకే కేటాయించాలి

ప్రకటించి కొనుగోలు నుంచి తప్పుకుంటుందని మంత్రి తుమ్మల విమర్శించారు. ఒక్క గింజ మొక్కజొన్నని కూడా కేంద్రప్రభుత్వం ఎందుకు కొనలేదని నిలదీశారు. ఈ విషయాన్ని తెలంగాణ రైతాంగంపై కక్ష అనుకోవాలా అన్నారు. కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు మంత్రుల బృందం ఢిల్లీకి వెళ్తామని స్పష్టం చేశారు. తొలకరి వర్షానికే విత్తనాలు వేస్తే రైతులు నష్టపోతారని చెప్పారు. రెండుసార్లు వర్షం పడితేనే సరిపడా తడి వస్తుందని.. అన్నదాతలు ఈ విషయాన్ని గమనించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇకపోతే రైతు మరణించిన సందర్భంలో వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే రైతు బీమా పథకాన్ని ప్రభుత్వం అత్యంత బాధ్యతతో అమలు చేస్తోందన్నారు. ఎల్ఐసీకి చెల్లించాల్సిన మొత్తం వార్షిక ప్రీమియాన్ని ప్రభుత్వం ఇప్పటికే చెల్లించిందన్నారు. ల్గ÷తు బీమా పథకాన్ని నిలిపివేసినట్లు బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రచారం పూర్తిగా అసత్యమని మంత్రి తుమ్మల అన్నారు. రైతు సంక్షేమం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతులకు ఉపయోగపడే ఏ ఒక్క పథకాన్ని నిలిపివేసిన దాఖలాలు లేవని, పథకాలను నిలిపివేసి రైతులను ఇబ్బందులకు గురిచేసిన చరిత్ర గత ప్రభుత్వానిదే అని దుయ్యబట్టారు. గత ప్రభుత్వం రైతులకు ఉపయోగపడే వ్యవసాయ యాంత్రీకరణ, సాయిల్ హెల్త్ టెస్ట్, సబ్సిడీపై విత్తనాలు వంటి పథకాలను నిలిపివేయడమే కాకుండా స్టేట్ వాటాను విడుదల చేయకుండా కేంద్ర ప్రాయోజిత పథకాలను సైతం రైతులకు దూరం చేసిందని విమర్శించారు. మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఎలాంటి బేషజాలకు పోకుండా అమలు చేయడమే కాకుండా.. గత ప్రభుత్వం ఆపేసిన పథకాలను పునరుద్ధరిస్తూ రైతులకు అండగా నిలుస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదే అని పేర్కొన్నారు. మ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 66,038 మంది రైతుల కుటుంబాలు రైతు బీమా పథకం ద్వారా లబ్ది పొందాయని మంత్రి తెలిపారు. ఆయా కుటుంబాల నామినీల ఖాతాల్లో మొత్తం రూ. 3301.90 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. 2023 డిసెంబర్ నుంచి ఆ ఏడాది ముగిసే వరకు 20,090 కుటుంబాలకు రూ.1,004.50 కోట్లు, 2024 సంవత్సరంలో 25,861 కుటుంబాలకు రూ.1,293.05 కోట్లు బీమా సాయంగా అందించినట్లు వివరించారు. 2025-26 సంవత్సరానికి రాష్ట్రంలో 42.16 లక్షల మంది రైతులు రైతు బీమా పథకంలో నమోదు చేసుకున్నారని, వీరందరికీ వర్తించేలా ఎల్ఐసీకి చెల్లించాల్సిన మొత్తం వార్షిక ప్రీమియం రూ.1,359.56 కోట్లను ప్రభుత్వం పూర్తిగా చెల్లించిందన్నారు. దీంతో 20,087 కుటుంబాలకు రూ.1004.35 కోట్లు బీమా సహాయంగా అంది, మరణించిన రైతు కుంటుబాలకు ఆర్థిక చేయూత అందించడం జరిగిందని అన్నారు.

## ఆక్వా ఫీడ్ ధరలు తగ్గించాలి

ఉన్నతాధికారులు, ఆక్వా రైతులతోపాటు ఫీడ్ తయారీదారులు పాల్గొన్నారు. ఆక్వా సాగుకు యూనిట్ విద్యుత్ రూ.1.50కే ఇవ్వడంపై ముఖ్యమంత్రికి రైతులు ధన్యవాదాలు తెలిపారు. గోదావరి జిల్లాలకే పరిమితమైన ఆక్వా సాగును శ్రీకాకుళం జిల్లా నుంచి నెల్లూరు జిల్లా వరకు తీర ప్రాంతం పొడవునా విస్తరించేలా చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతోందని ఈ సందర్భంగా రైతులు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఫీడ్ ధరలు ఆరు సార్లు పెంచారని గుర్తు చేశారు. అయినా నాటి ప్రభుత్వం ధర తగ్గింపుపై చొరవ తీసుకోలేదని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు దృష్టికి ఆక్వా రైతులు తీసుకెళ్లారు. తాము ఎప్పుడూ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరించ లేదని.. ఇటీవల కొందరు రైతుల ముసుగులో రాజకీయం చేశారని సీఎంకు ఆక్వా రైతులు వివరించారు. 2019లో కేజీ ఫీడ్ ధర రూ.87.80 ఉంటే గత ప్రభుత్వం దిగిపోయే నాటికి అది రూ.107.80కి చేరిందని సీఎం చంద్రబాబుకు రైతులు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఫీడ్ ధర రూ.5.80 తగ్గించిందని రైతులు గుర్తు చేశారు. ఉత్పత్తి వ్యయం తగ్గించుకుని మరింత లాభాలు పొందేలా చర్యలు చేపట్టాలని రైతులకు సీఎం సూచించారు. లక్షలాది మంది ఆధారపడిన ఆక్వా రంగాన్ని పరిరక్షించే బాధ్యత కూటమి ప్రభుత్వానిదని ఈ సందర్భంగా రైతులకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టి సారించారు. గురువారం అమరావతిలోని సచివాలయంలో పొగాకు, మామిడి, ఆక్వా ధరలపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పొగాకు మార్కెట్ పరిస్థితులపై, సంబంధిత రైతుల సమస్యలు, ధరల స్థిరీకరణపై చర్చించారు సీఎం. పొగాకు బోర్డు ప్రతినిధులతో సీఎం చంద్రబాబు కీలక సమావేశం నిర్వహించారు. మామిడి రైతుల సమస్యలు, మార్కెటింగ్ అవకాశాలపై సమీక్షించారు. మామిడి దిగుబడులు, ధరల పరిస్థితులపై ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ఉన్నతాధికారులు ఓ నివేదిక అందజేశారు. అదే విధంగా ఆక్వా రంగంలో ధరల హెచ్చుతగ్గులపైనా చర్చించారు సీఎం. రొయ్యలు, చేపల రైతుల సమస్యలపై ఈ సమీక్ష సమావేశంలో విస్తృతంగా చర్చించారు. రొయ్యల ఫీడ్ తయారీ సంస్థల ప్రతినిధులతోనూ ఆయన భేటీ అయ్యారు. ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు, హ్యాచరీల ప్రతినిధులు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. వ్యవసాయం, ఉద్యానవన, మత్స్యశాఖల ఉన్నతాధికారులతో ఈ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు పాల్గొన్నారు.

## మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

నిర్వహించారు. ఈ సమావేశంలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు. ఉర్దూ అకాడమీ స్వర్ణోత్సవాల సందర్భంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో ఉర్దూ సంస్కృతిని ప్రతిబింబించేలా పెద్ద ఎత్తున 'ముషాయిరా' (కవి సమ్మేళనాలు) నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఈ కార్యక్రమం నిర్వాహణకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలను అన్ని రకాల ఆధునిక హంగులు, వసతులతో నిర్మిస్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 20 రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని, మరో 17 పాఠశాలలు నిర్మాణ దశలో ఉన్నాయని అధికారులు ఈ సందర్భంగా వివరించారు. దీనిపై భట్టి విక్రమార్క స్పందిస్తూ... అసంపూర్తిగా మిగిలిపోయిన మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల భవనాల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. పనులు ఎక్కడా ఆగకుండా ఒక నిర్ణీత టైమ్ క్యాలెండర్‌ను రూపొందించుకుని, దాని ప్రకారమే పనులు పూర్తయ్యేలా పర్యవేక్షణ చేయాలని, మిగిలిన 17 పాఠశాల భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మైనార్టీ యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణించేందుకు మరియు వారిని ఆర్థికంగా నిలబెట్టడానికి రాజీవ్ యువ వికాసం' పథకం ద్వారా పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ పథకం అమలు చేయడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమం కొరకు ప్రత్యేకంగా రూ. 50 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నిధులను క్రిస్టియన్ మైనార్టీ యువత స్వయం ఉపాధి రంగంలో రాణించడానికి తగిన ఆర్థిక ప్రోత్సాహం అందించడానికి కేటాయిస్తామన్నారు. మైనార్టీ సంస్థలకు సంబంధించిన విలువైన వక్ఫ్ మరియు ఇతర భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడేందుకు తగిన చట్టపరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే, మైనార్టీల స్మశాన వాటికల చుట్టూ ప్రహరీ గోడల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ఇందుకోసం తక్షణమే ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న జిల్లా, డివిజన్ కేంద్రాల్లో స్మశాన వాటికల ఏర్పాటుకు అవసరమైన స్థలాలను సేకరించి కేటాయించాల్సిందిగా జిల్లా కలెక్టర్లకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేయనున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. హైదరాబాద్ నగరంలో జరగబోయే మొహర్రం వేడుకల సందర్భంగా, 9వ రోజున నిర్వహించే ప్రత్యేక కార్యక్రమానికి హాజరుకావాల్సిందిగా మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ కోరగా.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించి, తప్పకుండా హాజరవుతానని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ప్లానింగ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ గౌరవ ఉప్పల్, ఫైనాన్స్ సెక్రెటరీ సిక్తా పట్నాయక్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా, మైనార్టీ ÷నాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కోత్వాల్ ఉన్నారు.

## కొత్త డార్క్ వెబ్‌గా టెలిగ్రామ్ యాప్

చేసింది. ఈ యాప్‌ను 'కొత్త డార్క్ వెబ్'గా పేర్కొన్న కేంద్రం.. ఇది నేరగాళ్లకు అడ్డగా మారిందని ఆరోపించింది. సైబర్ నేరగాళ్లు, అతివాదులు, డ్రగ్ ముఠా సభ్యులు చట్టం నుంచి తప్పించుకునేందుకు ఈ యాప్ ను ఎక్కువగా వినియోగిస్తున్నారని దుయ్యబట్టింది. ఈ మేరకు ఢిల్లీ హైకోర్టుకు అఫిడవిట్ సమర్పించింది. నీట్ రీఎగ్జామ్ నేపథ్యంలో దేశంలో టెలిగ్రామ్ వినియోగంపై కేంద్రం ఇటీవల తాత్కాలిక నిషేధం విధించిన సంగతి తెలిసిందే. దీన్ని సవాల్ చేస్తూ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ కేసు విచారణలో భాగంగా కేంద్రం గురువారం అఫిడవిట్ దాఖలు చేసింది. నీట్ యూజీ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా దుమారం లేపిన నేపథ్యంలో.. జూన్ 21న రీటెస్ట్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఈ పరీక్షకు సంబంధించిన కొన్ని ముఠాలు టెలిగ్రామ్ వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ ఇటీవల దీనిపై కేంద్రం తాత్కాలిక నిషేధం విధించింది. ప్రశ్నపత్రాల లీకేజీ, తప్పుడు వార్తల వ్యాప్తిని నివారించేందుకు, మోసపూరిత నెట్‌వర్క్‌లను అరికట్టడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం తెలిపింది. జూన్ 22 వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించింది. ఈ సందర్భంగా క్రిమినల్ నెట్‌వర్క్‌లు, అతివాద ముఠాలు, సైబర్ నేరగాళ్లు ఈ యాప్‌ను దుర్వినియోగం చేస్తున్న తీరును కేంద్రం అందులో వివరించింది. గోప్యతకు సంబంధించి టెలిగ్రామ్‌లో ఉన్న అధునాతన ఫీచర్లు క్రిమినల్ నెట్‌వర్క్‌లను ఎక్కువగా ఆకర్షిస్తున్నాయని పేర్కొంది. ఇందులోని ప్రైవసీ సెట్టింగ్‌లతో యూజర్లు తమ టెలిగ్రామ్ ఐడీలు, ఫోన్ నంబర్లు వంటి గుర్తింపు వివరాలను దాచిపెట్టేందుకు వీలు లభిస్తోంది. దీనివల్ల అసలు వ్యక్తులు ఎవరో గుర్తించడం దర్యాప్తు అధికారులకు కష్టంగా మారుతోంది. ఈ ఫీచర్ల వల్లే నేరగాళ్లు ఈ యాప్‌ను దుర్వినియోగం చేసి మాదకద్రవ్యాల అక్రమ రవాణా, దోపిడీ, ఉగ్రదాడులు, మోసాలు వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఇది కొత్త డార్క్ వెబ్‌గా మారింది. క్రిమినల్స్ డార్క్ వెబ్ లింక్‌లతో పరస్పరం అనుసంధానం చేసుకుంటున్నారు. దీంతో అధికారులు వారిని ట్రాక్ చేయలేక పోతున్నారని కేంద్రం తమ అఫిడవిట్‌లో ఆరోపించింది. ఇక, హింసాత్మక, తీవ్రవాదం, ఉగ్రవాద సంస్థలకు సంబంధించిన కంటెంట్‌ను ప్రచారం చేయడానికి టెలిగ్రామ్ గ్రూపులు, ఛానెళ్లను ఉపయోగిస్తున్నారని కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది. దీనివల్ల తప్పుడు సమాచారం వేగంగా వ్యాప్తి చెందుతోందని, ఫలితంగా శాంతిభద్రతలకు భంగం వాటిల్లుతోందని ఆరోపించింది. పిల్లలపై లైంగిక దాడుల వంటి దృశ్యాలను ఈ యాప్ గ్రూప్‌ల్లో విపరీతంగా షేర్ చేస్తున్నట్లు తెలిపింది. సైబర్ నేరగాళ్లు ఈ వేదికపై నకిలీ ఖాతాలను సృష్టించి.. ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారని మండిపడింది. ఈ మెసేజింగ్ ఎ÷-లాట్‌ఫామ్ దుర్వినియోగంపై ఇటీవలి కాలంలో నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌కు ఫిర్యాదులు పెరిగినట్లు పేర్కొంది. హ్యాకర్ గ్రూప్‌లు కూడా ఈ టెలిగ్రామ్ ఛానళ్లను ఉపయోగించి పెద్ద ఎత్తున డేటా చౌర్యానికి పాల్పడుతున్నట్లు కేంద్రం తన అఫిడవిట్‌లో వెల్లడించింది. అంతేగాక, యూజర్ల వ్యక్తిగత డేటా అయిన మొబైల్ నంబర్లు, ఆధార్ వివరాలు, ఇతర సున్నితర సమాచారాన్ని యాక్సెస్ చేసేలా టెలిగ్రామ్ బాట్స్ పనిచేస్తుండటంపై కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మాధ్యమంలో పైరసీ సినిమాలు, వెబ్ సిరీస్‌లు, కాపీరైట్ కంటెంట్ కూడా ప్రసారమవుతున్న విషయాన్ని కేంద్రం కోర్టు దృష్టికి తీసుకెళ్లింది.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

## సంపాదకీయం

# విద్యారంగంలో మార్పులు కావాలి !

తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభం ఒక గొప్ప ముందడుగనే చెప్పాలి. అందరికీ విద్య అన్నది ప్రభుత్వ పరంగా చేపట్టడం ఆహ్వానించదగ్గ విషయం. విద్య,వైద్యం విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకుంటే ఓ ఐదేళ్లలో గణనీయమైన మార్పులు తీసుకుని రావచ్చు. గ్రామస్థాయి వరకు ప్రాథమిక విద్య, ప్రాథమిక వైద్యం అందితే ప్రజలకు అంతకు మించి కావాల్సింది లేదు. కులాలు, మతాల వారీగా హాస్టళ్లు, స్కూళ్ల వల్ల సమాజంలో అసమనాతలు పెరిగాయి. ఇదే విషయాన్ని పదేపదే ప్రస్తావిస్తున్న సిఎం రేవంత్ ఓ మంచి అడుగు వేశారనే చెప్పాలి. అయితే ఇదొక్కటే సరిపోదు. రేవంత్ రెడ్డి పదవీ కాలంలో రెండున్నరేళ్లు పూర్తయ్యాయి. ఇంకా రెండేళ్ల పదవీకాలం మాత్రమే ఉంది. కనీసం ఉన్న స్కూళ్లనయినా బాగుచేసి, హాస్టళ్లను స్కూళ్లకు అనుసంధానం చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టాలి. కెసిఆర్ హయాంలో కెజి టూ పిజి అని ప్రగల్భాలు పలికారు. కానీ దానిని ఏనాడు పట్టాలకు ఎక్కించలేక పోయారు. ఆనాడే చేసివుంటే పదేళ్లలతో తెలంగాణ విద్యావ్యవస్థ రూపురేఖలు మారి ఉండేవి. ఇప్పటికైనా కామన్ విద్యావిధానం తీసుకుని రావాలి. అందరికీ ఒకేచోట విద్యను తీసుకుని వస్తే ప్రైవేట్ స్కూళ్ల దోపిడీ కూడా తగ్గుంది. గ్రామాల్లో కూడా సామాన్య జనం నేటికీ అప్పులు చేసి పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపుతున్నారు. దీనిని తక్షణం నిరోధించాలి. ఈ దోపిడీని అరికట్టాలి. స్కూళ్లను అభివృద్ది చేయడం వల్ల సమాజాంలో కులాల మధ్య అంతరాన్ని తొలగించడంతో పాటు, కుటుంబాల ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దవచ్చు. ప్రైవేట్ దోపిడీని అరికట్టవచ్చు. అలాగే ఏకీకృత విద్యకు కృషి చేయాలి.

విద్యా వివక్షను రూపుమాపాలంటే కామన్ స్కూల్ విధానం వెంటనే అమలు చేయాల్సి ఉంది. తెలంగాణ పబ్లిక్ స్కూల్ కాన్సెప్ట్‌ను సిఎం తప్పనిసరిగా అమలు చేయగలిగితే అతిపెద్ద విజయం సాధించినట్లుగా చెప్పవచ్చు. అలా కాకుండా తెలంగాణ పబ్లిక్ స్కూల్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల పేరుతో ప్రభుత్వం ఎన్ని సంస్కరణలు ప్రవేశపెట్టినా లాభం ఉండదు. ఎంతగా డబ్బులు ఖర్చు చేసినా అత్యధిక విద్యార్థులున్న ప్రైవేటు విద్యా సంస్థలను నియంత్రించకుండా, ప్రభుత్వ బడులను సంస్కరించకుండా ముందుకు సాగితే సత్ఫలితాలు సాధించలేం. ప్రభుత్వ బడికి గతంలో ఉన్న ఇమేజ్ తీసుకుని రావాలంటే ప్రైవేటుకు దీటుగా ఉన్నాయన్న భరోసా కల్పించాలి. అందుకు గట్టి కృషి చేయాలి. నాణ్యమైన ఉచిత విద్య ప్రభుత్వ బడిలో దొరుకుతుందనే గట్టి నమ్మకం మాత్రమే ప్రభుత్వ విద్యా సంస్థలలో నమోదు పెంచుతుంది. కాబట్టి పాలకులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే గ్రామాల వారీగా ఏకీకృత కామన్ పాఠశాల వ్యవస్థకు రూపకల్పన చేయాలి. అంతేగాక ఇబ్బడి ముబ్బడిగా కనీస వసతులు లేకుండా నడుస్తున్న ప్రైవేటు విద్యా సంస్థలను నిషేధించాలి. లేదా నియంత్రణ చర్యలు చేపట్టాలి. ఇలా చేయగలిగితే సిఎం రేవంత్ ర ఎడ్డి ఆశించిన ఫలితాలు వస్తాయి. అంతరాలు లేని శాస్త్రీయ విద్య అందరికీ అందుబాటులోకి వస్తుంది. కామన్ స్కూల్ విధానం మాత్రమే ప్రజలకు ఏకైక విద్యా ప్రత్యామ్నాయంగా గుర్తించి ముందుకు సాగేందుకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానం దోహదపడుతుంది.ఽ

గ్రామాల్లో నర్సరీ నుంచి ఇంటర్ వరకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఒకే స్కూల్ ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలి. తెలుగు మీడియం అయినా ఆంగ్లబోధనను కూడా తప్పనిసరి చేయాలి. స్పోకెన్ ఇంగ్లీష్‌తో దీన్ని అధిగమించవచ్చు. ఇప్పుడు విద్యారంగానికి ఖర్చు చేస్తున్న నిధులతోనే ఏకీకృత విద్యను అందుబాటులోకి తీసుకుని రావచ్చు. గ్రామస్థాయి నుంచి పట్టణస్థాయి వరకు అందరి పిల్లలు ఒకే పాఠశాలలో చదువుకునే ఏకీకృత విధానం అమలు కావాలి. అక్కడే విద్యార్థులు బ్రేక్ ఫాస్ట్ మొదలు, మధ్యాహ్న భోజనం అందించాలి. ఇంటి నుంచి పిల్లలు స్కూలుకు వచ్చేలా అవసరమైతే ట్రాన్స్‌పోర్టు కూడా ఏర్పాటు చేయాలి. ఇది కుల, మత వైషమ్యాలు లేని విద్యా వ్యవస్థకు పునాది వేయగలదు. ఒక మండల కేంద్రంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ లాంటి స్కూల్ ఉంటే ఆ చుట్టుపక్కల విద్యార్థులంతా స్కూల్ బస్సుల్లో వచ్చి పోయేలా సౌకర్యాలు కల్పించాలి. దీనివల్ల పిల్లలు తల్లిదండ్రుల సమక్షంలోనే పెరగగలరు. హాస్టళ్లలో పడి బాల్యం కోల్పోకుండా చూడగలం. తల్లిదండ్రుల అజమాయిషీలో వారికి ఖర్చు లేకుండా అంతా ప్రభుత్వ కనుసన్నల్లో విద్యను నేర్చుకోగలరు. ఇలా కిలోమీటరు నుంచి ఐదు కిలోమీటలర్ పరిధి వరకు పిల్లలకు స్కూలును అందుబాటులోకి తీసుకుని రావడం ద్వారా సంక్షేమ హాస్టళ్ల బాధ తప్పుతుంది.

ఇకపోతే ప్రత్యేక అవసరాలు గల మూగ, బధిర, అంధ బాలలకు మాత్రం ప్రత్యేకంగా పాఠశాలలను ఏర్పాటు చేసి, దానికి అనుబంధంగా మాత్రం హాస్టళ్లను కొనసాగించాలి. మానసిక ఎదుగుదల లేని పిల్లలు ప్రత్యేక అవసరాలు గల పిల్లలుగా గుర్తించినా, వారిని తల్లిదండ్రుల ప్రత్యేక పర్యవేక్షణ కిందనే ఉంచి, పాఠశాలల వసతులను కల్పించాలి. అభివృద్ధి చెందిన అమెరికా, బ్రిటన్ లాంటి దేశాల్లో సైతం ఏకీకృత పాఠశాల వ్యవస్థ ప్రభుత్వ రంగంలోనే విస్తృతంగా అభివృద్ధి చెందింది. మన దేశంలో నియంత్రణ, నియమాలు లేకుండా విచ్చలవిడిగా ప్రైవేటు పాఠశాల వ్యవస్థను అనుమతించడం వల్ల విద్యావ్యవస్థ వెర్రితలలు వేసింది. అవసరాలకు మించి ప్రైవేటు పాఠశాలల ఏర్పాటుతో ప్రభుత్వ పాఠశాల వ్యవస్థ దెబ్బ తింటోంది. తెలంగాణలో ఇప్పటికే నాలుగు వేల పాఠశాలలు మూతపడ్డాయని అంటున్నారు. 19లక్షల విద్యార్థులు ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుతుంటే, 36లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు విద్యా సంస్థలలో చదువుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. మనకు ఇంగ్లీష్ లేనిదే ముద్ద దిగదు. సామాన్యులు కూడా తమ పిల్లలు ఇంగ్లీషులో మాట్లాడాలని అనుకుంటారు. అందుకు ప్రభుత్వ స్కూళ్లలో స్పోకెన్ ఇంగ్లీష్ తప్పనిసరి చేయాలి. ఎల్‌కెజి నుంచే అది మొదలు కావాలి. మీడియం తెలుగు అయినా స్పోకెన్ ఇంగ్లీష్ ఉంటే పిల్లలు కూడా పెద్దయ్యాక బెరకు లేకుండా దూసుకు పోగలరు. ఇవన్నీ గమనించి విద్యారంగాన్ని పటిష్టం చేసే చర్యలకు అడుగులు వేస్తే విద్యారంగంలో విప్లవం సాధించగలం.

## యెల్ల శ్రీనివాస్‌కు దుబాయ్‌లో ఘన నివాళి

**-రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గల్ఫ్ కార్మికుడు**

**-ఎన్ఆర్ఐ పాలసీ ద్వారా రూ.5 లక్షలు అందించాలని విజ్ఞప్తి**



హైదరాబాద్, జూన్ 18 (విజన్ ఆంధ్ర) : రాజన్న సిరిసిల్ల జిల్లా చెందుర్తి మండలం కట్టలింగంపేట్ గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికుడు, తెలంగాణ గల్ఫ్ గంగపుత్ర ఐక్యత సంక్షేమ సంఘం సభ్యుడు యెల్ల శ్రీనివాస్ రుద్రంగి మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తో దుబాయ్‌లో సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళు లర్పించారు. సభ్యులు పూలమాలలు వేసి, 5 నిమిషాల పాటు మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఎన్ఆర్ఐ పాలసీని వెంటనే అమలు చేసి, శ్రీనివాస్ కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డికి సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. నివాళుల కార్యక్రమంలో జీడబ్ల్యూఏసీ గల్ఫ్ వింగ్ అధ్యక్షులు రవి కటుకం, సంఘం అధ్యక్షులు తోకల శంకర్, ఉపాధ్యక్షులు బింగి రాజు, ప్రధాన కార్యదర్శి పల్లికొండ గంగనర్సయ్యతో పాటు పుట్టి రాజు, బింగి నరసయ్య, ఉట్నూర్ నర్సయ్య, ఇల్లుటపు నరేష్, మేడి రమేష్, పల్లికొండ అనిల్, జుంబర్తి నరేష్, జుంబర్తి తిరుపతి, కల్లెడ మహేష్, కొండ్రా నారాయణ, బింగి పోచన్న, బింగి పవన్, మేడి సుధాకర్, కునరపు రాకేష్ తదితరులు పాల్గొని అశ్రు నివాళులు అర్పించారు.

## సేంద్రియ వ్యవసాయ విధానాన్ని అవలంబించాలి - ఎంపీ నగేశ్




ఆదిలాబాద్, జూన్ 18 (విజన్ ఆంధ్ర): జిల్లాలోని రైతులందరూ సేంద్రియ వ్యవసాయ విధానాన్ని అవలంబించాలని ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యుడు గోడం నగేశ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రకృతి వ్యవసాయంపై కార్యశాల కార్యక్రమంలో ఎంపీ నగేశ్ పాల్గొని మాట్లాడారు. సేంద్రియ వ్యవసాయ విధానాలతో ఆరోగ్యంతో పాటు ప్రకృతి పర్యావరణాన్ని సైతం రక్షించవచ్చునని పేర్కొన్నారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రవీందర్, గంగాధర్, బీజేపీ జిల్లాధ్యక్షుడు పతంగి బ్రహ్మానందం, కిసాన్ మోర్చా అధ్యక్షుడు రామదాస్, జనరల్ సెక్రటరీ స్వామి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గంగాధర్ రావు, ఓబీసీ జిల్లా మోర్చా అధ్యక్షులు జీవీ రమణ, నాయకులు వెంకటస్వామి, చంద్రకాంత్, జాదవ్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రత పాటించని హోటల్ కు రూ, 2 వేలు జరిమానా



మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 18,(విజన్ ఆంధ్ర) : మంచిర్యాల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ లో గల ఓ హోటల్ పరిశుభ్రత పాటించక పోవడంతో ఆ హోటల్ నిర్వాహకునికి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు సానిటరీ విభాగం ఇన్స్పెక్టర్ వైకుంఠం రెండు వేల రూపాయలు జరిమానా విధించారు.గురువారం స్థానిక బస్టాండ్ ఆవరణలో ఉన్న ఓ హోటల్ లో పక్కనే డ్రైనేజి పొంగుతున్న మరో వైపు అక్కడే పిండి రుబ్బడం ప్రయాణికులను ఆలోచింప జేసింది. ఇంత నిర్లక్ష్యం గా, ప్రజల ఆరోగ్యం తో చెలగాటం ఆడటమే కాకుండా పరిశుభ్రత పాటించని హోటల్ పై చర్యలు తీసుకోవాలని సోషల్ మీడియాలో వీడియో చక్కర్లు కొట్టగా వెంటనే స్పందించిన సంబంధిత అధికారులు ఆ హోటల్ కు జరిమానా విధించారు. అంతే కాకుండా మరోసారి ఇలాగే జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు.అధికారులు వెంటనే స్పందించిన తీరును స్థానికులు హర్షించారు.సానిటరీ ఇన్స్పెక్టర్ తో పాటు ఆ వార్డు జవాన్ రాజలింగు ఉన్నారు.

# మత సామరస్యానికి ప్రతీక మొహరం వేడుకలు

**- హిందూముస్లింలఐక్యతకు నిదర్శనంమొహరం వేడుకలు...**

**- దోస్తారావుద్దీన్ అందునా....దోస్త్ కట్టుకుందామా.**

**- ఘనంగా ప్రారంభమైన మొహరం వేడుకలు.**

**- సంతాప మాసంగా మొహరం.**

నారాయణపేట, జూన్ 18 (విజన్ ఆంధ్ర) ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే అత్యంత వైభవంగా పది రోజుల పాటు ఊట్కూర్, మండల కేంద్రంలో మొహరం గ్రామీణ ప్రాంతాల్లో (పీర్ల పండుగ) వేడుకలు అత్యంత వైభవంగా కొనసాగుతాయి. నెలవంక కనిపించడంతో మొహర్రం సందడి నెలకొంది. ఊరు వాడలో మొహరం పీర్ల పండుగ పురస్కరించుకొని వాడవాడలా మహిళల, బొడ్డెమ్మలు, యువకుల ఆలాయి తో రాత్రివేళ పల్లెల్లో పండగ వాతావరణం నెలకొంది.

హిందూ,ముస్లింల మత సామరస్యానికి ప్రతీకగా కలిసి మెలిసి సోదర భావంతో జరుపుకునే ఏకైక పండుగ మొహర్రం. కుల మతాలకతీతంగా భక్తిశ్రద్ధలతో మొహరం వేడుకలు జరుపుకుంటారు. మంగళవారం నెలవంక చంద్రుడు దర్శనం ఇవ్వడంతో బుధవారం నుంచి మొహర్రం ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. పాలమూరు జిల్లాలో పదిరోజుల పాటు ఎంతో ప్రతిష్టాత్మకంగా మోహ ర్రం ఉత్సవాలను ప్రజలు జరుపుకుంటారు. చంద్రవంక దర్శనం ఇవ్వడంతో ముతావలిలు పీర్ల చావడీ ముందు అలై గుంతను తీసి పీర్ల మజీదుల్లో పీర్లను ప్రతిష్ఠిస్తారు. గ్రామ గ్రామాన పర్లంరోజుల పాటు అలైగుంత చుట్టు డ స్వదరువుతో అలై అడుతూ పాడుతారు మహిళలు బొడ్డేమ్మలు ఆడడం ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది. వి షాదానికి గుర్తుగా ముస్లిం మహిళలు మాడంను పాటిస్తారు.ఉమ్మడి పాలమూరు జిల్లాలో మొహరం వేడుకలకు ఎంతో ప్రాధాన్యత ఉంది.ఇక్కడ ప్రజలు గ్రామ గ్రామాన పీర్ల ఉత్సవాలను ఎంతో ఉత్సాహభరితంగా జరుపుకుంటారు. ప్రత్యేకంగా జిల్లాలోని కోయిలకొండ బీబీ పాతిమా సవారి తర్వాత ఊట్కూర్ మండల కేంద్రం లోని హస్సన్, ఉస్సెన్ సవారిలు ఎంతో వైభవంగా కొనసాగుతాయి. వివిధ రాష్ట్రాలకు వెళ్లిన వలస కూలీలు గ్రామా లు వదిలి వలస వెళ్లిన పల్లె ప్రజలు మొహర్రం పండుగ కు తమ సొంత గ్రామాలకు వస్తారు. కోరిన కోర్కులు తీ ర్చే మహిమలు గల అన్నదమ్ములు హస్సన్, హుస్సేన్ కు మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా కొనసాగుతూ వస్తోంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు సొంత ఊర్లకు వస్తున్నాడంతో పల్లెలు సందడిగా కనిపిస్తున్నాయి.

**మొహరం వేడుకలు కొనసాగుతాయి ఇలా...**

ఉమ్మడి పాలమూరు జిల్లాలో అత్యంత వైభవంగా ఊట్కూర్ మండల కేంద్రంలో జరిగే మొహరం వేడుకలు ఇలా కొనసాగుతాయి. ఊట్కూర్ మండల కేంద్రంలోని పాతపేట అక్బర్ అలీ,ఎంకంపేట అలీ అబ్బాస్ పీర్ల పండుగ ఈనెల 22 న సోమవారం రాత్రి సవారి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈనెల 25న గురువారం రాత్రి హసేన్ హుస్సేన్ పీర్ల ఊరేగింపు గ్రామ పురవీధుల గుండా కొనసాగుతూ దేవినగర్ లో ఉయ్యాల కార్యక్రమం కన్నుల పండువగా కొనసాగుతుంది. 26న శుక్రవారం సాయంత్రం హసేన్ హుస్సేన్ పీర్ల నిమజ్జన ఊరేగింపు గ్రామ పురవీధులుగా గుండా చేపట్టి అదే రోజు రాత్రి ఊట్కూర్ పెద్ద చెరువులో నిమజ్జనం చేయడంతో మొహరం వేడుకలు ముగుస్తాయి.

**భారీగా కందుర్లు చేయనున్న భక్తులు....**

ప్రత్యేక వాహనాల్లో ఊట్కూర్, కు వచ్చి హస్సన్, ఉస్సెన్ల పేర గొర్రెలు, మేక పోతులను కోసి పాతెహ (నైవేద్యం) సమర్పిస్తారు. మొక్కుకున్న వాళ్ళు, కోరికలు తీరిన వాళు పీర్లకు వెండి, బంగారం గొడుగులు, ఉయ్యాలలు, దట్టీలు సమర్పించుకుంటారు. ఉత్సవాల సందర్భంగా పీర్లను పట్టుకునే వారి శరీరంలో దేవుడు ప్రవేశిస్తాడని వారు చెప్పే మాటలు నిజమవుతాయనే విశ్వాసంతో ప్రజలు పీర్లు లేవగానే దేవుని ముందు నిలబడి తమ కష్ట సుఖాలు వెలబుచ్చుకొని పరిష్కారానికై కోరుకుంటారు.



దారి పొడవున పాదాలకు నీళ్లుపోస్తూ పొర్లు దండాలు పెడతారు. ఊట్కూర్ పీర్ల ఉత్సవాల్లో పీర్ల వెంట అగ్ని గుండంలోంచి నడిచి రావడం ఆకర్షణీయంగా ఉంటుంది. పీర్లు పట్టే వ్యక్తుల వంశంలో మగ పిల్లవాడు ప్రతీ సంవత్సరం పుడుతాడు. ఆ పిల్లవాన్ని పేర్ల తొట్లలో వేసి వేసి నామకరణం చేయడం కొన్ని వందల ఏళ్ల నుండి వస్తున్న ఆనవాయితీ.

**సంతాపదినాలు పాటిస్తున్న ముస్లిం మైనార్టీలు....**

ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం సంవత్సరంలో మొదటి మాసం మొహర్రం. ఈ మాసంలో ధర్మ రక్షణ కోసం ఎందరో మృతి చెందారని దీనిని సంతాప దినాలుగా ప్రకటించారు. దీంతో ఈ మాసంలో ఎలాంటి నూతన సంవత్సర వేడుకలు కానీ, శుభకార్యాలు గానీ జరుపరు. అందరూ విషాదం పాటిస్తా రు. మోహర్రం మాసంలోని 9, 10 తేదీల్లో ముస్లింలు ఉపవాసాలు నిర్వహిస్తారు. మొహర్రం వేడుకల్లో భాగంగా షియా వర్గానికి చెందిన వారు ఉత్సవాల్లో ఎదపై బ్లేడులతో గాట్లు పెట్టుకొని హాసన్ హుస్సేన్ అని మాచం పెడుతూ ఊరేగింపు నిర్వహిస్తారు. ఇది మన రాష్ట్రంలోని హైదరాబాద్, లో ప్రధానంగా కన్పిస్తుంది. ఉయ్యాల ఊపడం ప్రత్యేకత ఉంటుంది. వందలాదిమం ది వివిధ గ్రామాల నుంచి ప్రత్యేక వాహనాలు, బండ్లను కట్టుకువచ్చి గొర్రెపోతులు కోసి పీర్లకు నైవేద్యం స మర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. ఈ ఉత్సవాల కు హైదరాబాద్, వరంగల్, ముంబై పుణే, బెంగళూరు,షోలాపూర్, భీమండి, రాయిచూర్,

తో పాటు ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు తరలివస్తారు. మ లంలో మొహర్రం మాసం ప్రారంభం నుంచి 6, 7వ తేదీల్లో పులిమామిడి, చిన్నపొర్ల గ్రామాల్లో ఖాసీం ఉత్సవాలు, 3వ రోజు నిడుగూర్తి, ఊట్కూర్, లో జరిగి ఉత్సవాలు, పదో రోజు కోయిల్ కొండలో జరిగే ఉత్సవా ఎంతో వైభవంగా జరుగుతాయి. మొహరం ఉత్సవాల్లో భాగంగా భారీగా తరలివచ్చే భక్తులకు ఊట్కూర్ తాసిల్దార్ అశోక్ కుమార్, సర్పంచ్ ఎం. రేణుక భరత్, ఎస్సై రమేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, తోపాటు మజీద్ నిర్వాహకులు ముమ్మారంగా ఏర్పాట్లు చేస్తున్నారు. వేడుకలు ప్రశాంతంగా జరిగే విధంగా పోలీసులు అన్ని వర్గాల ప్రజలతో శాంతి సమావేశాలు నిర్వహిస్తారు.

# దొర గారి మెప్పు కోసమే కొప్పుల, ఆర్ ఎస్ పీ ఆరాటం..

**- కేసీఆర్ అవమానించినప్పుడు దళితుడిగా కొప్పులకు అండగా నిలిచిన..**

**- దోచుకోవడం బీఆర్ఎస్ పార్టీకి పెటెంట్ హక్కు..**

**- కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు జీవన్ రెడ్డి వాట ఎంతో చెప్పాలి..**

**- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..**



కరీంనగర్. (విజన్ ఆంధ్ర బ్యూరో) జూన్ 18..: కరీంనగర్ లో మంత్రి మాట్లాడుతూ.హరీష్ రావు దొర మెప్పు పొందడానికి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ పార్టీ కార్యదర్శిగా ఉన్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తనపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో దొరలు అవమానించినప్పుడు కొప్పుల ఈశ్వర్ కు సాటి దళితుడిగా అండగా నిలిచానని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. దోచుకోవడం దాచుకోవడం బీఆర్ఎస్ పార్టీకి పెటెంట్ హక్కు అని, కాంగ్రెస్ పార్టీలో ఉన్న సమయంలో జీవన్ రెడ్డికి వచ్చిన వడ్ల కమీషన్ ఎంతో చెప్పాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురువారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి అడ్లూరి మాట్లాడుతూ ఏడాది క్రితం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రిగా తాను బాధ్యతలు తీసుకున్నానని మంత్రి అడ్లూరి అన్నారు. గత ప్రభుత్వంలో సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పని చేశారని, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురుకుల పాఠశాల కార్యదర్శిగా పని చేశారని ఏడాది కాలంగా ఎందుకు ఆయా శాఖలపై మాట్లాడలేదని మంత్రి అడ్లూరి ప్రశ్నించారు. సంక్షేమ శాఖలో రూ. 2వేల కోట్ల అవినీతి జరిగిందని హరీష్ రావు ఆరోపిస్తే ఆశాఖ మంత్రిగా జవాబు చెప్పాల్సిన బాధ్యత తనపై ఉందని మంత్రి అడ్లూరి అన్నారు. సంక్షేమ శాఖకు సంబంధించి విద్యార్థులకు కావాల్సిన వస్తువుల కొనుగోలుకు రూ. 683 కోట్లతో టెండర్లు పిలిచామని, రూ. 500 కోట్లతో ప్రభుత్వ రంగ సంస్థలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం టెండర్ల ఖారారు చేశామని మంత్రి అడ్లూరి తెలిపారు. మొత్తం రూ. 1183 కోట్లకు టెండర్లు పిలిస్తే మాజీ మంత్రి హరీష్ రావు రూ. 2వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపిస్తే ఆశాఖ మంత్రిగా జవాబు చెప్పానని మంత్రి అడ్లూరి అన్నారు. తాను జవాబు చెప్పితే దొరగారి మెప్పు కోసం కొప్పుల ఈశ్వర్ ఖాబ్దార్ అని మాట్లాడుతున్నారని మంత్రి అడ్లూరి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొప్పుల ఈశ్వర్ కు అవమానం జరిగితే తాను సాటి దళితుడిగా ఆరోజు ప్రతిపక్షంలో ఉండి అండగా నిలిచానని మంత్రి అడ్లూరి అన్నారు. 2018 ఎన్నికల్లో కొప్పుల ఈశ్వర్ ఏలా గెలిచాడో తెలంగాణ ప్రజలందరికి తెలుసని అన్నారు. కొప్పుల మంత్రిగా ఉన్న సమయంలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూం తాళం పోతే ఎక్కడ పోయిందని అడిగితే మంత్రి ఉన్న కొప్పుల ఈశ్వర్ సమాధానం చెప్పాలేదని మంత్రి అడ్లూరి అన్నారు. కొప్పులపై తాను 2009లో పోటీ చేస్తే కేవలం1165ఓట్ల తేడాతో ఓడిపోయానని, 2014లో 16వేల మెజార్టీతో ఓడిపోయానని, తెలంగాణ కోసం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు పోటీ చేసిన సమయంలో రాష్ట్రంలో ఎవ్వరికి డిపాజిట్ రాలేదని తనకు మాత్రమే డిపాజిట్ వచ్చిందని మంత్రి అడ్లూరి గుర్తు చేశారు. ధర్మపురి ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసిన కొప్పుల ఈశ్వర్ నియోజకవర్గానికి ఏమీ చేయలేదని మంత్రి అడ్లూరి అన్నారు. ధర్మపురికి డిగ్రీ కళాశాల, రెవెన్యూ డివిజన్, ఆర్టీసీ బస్సు డిపో ఏమీ తీసుకురాకపోవడంతోనే 2023 ఎన్నికల్లో ఈశ్వర్ కు ప్రజలు బుద్ధి చెప్పారని మంత్రి అడ్లూరి అన్నారు. 2024 పార్లమెంట్ఎన్నికల్లో సైతం ధర్మపురి నియోజకవర్గ ఓటర్లు కొప్పులకు ఓట్లే వేయలేదని మంత్రి అడ్లూరి తెలిపారు. దోచుకోవడం దాచుకోవడం బీఆర్ఎస్ పార్టీకి పెటెంట్ హక్కు అని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గతంలో సంక్షేమ శాఖ మంత్రిగాఉన్న కొప్పుల, గురుకుల కార్యదర్శిగా ఉన్న ప్రవీణ్ కుమార్ కలిసి దోచుకున్నారు కనుక ఇప్పుడు ఇలా మాట్లాడుతున్నారని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పారదర్శకంగా పని చేస్తుందని మంత్రి పేర్కొన్నారు.

**జీవన్ రెడ్డి వాటాఎంతో చెప్పాలి..**

కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు, మాజీ మంత్రి జీవన్ రెడ్డి వడ్ల కొనుగోలులో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్నారని, జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉన్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వం నాలుగు సీజన్లలో వడ్లు కొనుగోలు చేసిందని, మరి అప్పుడు జీవన్ రెడ్డి గారికి ఎంత కమీషన్ వచ్చిందో చెప్పాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు.

## మందిరాలలో దొంగతనాలకు పాల్పడుతున్న హర్యానా గ్యాంగ్ అరెస్ట్.

**- వివరాలు వెల్లడించిన నగర సిఐ శ్రీనివాస్ రాజు**




నిజామాబాద్ జూన్18:( విజన్ ఆంధ్ర ) : వివిధ ప్రాంతాలలోని మందిరాలలో చోరీలకు పాల్పడుతున్న హర్యానాకు చెందిన దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు నగర సిఐ శ్రీనివాస్ రాజు తెలిపారు. ఈ మేరకు గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దొంగలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. హార్వెస్టర్ పని కోసం వచ్చి నిజామాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాలలో గల గుడులలో హర్యానాకు చెందిన ముఠా చోరీలకు పాల్పడినట్లు తెలిపారు. పంజాబ్ కు చెందిన రింకు సింగ్, రవి సింగ్, అమన్ దీప్ సింగ్ లు ముఠాగా ఏర్పడి మందిరాలను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలు చేసినట్లు తెలిందన్నారు. నిజామాబాద్ నగరంలోని మూడవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు దొంగతనాలు, రెండవ టౌన్ పరిధిలో ఒక దొంగతనం, మాక్లూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక దొంగతనం, ఐదవ టౌన్ పరిధిలో రెండు దొంగతనాలు, ఆర్మూర్ ప్రాంతంలో రెండు దొంగతనాల కేసులు ఈ ముఠా పై నమోదైనట్లు సీఐ శ్రీనివాసు రాజు తెలిపారు. గుడిలలో దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ కు తరలించడం జరిగిందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మూడవ టౌన్ ఎస్ఐ హరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## జల్సాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడి.

**- ఎట్టకేలకు పోలీసులకు చిక్కిన దొంగ.**

**- వివరాలు వెల్లడించిన ఎస్ హెచ్ ఓ సునీల్**

నిజామాబాద్ జూన్18:( విజన్ ఆంధ్ర) : జల్సాలకు అలవాటు పడిన ఓ వ్యక్తి వరుస చోరీలకు పాల్పడుతూ ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. ఈ దొంగకు సంబంధించిన వివరాలను ఐదవ టౌన్ ఎస్హెచ్ఓ సునీల్ గురువారం వెల్లడించారు. శాంతినగర్ కు చెందిన రియాజ్ ఖాన్ జల్సాలకు పడి, డబ్బులు లేకపోవడంతో ఎలాగైనా సరే దొంగతనం చేసి వచ్చిన డబ్బులతో జల్సాలు చేయాలనే ఉద్దేశంతో చోరీలకు పాల్పడ్డాడు. ఇందులో భాగంగా ఈ నెల 17వ తేదీన అర్ధరాత్రి రెండు గంటల సమయంలో శాంతినగర్ లోని అజ్మీర్ బేగం ఇంటిలోకి చొరబడి బీరువాను పగలగొట్టి లక్ష ఇరవై వేల నగదు, ఆరు గ్రాముల చెవి కమ్మలు, 20 తులాల వెండి పట్టగొలుసులు దొంగతనం చేసి పారిపోయినట్లు ఎస్హెచ్ఓ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దార్యాప్తు చేపట్టడం జరిగిందన్నారు.



గురువారం ఖిల్లా చౌరస్తా దగ్గర అతని ఇంటి వద్ద పట్టుకొని అతని నుండి లక్ష పదివేల నగదు, ఒక ఇనుప సుత్తే స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నేరస్తున్ని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు హాజరు పర్చనున్నట్లు వెల్లడించారు. ఇతనిపై నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ లో రెండు దొంగతనం కేసులు, వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో 1 కేసు, 3 టౌన్ పోలీస్ స్టేషన్లో ఒక కేసు ఉన్నట్లు ఎస్హెచ్ఓ పేర్కొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

- వనమహోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి. చిన్నారెడ్డి
- వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడంలో మొక్కలు కీలక పాత్ర పోషిస్తాయి
- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి





వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 18 (విజన్ ఆంధ్ర) : వనపర్తి పట్టణంలోని ఎకో పార్క్‌లో గురువారం అటవీ శాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి. చిన్నారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు పాఠశాల విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి వాటికి నీరు పోశారు. అనంతరం మాట్లాడిన ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు మాట్లాడుతూ, హైదరాబాద్‌లోని గుర్రంగూడలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వనమహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. అదే స్ఫూర్తితో వనపర్తి ఎకో పార్క్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది 16 కోట్ల మొక్కలు నాటే లక్ష్యంతో ముందుకు సాగుతోందని, వనపర్తి జిల్లాకు 24 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించినట్లు చెప్పారు. ప్రకృతి సమతుల్యతకు చెట్లు ఎంతో ముఖ్యమని, మంచి వర్షాలు కురవాలంటే విస్తృతంగా మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం సుమారు 24 శాతం మాత్రమే అటవీ విస్తీర్ణం ఉందని, దానిని 33 శాతానికి పెంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ, జిల్లాలో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించామని తెలిపారు. ముఖ్య అతిథులతో పాటు విద్యార్థులు తమ పేర్లపై మొక్కలు నాటడం అభినందనీయమన్నారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడాన్ని బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడంలో మొక్కలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్న కలెక్టర్, నాటిన ప్రతి మొక్కను సంరక్షించడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. జిల్లాకు నిర్దేశించిన 24 లక్షల మొక్కల లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో నడుంబిగించి మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్, జెడ్పి సీఈవో యాదయ్య, స్థానిక కౌన్సిలర్ మహేశ్వరి, అటవీ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతినెలా 100కు పైగా మొబైల్ ఫోన్ల రికవరీ
# ఈ ఏడాది ఇప్పటివరకు 1.05 కోట్ల విలువైన 658 ఫోన్లు స్వాధీనం

- గత 30 రోజుల్లోనే 25.44 లక్షల విలువైన 159 మొబైల్ ఫోన్లు రికవరీ చేసిన ప్రత్యేక బృందం
- సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఇప్పటివరకు 4,939 మొబైల్ ఫోన్లు గుర్తింపు 7.90 కోట్ల విలువైన ఫోన్లు బాధితులకు అప్పగింత
- మీ ఫోన్ పోయిందా? ఆందోళన వద్దు. సీఈఐఆర్ పోర్టల్‌తో తిరిగి పొందండి
- ఎస్పీ యం. రాజేష్ చంద్ర



కామారెడ్డి బ్యూరో జూన్ 18(విజన్ఆంధ్ర) మొబైల్ ఫోన్ పోయిందని లేదా చోరీకి గురైందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ' సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను సులభంగా తిరిగి పొందవచ్చని కామారెడ్డి జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, భరోసా ఇచ్చారు. ప్రస్తుత డిజిటల్ కాలంలో మొబైల్ ఫోన్ అనేది కేవలం సమాచార సాధనం మాత్రమే కాకుండా బ్యాంకింగ్ వివరాలు, వ్యక్తిగత ఫోటోలు, కీలకమైన డేటాను కలిగి ఉండే అత్యంత ముఖ్యమైన పరికరమని ఆయన పేర్కొన్నారు. ఫోన్ పోగొట్టుకోవడం వల్ల వ్యక్తిగత భద్రతకు, గోప్యతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉన్నందున, జిల్లా పోలీసు యంత్రాంగం మొబైల్స్ రికవరీపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని వివరించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలనే లక్ష్యంతో ఇన్‌స్పెక్టర్ సంపత్ పర్యవేక్షణలో, ఆర్ఎస్ఐ బాలరాజు ఐదుగురు కానిస్టేబుళ్లతో కూడిన ఒక ప్రత్యేక సాంకేతిక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ బృందం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రతి నెల సగటున 100కు పైగా మొబైల్ ఫోన్లను రికవరీ చేస్తూ బాధితుల్లో నమ్మకాన్ని పెంపొందిస్తోందని కొనియాడారు. జిల్లాలో రికవరీల గణాంకాలను వెల్లడిస్తూ.. ఇటీవల నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా గత 30 రోజుల్లోనే 25.44 లక్షల విలువైన 159 మొబైల్ ఫోన్లను రికవరీ చేశామని, అలాగే ఈ ఏడాది ఇప్పటివరకు సుమారు 1.05 కోట్ల విలువైన 658 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. గత ఏడాది కూడా సుమారు 3 కోట్ల విలువైన 1,834 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశామని గుర్తుచేశారు. సిఈఐఆర్ పోర్టల్ అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు కామారెడ్డి జిల్లాలో మొత్తం 4,939 మొబైల్ ఫోన్లను ట్రాక్ చేసి, గుర్తించి.. సుమారు 7.90 కోట్ల విలువైన ఫోన్లను బాధితులకు విజయవంతంగా అప్పగించడం జరిగిందని ఎస్పీ సగర్వంగా ప్రకటించారు. ఈ సందర్భంగా మొబైల్ రికవరీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రత్యేక బృందాన్ని ఆయన అభినందించారు. మొబైల్ ఫోన్ పోయిన వెంటనే ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని, కాలయాపన చేయకుండా వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు, దుర్వినియోగం కాకుండా సిమ్ కార్డును బ్లాక్ చేయాలని సూచించారు. అనంతరం అధికారిక వెబ్‌సైట్లో ఫోన్ ఐఎంఈఐ నంబర్‌ను బ్లాక్ చేయాలని కోరారు. పోయిన మొబైల్ ఫోన్ల ద్వారా సైబర్ మోసాలు జరిగే అవకాశం ఉన్నందున, గుర్తుతెలియని లింకులు, అనుమానాస్పద కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. రికవరీ అయిన మొబైల్ ఫోన్లను పొందేందుకు బాధితులు తమ వద్ద ఉన్న సంబంధిత ధ్రువపత్రాలతో జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆర్ఎస్ఐ బాలరాజు (ఫోన్: 8712686114) సంప్రదించి తమ మొబైల్ ఫోన్లను పొందవచ్చని తెలిపారు.

# ప్రజల నమ్మకమే పోలీసులకు గెలుపు

- వనపర్తి ఎస్పీ సునిత రెడ్డి





వనపర్తి జిల్లా ప్రతినిధి,జూన్ 18 విజన్ ఆంధ్ర : పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడు, పోలీసు శాఖ తనకు అండగా ఉందనే నమ్మకంతో తిరిగి వెళ్లాలని వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి స్పష్టం చేశారు. గురువారం వనపర్తి జిల్లా పెద్దమందడి పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన వార్షిక తనిఖీల్లో ఆమె పాల్గొన్నారు. బాధితులకు న్యాయం చేయడం, నేరాల నియంత్రణలో ఆధునిక సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవడం ప్రతి అధికారి ప్రధాన బాధ్యతని ఆమె గుర్తు చేశారు. స్టేషన్ చేరుకున్న ఎస్పీకి పోలీసు అధికారులు ఘనస్వాగతం పలికారు. ముందుగా స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటిన ఎస్పీ, ఆ తర్వాత స్టేషన్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. జనరల్ డైరీ, బీట్ డ్యూటీ బుక్స్, సస్పెక్ట్ చెక్ రిజిస్టర్‌ల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఎస్సై జలంధర్ రెడ్డితో సమీక్షా సమావేశం నిర్వహించి, పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశించారు. గంజాయి, మట్కా, పేకాట వంటి నేరాలపై నిరంతర నిఘా ఉంచాలి. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలి. బ్లాక్ స్పాట్లను గుర్తించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలి. సిబ్బంది అందరూ హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం తప్పనిసరి. సీసీటీఎన్ఎస్-2.0, టీఎస్-కాప్, సిఈఐఆర్ వంటి యాప్స్‌పై సిబ్బంది పూర్తిస్థాయి పట్టు సాధించాలి. విలేజ్ పోలీస్ అధికారులు గ్రామస్తులు, యువతతో సత్సంబంధాలు కొనసాగిస్తూ నేరాలపై ముందస్తు సమాచారాన్ని సేకరించాలి.

ఉత్సాహంగా వాలీబాల్ క్రీడ

వార్షిక తనిఖీ అనంతరం, స్టేషన్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన వాలీబాల్ కోర్టును ఎస్పీ ప్రారంభించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కలిసి కాసేపు వాలీబాల్ ఆడి వారిని ఉత్సాహపరిచారు. అలాగే, ఎస్సై జలంధర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఎస్పీ ఆయనకు కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డీఎస్పీ గిరిబాబు, కొత్తకోట సీఐ రాంబాబు, డీసీఆర్బీ ఎస్సై తిరుపతి రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వనపర్తి పార్కులకు కొత్త కళ.. అభివృద్ధి పనులపై కలెక్టర్ కీలక ఆదేశాలు..




వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 18 (విజన్ ఆంధ్ర) వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని పార్కులను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతూ ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి గురువారం పట్టణంలోని వెంగల్‌రావు కాలనీలో గల మున్సిపల్ పార్కును సందర్శించి అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. ముఖ్యంగా చిన్నారులు ఆడుకునే ప్రాంతాన్ని తనిఖీ చేసి పార్కు అభివృద్ధికి సంబంధించిన అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు పార్కులో ఓపెన్ జిమ్, చిన్నారులు ఆడుకునేందుకు కొత్త పరికరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరగా, త్వరలోనే ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. పార్కును మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతూ ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి పనులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు.

మహిళా వ్యవసాయ డిగ్రీ కళాశాల సందర్శన

అనంతరం కలెక్టర్ భగీరథ కాలనీలోని మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల బాలికల వ్యవసాయ డిగ్రీ కళాశాలను సందర్శించారు. కళాశాల ప్రాంగణం, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి విద్యార్థినులతో నేరుగా మాట్లాడారు. కళాశాల మరియు హాస్టల్‌లో అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. పాత క్యాంపస్‌తో పోలిస్తే కొత్త కళాశాల భవనంలో మెరుగైన వసతులు అందుతున్నాయా అని విద్యార్థినులను ప్రశ్నించగా, వారు సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలతో చదువుకొని జీవితంలో మంచి స్థాయికి చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. విద్యతోనే భవిష్యత్తు నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొంటూ క్రమశిక్షణతో చదువుపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, 27వ వార్డు కౌన్సిలర్ జంగిడి సరిత రవి యాదవ్, 28వ వార్డు కౌన్సిలర్ కోట్ల శిరీష రవి, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, తదితరులు పాల్గొన్నారు.

# బి ఆర్ ఎస్ వి నాయకుల అక్రమ అరెస్ట్..



సూర్యాపేట జూన్ 18:(విజన్ ఆంధ్ర) : ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని పాఠశాలలో కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ నిరసనలకు పిలుపునిచ్చిన బి.ఆర్.ఎస్ వి నాయకులను అక్రమ అరెస్టు చేయడం తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశత్వానికి అద్దం పడుతుందని టిఆర్ఎస్వి సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ లు కల్లెట్లపల్లి శోభన్ బాబు, ముదిరెడ్డి అనిల్ రెడ్డి, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆకుల లవకుశ లు అన్నారు. విద్యా రంగ, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరసనలకు పిలుపునిచ్చిన బిఆర్ఎస్వి నాయకులను గురువారం వేకువజామున పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి ఆయా పోలీస్ స్టేషనులకు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా..? అని పోలీసులు దుర్మార్గంగా వ్యవహరిస్తూ బి ఆర్ ఎస్ విద్యార్థి నాయకులను అక్రమంగా అరెస్ట్ లు చేస్తున్నారనీ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని సమస్యలపై ప్రశ్నించినా, నిలదీసినా కేసులు పెట్టడం, అరెస్టులు చేయడం దురదృష్టకర మన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తుంచుకోవాలనీ కేసులకు, అరెస్టులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటామనీ ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారెంటీలను పూర్తిగా అమలు చేసే వరకు నిరంతరం ప్రజల తరఫున ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. ప్రజల హక్కుల కోసం మా పోరాటం నిరంతరం కొనసాగుతుందన్నారు. ఫీజ్ రియాంబర్స్మెంట్ పెండింగ్ బకాయిలు విడుదల చేసి,పాఠశాలల్లో విద్యార్థులకు కనీస వసతులు కల్పించెంత వరకు మా పోరాటం ఆగదనీ అక్రమ అరెస్టులతో అడ్డుకోవాలని చూస్తే మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రఫీ, రాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపుఇవ్వాలి

- తపస్ జిల్లా శాఖ పక్షాన కలెక్టర్ ఏవో కు వినతి.



నారాయణపేట, జూన్ 18 (విజన్ ఆంధ్ర) : ఉపాధ్యాయ అర్హత పరీక్ష నుండి 2010 కి ముందు నియామకం పొందిన ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నారాయణపేట జిల్లా శాఖ పక్షాన కలెక్టరేట్, లో పరిపాలన అధికారి అనిల్ కుమార్ కు గురువారం. వినతిపత్రం సమర్పించారు. ఈ వినతి పత్రాలను ప్రధానమంత్రి, కేంద్ర విద్యా శాఖ మంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రిలకు పంపలనికోరారు. రాబోయే శీతాకాల సమావేశంలో ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొచ్చి టెట్ మినహాయింపు తప్పకుండా ఇవ్వాల్సిందేనని కోరారు. పరీక్ష విధానం మారకుండా ఎన్నిసార్లు టెట్ రాసిన ఉపాధ్యాయులకు సరైన న్యాయం జరగదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నరసింహ రవీందర్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి షేక్ కృష్ణారెడ్డి రాష్ట్ర నాయకులు గుంపు బాల్ రాజు మండల నాయకులు శ్రీనివాస్ చిన్ననర్సిములు జగదీష్ పాల్గొన్నారు.


# ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొని ఒకరు మృతి



కామారెడ్డి బ్యూరో జున్ 18 (విజన్ఆంధ్ర) : గురువారం కామారెడ్డి జిల్లా దేవునిపల్లి పోలీస్ స్టేషన్లో పరిధిలోని ఎల్చిపూర్ రోడ్ లోని చర్చి సమీపంలో రోడ్డుపై రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనగా, ఒక బైక్ పై ప్రయాణిస్తున్న పుల్గం వెంకటస్వామి తండ్రి రాజయ్(39) సంవత్సరాలు, నందివాడ గ్రామం తాడ్వాయి మండలం కు చెందిన వ్యక్తికి తలకు గాయంతో అక్కడికక్కడే మరణించాడు. మరణించిన వ్యక్తి ఒక కంపెనీలో రికవరీ ఏజెంట్గా పని చేస్తారని. ఎస్సై రంజిత్ కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# మేధావులు ప్రధానికి అండగా నిలవాలి

- నాగురావు నామాజీ



నారాయణపేట , జూన్ 18 ( విజన్ ఆంధ్ర) : ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ సుపరిపాలన మరింత ముందుకు సాగేందుకు భారత్ విశ్వగురుగా నిలిచేందుకు మేధావులు అండగా నిలవాలని బిజెపి రాష్ట్ర సీనియర్ నేత, రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు,సంపర్క్ అభియాన్ రాష్ట్ర కమిటీ సభ్యులు నాగురావు నామాజీ కోరారు. ప్రధాని నరేంద్రమోడీ 12 యెండ్ల సుపరిపాలన పుర్తి చెసుకున్న సందర్భంగా రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు గురువారం నారాయణపేట మండలం జాజాపూర్ గ్రామంలో సమాజ ప్రతిష్ఠిత వ్యక్తుల సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భగంగా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలోపాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ కోట్ల జగన్ మోహన్ రెడ్డి,రిటైర్డ్ ఉపాధ్యాయులు గోపాల్గౌడ్, నిజలింగప్ప, ప్రస్తుత సర్పంచ్ సంగీత రాములు ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను కలిసి ప్రధాని నరేంద్ర మోదీ వికసిత్ భారత్ గురించి, కేంద్ర ప్రభు త్వం సాధించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిం చారు. అన్ని రాష్ట్రాలు సమానమనీ,అన్ని మతాలు సమానమని సబ్ కా సాత్ సబ్ కా వికాస్ అనే నినాదంతో దేశాన్ని ముందు కుతీసుకెళుతున్నారని అన్నారు. దేశ హితం కోసం దేశాన్ని విశ్వ గురుగా నిలబె ట్టేందుకు ప్రధాని మోదీకి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు రామకృష్ణ గౌడ్, గ్రామ మాజీ సర్పంచ్ బి.కిష్టప్ప,ఉప సర్పంచ్ లక్ష్మణ్ ,బిజెపి నాయకులు ఆర్ .సూర్యకాంత్, బిజెపి గ్రామ అధ్యక్షుడు వడ్ల గోవిందు, మిడియా కన్వినార్ కిరణ్ పాల్గొన్నారు.

# కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థల దోపిడినీ అరికట్టాలి

- టీబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్.కె. పాషా



మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 18,(విజన్ ఆంధ్ర ) : జిల్లాలోని కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులను ఫీజుల పేరుతో నిలువు దోపిడీ చేయడాన్నీ తెలంగాణ బహుజన విద్యార్థి సమాఖ్య (టీబీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా అధ్యక్షులు ఎస్ కే పాషా అన్నారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో అయన మాట్లాడారు. జిల్లాలోని కార్పొరేట్ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలల్లో అడ్మిషన్ల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను ఒత్తిడికి గురిచేస్తూ, మరోవైపు అడ్మిషన్ పొందిన విద్యార్థుల కు సంబంధించి ఫీజు కన్ఫర్మేషన్, అడ్మిషన్ ఫీజు అంటూ అక్రమంగా దోపిడీకి పాల్పడుతున్నారని అన్నారు. పుస్తకాలు, యూనిఫాంల పేరు తో విద్యార్థుల తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. ఈ విషయాలపై జిల్లా విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తుందని, మరోవైపు కొన్ని కార్పొరేట్ సంస్థల యాజమాన్యాలు విద్యాశాఖ అధికారులు మమ్మల్ని ఏం చేయలేరంటూ బాహాటంగానే చెబుతూ ప్రశ్నించే వారిపై మావి కార్పొరేట్ సంస్థలు అన్నంత ఫీజులు చెల్లించే స్థోమత లేని వారు ప్రభుత్వ పాఠశాలలో వేసుకోవాలని ఎదురుదాడికి దిగుతున్నారని వాపోయారు. పుస్తకాలను ఆయా పాఠశాలలకు దగ్గరలోని ఏదో ఒక శెట్టర్ రూమ్, లేదా ఇంటిని అద్దెకు తీసుకుని బహిరంగంగానే విక్రయిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు నిద్రమత్తు వీడి విద్యా సంవత్సరం ప్రారంభం అయి రెండు రోజులన్న గడవక ముందే వివిధ రకాల పేర్లు (టెక్నో,ఐఐటీ, నీట్, స్మార్ట్, ఐ.పి.ఎల్, సి.బి.ఎస్.ఈ, ఇంటర్నేషనల్, ఓలాంపియాడ్, కాన్సెప్ట్, ఎక్సలేన్సివ్) లాంటి పదాలు తగిలించి కనీస మౌలిక వసతులు లేకుండా ఇష్టానుసారంగా నియంత్రణ లేని ఫీజులను వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్నారని అన్నారు. కార్పొరేట్ పాఠశాలలపై విద్యా శాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో తెలంగాణ బహుజన విద్యార్థి సమాఖ్య (టీబీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో పలు ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జాగిరి రాజశేఖర్, ఎం.డి.ఖదీర్,ఖలీల్, సోఫియాను తదితర నాయకులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నావంతు కృషి చేస్తా

- ఇండ్ల స్థలాలపై పలుమార్లు సీఎంకు విన్నవించా
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- పండుగ వాతావరణంలో కొత్తగూడెం ప్రెస్ క్లబ్ ప్రారంభోత్సవం



కొత్తగూడెం బ్యూరో, జూన్ 19(విజన్ ఆంధ్ర): జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల కేటాయింపుపై ఇప్పటికే పలుమార్లు ముఖ్యమంత్రితో చర్చించినట్లు తెలిపారు. గురువారం కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన కొత్తగూడెం ప్రెస్ క్లబ్‌ను కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమం పండుగ వాతావరణంలో జరగగా, పలువురు జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్టులు సమాజాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి కొనసాగుతుందని, వారి ఇండ్ల స్థలాల అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూనే ఉంటానని తెలిపారు. అలాగే జర్నలిస్టుల అవసరాల కోసం కొత్తగూడెంలో పది ఎకరాల స్థలాన్ని ఇతర అవసరాలకు మళ్లించకుండా కాపాడుతున్నట్లు వెల్లడించారు. మేయర్ మూడ్ గణేష్ మాట్లాడుతూ జర్నలిస్టులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, నగర సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కె. సాబీర్ పాషా మాట్లాడుతూ జర్నలిస్టుల ఇండ్ల స్థలాల అంశంపై ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం హామీలకే పరిమితమైందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా ఈ అంశంలో వేగంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రెస్ క్లబ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పలువురు సీనియర్ రిపోర్టర్లు, జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# అరణ్య అర్బన్ పార్కును వర్చువల్ గా ప్రారంభోత్సవం చేసిన సీ.ఎం

- పాల్గొన్న ఎమ్మెల్యే, కలెక్టర్

నిజామాబాద్ జూన్ 18 :( విజన్ ఆంధ్ర ) నిజామాబాద్ నగర శివారులో గల మాక్లూర్ మండలం చిన్నాపూర్ వద్ద ఏర్పాటు చేసిన అరణ్య అర్బన్ పార్క్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వర్చువల్ పద్ధతిలో గురువారం గుర్రంగూడ నుండి లాంఛనంగా ప్రారంభించారు. ఆర్మూర్ శాసన సభ్యులు పైడి రాకేష్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అర్పన, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, వి. భుజంగ రావు, అదనపు డీసీపీ శుభం ప్రకాష్ నగ్రాలే, జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ తదితరులు అరణ్య అర్బన్ పార్క్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. సఫారీ వాహనంలో పర్యటించి అర్బన్ పార్క్ లో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. ఓపెన్ జిమ్ లు, వాకింగ్ ట్రాక్, ప్లే జోన్ ఏరియా, కల్వర్టులు, పర్కులేషన్ ట్యాంకులు, వాచ్ టవర్, సోలార్ ద్వారా నడిచే బోరుబావులు, రోడ్డు వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, అటవీ ప్రాంతాన్ని కాపాడడానికి ఫారెస్ట్ డిపార్ట్ మెంట్ అధికారులు, సిబ్బంది అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. పచ్చదనాన్ని పెంపొందిస్తూ, వాతావరణ సమతుల్యాన్ని కాపాడేందుకు, ప్రజలకు ఆహ్లాదం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా అటవీ ప్రాంత అభివృద్ధి కోసం ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ఇందులో భాగంగానే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో అటవీ శాఖ కార్యక్రమాలను సైతం ప్రభుత్వం కొనసాగించిందని గుర్తు చేశారు. మొక్కల పెంపకం ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ గుర్తెరిగి విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించేలా కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. చెట్లు నరకడం ఎంతో సులభం అని, కానీ పర్యావరణానికి, ప్రాణికోటికి ఎంతో మేలు చేకూర్చే మొక్కలు నాటి, వాటిని కాపాడడం గురించి ఎంతో మంది తమకు ఎందుకులే అని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందరి భాగస్వామ్యం ఉన్నప్పుడే, పచ్చదనం పెంపొందించబడుతుందని అన్నారు. జిల్లాలో అటవీ శాఖ పరంగా చేపట్టే కార్యక్రమాలకు. జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఆర్మూర్ శాసన సభ్యులు పైడి రాకేష్ రెడ్డి మాట్లాడుతూ, 63వ నెంబర్ జాతీయ రహదారికి ఆనుకుని, నిజామాబాద్ నగరానికి ఐదు కిలోమీటర్ల దూరంలోనే 476 ఎకరాల విస్తీర్ణంలో అరణ్య అర్బన్ పార్క్ ప్రజలకు అందుబాటులోకి రావడం ఎంతో సంతోషం కలిగించిందని అన్నారు. దైనందిన కార్యకలాపాలతో అలసిన వారికి అర్బన్ పార్క్ ఆహ్లాదం పంచుతుందని, వ్యాయామం చేసుకునే వారికి మరింత వెసులుబాటు ఏర్పడిందని అన్నారు. అర్బన్ పార్క్ లో మరిన్ని వసతులు అందుబాటులో తెచ్చేలా జిల్లా యంత్రాంగం చొరవ చూపాలని అన్నారు. అర్బన్ పార్క్ లో అసాంఘిక శక్తులకు ప్రవేశం లేకుండా గట్టి నిఘా ఉంచాలని అటవీ అధికారులకు సూచించారు. అటవీ ప్రాంత సంరక్షణ, విస్తీర్ణం పెంపొందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. పచ్చదనం పెంపొందించే కార్యక్రమాల్లో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని, పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని సూచించారు. అడవులకు నష్టం కలిగించే వారి పట్ల అటవీశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ సాయన్న, డీఎఫ్ఓ సుధాకర్, సర్పంచ్ లు కే.లత, గంగాధర్, చిన్నా, విద్యార్థిని, విద్యార్థులు, అటవీ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)ను సందర్శించిన జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు



గద్వాల జూన్ 18 విజన్ ఆంధ్ర బ్యూరో) : విద్యార్థినులకు మెరుగైన విద్యతో పాటు అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు అధికారులను ఆదేశించారు. గురువారం ధరూర్ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)ను సందర్శించి పాఠశాల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, అల్పాహారం నాణ్యతను తనిఖీ చేశారు.వంటశాలను పరిశీలించి పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అనే విషయాన్ని ఆరా తీశారు. విద్యార్థినులకు పోషకాహారంతో కూడిన,నాణ్యమైన ఆహారం అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.అలాగే విద్యార్థినులకు కల్పిస్తున్న వసతి సౌకర్యాలు,తరగతి గదులు, మరుగుదొడ్లు,తాగునీటి సదుపాయాలు తదితర అంశాలను పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థినుల ఆరోగ్యం,భద్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు: డీఎస్పీ జీవన్ రెడ్డి



ఆదిలాబాద్, జూన్ 18 (విజన్ ఆంధ్ర): ధాబాలలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ జీవన్ రెడ్డి హెచ్చరించారు. గురువారం జిల్లాకేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు దాబా ఓనర్లు, నిర్వాహకులతో సమావేశమై మాట్లాడారు. ధాబాలలో మద్యం, గంజాయి, సేవించడం అమ్మడం నిషేధం అని తెలియజేశారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, జాతీయ రహదారులపై పార్కింగ్ వల్లే ప్రమాదాలు సంభవిస్తాయని అన్నారు. ప్రతి ధాబాలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఉల్లంఘించిన ఓనర్లపై, నిర్వాహకులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐలు సునీల్ కుమార్, ప్రేమ్ కుమార్, రహీం పాషా, నాగరాజు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి - జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా


- "అమ్మ మాట అంగన్‌వాడి బాట" పోస్టర్ ఆవిష్కరణ
- జూన్ 13 నుండి 19 వరకు ప్రత్యేక డ్రైవ్
- 3 నుండి 5 ఏళ్ల పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించడమే లక్ష్యం



మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి,జూన్ 18,(విజన్ ఆంధ్ర) : మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "అమ్మ మాట అంగన్‌వాడి బాట" కార్యక్రమ పోస్టర్‌ను గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ శ్రీమతి ఖుష్బూ గుప్తా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా జూన్ 13 నుండి జూన్ 19 వరకు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యాలు నమోదు శాతం పెంపు: 3 నుండి 5 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరినీ అంగన్‌వాడి కేంద్రాల్లో చేర్పించడం. నాణ్యమైన సేవలు: అంగన్‌వాడీ పిల్లలకు నాణ్యమైన ప్రీ-స్కూల్ విద్య, బలవర్ధకమైన పోషకాహారం మరియు మెరుగైన ఆరోగ్య సేవలు అందేలా చూడడం. అవగాహన కల్పించడం: ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, స్వయం సహాయక సంఘాల (గాం+) మహిళలు, ఝామీజ కమిటీ సభ్యులు సమన్వయంతో ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి అంగన్‌వాడి కేంద్రాల బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి ఎస్. జరీనా బేగం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. శ్రీనివాసులు, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీమతి విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత మార్కెట్లే లక్ష్యంగా ముందుకు సాగాలి

*ప్రత్యామ్నాయ బ్యాగుల ప్రత్యేక స్టాల్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయి*



హనుమకొండ జిల్లా ప్రతినిధి జూన్ 18 ( విజన్ ఆంధ్ర ) : పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల ఆరోగ్య రక్షణకు ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి, మార్కెట్లను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు సమష్టి కృషి అవసరమని జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయి అన్నారు. ప్లాస్టిక్ నిషేధంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో హన్మకొండ ఎక్సయిజ్ కాలనీ రైతు బజార్ లో ఏర్పాటు చేసిన జూట్, క్లాత్ మరియు బయోడిగ్రేడబుల్ బ్యాగుల ప్రత్యేక స్టాల్‌ను గురువారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణ కాలుష్యం పెరగడంతో పాటు ప్రజల ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. అందువల్ల ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జూట్ బ్యాగులు, క్లాత్ బ్యాగులు, బయోడిగ్రేడబుల్ బ్యాగుల వినియోగాన్ని ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని సూచించారు. మార్కెట్ ప్రాంతాల్లో వ్యాపారులు, వినియోగదారులు ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని పూర్తిగా మానుకుని పర్యావరణ హిత ఉత్పత్తులను వినియోగించాలని కోరారు. ఇకపై మార్కెట్లను దశలవారీగా ప్లాస్టిక్ రహిత మార్కెట్లుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక స్టాల్ ద్వారా ప్రజలకు అందుబాటు ధరల్లో ప్రత్యామ్నాయ బ్యాగులు లభిస్తాయని, వాటిని వినియోగించడంతో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితులు, పొరుగువారిలో కూడా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు.ఈ కార్యక్రమంలో సీఎం హెచ్ ఓ రాజారెడ్డి, ఆర్డీఓ వెంకటేష్, బల్దియా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తొలి పల్స్‌సెలెక్ట్ పీఎఫ్ఏ చికిత్స విజయవంతం

హైదరాబాద్, జూన్ 18 (విజన్ ఆంధ్ర) : ఏట్రియల్ ఫిబ్రిలేషన్(ఏఎఫ్) రోగుల చికిత్సలో తెలంగాణలో కొత్త మైలురాయిగా, హైదరాబాద్‌లోని ఏఐజీ హాస్పిటల్స్ రాష్ట్రంలోనే తొలి పల్స్ సెలెక్ట్ పల్స్ ఫీల్డ్ అబలేషన్(పీఎఫ్ఏ) విధానాన్ని విజయవంతంగా నిర్వహించింది. ఈ అత్యాధునిక చికిత్సను ఏఐజీ హాస్పిటల్స్ కార్డిక్ ఎలక్ట్రో సైకాలజీ డైరెక్టర్, హెడ్ డాక్టర్ సి.నరసింహన్ చేపట్టారు. ఏట్రియల్ ఫిబ్రిలేషన్ వల్ల గుండె స్పందనలు క్రమరహితంగా మారి దడ, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసటతో పాటు పక్షవాతం ప్రమాదం కూడా పెరుగుతుంది. పల్స్ సెలెక్ట్ పీఎఫ్ఏ సిస్టమ్ ద్వారా అసాధారణ గుండె లయలకు కారణమయ్యే కణజాలాన్ని నియంత్రిత విద్యుత్ స్పందనలతో లక్ష్యంగా చేసుకుని చికిత్స అందిస్తారు. తెలంగాణలో ఈ సాంకేతికతను తొలిసారిగా వినియోగించడం అధునాతన హృదయ చికిత్సల అందుబాటుకు కీలక ముందడుగుగా వైద్య నిపుణులు పేర్కొన్నారు.

## మరమ్మతు పనులు 20 రోజుల్లో పూర్తి చేయాలి

- : జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా
- ఇంటర్ అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతం చేయండి
- నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై కఠిన చర్యలు
- కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష



మహబూబ్‌నగర్ జిల్లా ప్రతినిధి,జూన్ 18(విజన్ ఆంధ్ర) : జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేపట్టిన సివిల్, ఎలక్ట్రికల్ మరమ్మతు పనులను రాబోయే 20 రోజుల్లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, పంచాయతీ రాజ్, విద్యా మౌలిక వసతుల ఇంజినీరింగ్ శాఖల అధికారులతో కలిసి కళాశాలల్లో మౌలిక వసతులు, ఇంటర్ అడ్మిషన్ల పురోగతిపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని మొత్తం 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 13 కళాశాలలకు సంబంధించి పనులు ఇంకా పెండింగ్‌లోనే ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ శాఖ పరిధిలోని 5 కళాశాలలు, విద్యా మౌలిక సదుపాయాల సంస్థ పరిధిలోని 8 కళాశాలల్లో పనులను తక్షణమే వేగవంతం చేయాలన్నారు. ఎక్కడైనా కాంట్రాక్టర్ల సమస్యలు ఉంటే వెంటనే వారిని మార్చి, కొత్త వారిని నియమించాలన్నారు. పనుల పురోగతిపై ప్రిన్సిపాళ్లు ప్రతిరోజూ నివేదిక సమర్పించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అడ్మిషన్లు పెంచేందుకు విస్తృత ప్రచారం.. కళాశాలల్లో తరగతులు ప్రారంభమైన దృష్ట్యా అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. ప్రవేశాల కోసం వచ్చే ప్రతి విద్యార్థికీ అవకాశం కల్పించాలని, ఎవరికీ సీటు నిరాకరించవద్దని స్పష్టం చేశారు. గత ఏడాది జిల్లాలో 4,838 మంది విద్యార్థులు చేరగా, ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు మొదటి సంవత్సరంలో 2,866 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కలెక్టర్‌కు వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ.. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు, తల్లిదండ్రులకు ప్రభుత్వ కళాశాలల్లో లభించే సౌకర్యాలపై విస్తృతంగా అవగాహన కల్పించి, అడ్మిషన్లు పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రమణి, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, పీఆర్, ఈ.డబ్ల్యూ.ఐ ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో విశ్వవిద్యాలయాల పరిస్థితి దారుణం

- జిల్లాలోని ప్రాజెక్టుల్లో పూడిక తొలగింపు పై దృష్టి సారించాలి..
- పసుపు బోర్డ్ ద్వారా అంతర్జాతీయ మార్కెట్..
- మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ...



నిజామాబాద్ జూన్18: (విజన్ ఆంధ్ర )తెలంగాణలో విశ్వవిద్యాలయాల పరిస్థితి దారుణంగా మారిందని రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ గవర్నర్, మాజీ కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ తెలిపారు. గురువారం ఆయన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా మాజీ గవర్నర్ దత్తాత్రేయ మాట్లాడుతూ.. తెలంగాణలో ఉన్న 19 విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్ల పోస్టులు భారీగా ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే విశ్వవిద్యాలయాలకు తగిన నిధులు అందకపోవడం వల్ల పరిశోధన ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, ఇతర మౌలిక సదుపాయాలు ఘోరంగా ఉన్నాయన్నారు. బడ్జెట్లో విద్యకు నిధులు కూడా అంతంత మాత్రమే కేటాయించడం దారుణం అన్నారు. 2026-27 బడ్జెట్లో విద్య రంగానికి కేవలం 8.2 శాతం మాత్రమే కేటాయించడం తగదన్నారు. తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ సిఫారసు ప్రకారం రాష్ట్ర బడ్జెట్లో కనీసం 18 శాతం విద్యకు కేటాయించాలని సూచించిందని గుర్తు చేశారు. జిల్లాలో నిజాంసాగర్ ప్రాజెక్టు ఉత్తర తెలంగాణకు జీవనాడి అని మాజీ గవర్నర్ దత్తాత్రేయ తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా గతంలో 2.75 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించబడిందని, ప్రాజెక్టు ప్రభావం ఆయకట్టు మార్పులు ఇతర కారణాలవల్ల ప్రస్తుతం ఆయకట్టు 2.35 లక్షల ఎకరాలకు తగ్గిందన్నారు. ప్రధానంగా పూడిక తొలగింపు, కాలువలు, ఆధునీకరణ నీటి నిల్వ సామర్థ్యం పెంపు వంటి అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అలాగే మోర్తాడ్ బాల్కొండ ఆర్మూర్ ప్రాంతాల రైతులు ఇప్పటికీ సాగునీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని పెద్ద వాగు వంటి ప్రాజెక్టులను పూర్తిస్థాయిలో నిర్మించి ప్రతి ఎకరాకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ పై అనేక హామీలు ఇచ్చిందన్నారు. కానీ రెండున్నరలు గడిచిన దానిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. పసుపు రైతులతో సమావేశం...జిల్లా పసుపు రైతులతో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో జిల్లాలో జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు చేయడం చారిత్రాత్మక నిర్ణయం అన్నారు. బోర్డు ద్వారా పసుపు ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ పెరిగిందన్నారు. ప్రధానంగా ఎగుమతులు పెరగడం, విలువ ఆధారిత ఉత్పత్తులకు ప్రోత్సాహం లభించడం, రైతులకు మెరుగైన ఆదాయం అందడం వంటి ప్రయోజనాలు కలుగుతున్నాయన్నారు. పార్టీ కోసం బూతు స్థాయి కార్యకర్తల నుంచి నాయకుల వరకు అందరూ కష్టపడాలని బిజెపి నాయకులకు కార్యకర్తలకు ఆయన సూచించారు. పదవులు ఉన్నా లేకున్నా పార్టీ కోసం పని చేయాలన్నారు. భవిష్యత్తులో మహిళా బిల్లు, డిలిమిటేషన్ కచ్చితంగా అమలవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి, సీనియర్ నాయకులు భూపతి రెడ్డి, టక్కర్ హనుమంత్ రెడ్డి, బీజేపీ ఫ్లోర్ లీడర్ ప్రమోద్, ముక్కా దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా రూపకల్పనలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరం

*ఎస్ఐఆర్-2026పై అవగాహన కల్పించేందుకు 2కె రన్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ & జిల్లా ఎన్నికల అధికారి చాహత్ బాజ్‌పాయిలి*



హనుమకొండ జిల్లా ప్రతినిధి జూన్ 18 ( విజన్ ఆంధ్ర ) : ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది అయిన ఓటరు జాబితాను మరింత సమగ్రమైనదిగా, విశ్వసనీయమైనదిగా తీర్చిదిద్దేందుకు భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్-2026)లో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని జిల్లా కలెక్టర్ & జిల్లా ఎన్నికల అధికారి చాహత్ బాజ్‌పాయి పిలుపునిచ్చారు.ఎస్ఐఆర్-2026పై ఓటర్లలో అవగాహన పెంపొందించేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 2కె రన్‌ను హనుమకొండ అదాలత్ సర్కిల్‌లోని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద డిసిపి ధార కవితలో కలసి కలెక్టర్ ఛాహత్ బాజ్ పాయి ప్రారంభించారు. అక్కడి నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు ర్యాలీ ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడంలో ఖచ్చితమైన ఓటరు జాబితా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పౌరుడు తన పేరు ఓటరు జాబితాలో నమోదైందో లేదో పరిశీలించుకోవడంతో పాటు అవసరమైన సవరణలు, మార్పులు, చేర్పులు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు), రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) సమక్షంలో ఇంటింటికీ వెళ్లి డిక్లరేషన్ ఫారాలు, ఎన్‌మరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారని తెలిపారు. ప్రజలు ఈ ప్రక్రియకు సహకరించి సరైన సమాచారాన్ని అందించాలని కోరారు. సేకరించిన వివరాల ఆధారంగా జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించబడుతుందని, అభ్యంతరాలు, క్లెయిమ్‌ల పరిశీలన అనంతరం అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఎవరైనా తప్పు సమాచారం అందించిన సందర్భాల్లో నేరుగా పేరు తొలగించకుండా, నోటీసు జారీ చేసి విచారణ నిర్వహించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, మరణించిన వ్యక్తులు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన డూప్లికేట్ ఓటర్ల వివరాలను గుర్తించి జాబితాను పరిశుద్ధీకరించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఓటరు జాబితాలో పేరు లేని అర్హులైన పౌరులు తప్పనిసరిగా ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2026 అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకునే ప్రతి భారతీయ పౌరుడు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు అర్హుడని వెల్లడించారు. అర్హత కలిగిన ఏ ఒక్కరి పేరు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా ఎన్నికల సంఘం అన్ని చర్యలు చేపడుతోందని తెలిపారు.ఓటర్లకు అవసరమైన సమాచారం అందించేందుకు జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఈఆర్‌వో కార్యాలయం, సంబంధిత తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాలు, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లతో పాటు టోల్ ఫ్రీ సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 1950 టోల్ ఫ్రీ నంబర్ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు అందుబాటులో ఉంటుందని, నమోదు, సవరణలు, క్లెయిమ్‌లు, అభ్యంతరాలకు సంబంధించిన వివరాలను ఈ సేవల ద్వారా పొందవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ ధార కవిత, అదనపు కలెక్టర్ రవి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇ.వి. శ్రీనివాసరావు, రావు పద్మ, అమరేందర్ రెడ్డి, కుసుమ శ్యాంసుందర్, నాగబెల్లి రజనీకాంత్, ప్రవీణ్ కుమార్, సయ్యద్ ఫైజుల్లా, మున్నా, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, జిల్లా యువజన మరియు క్రీడల అధికారి కొత్త ప్రశాంత్, టీజీవో రాష్ట్ర నాయకులు జగన్మోహన్ రావు, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్, ఆర్డీఓ వెంకటేష్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

## భవిత కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే నాగరాజు

- దివ్యాంగులకు అండగా భవిత కేంద్రాలు...



హన్మకొండ జిల్లా ప్రతినిధి జూన్ 18 ( విజన్ ఆంధ్ర ) : సమాజంలో వేసే ప్రతి అడుగుకూ అంగవైకల్యం అడ్డుకదని, మనోఎస్థైర్యంతో ముందుకెళ్లాలనే యోచనతో దివ్యాంగులకు భవిత కేంద్రాలు శిక్షణనందిస్తున్నాయని లివర్ధన్నపేట శాసన సభ్యులు శ్రీ కేఆర్ నాగరాజు గారులి అన్నారు. గురువారం భీమారంలోని దివ్యాంగుల భవిత కేంద్రాన్ని ప్రారంభించారు.అనంతరం సరస్వతీ తల్లికి విద్యార్థులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు.పిల్లలతో కలిసి అక్షర్యభ్యాసాన్ని చేయించారు.మానసిక శారీరక ఎదుగుదల లేని విద్యార్థుల చదువుపై ఆరా తీశారు.దివ్యాందులకు చేయుతనిచ్చే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేస్తున్నట్లు అన్నారు.భవిత కేంద్రాల్లో పిల్లకు విద్య,అవసరమైన థెరపీ, ప్రత్యేక శిక్షణ అందించడంలో ఈ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నారు. అనంతరం మండల ప్రజాపరిషత్ పాఠశాలను సందర్శించారు.నూతనగా నిర్మించిన తరగతి గదులను ప్రారంభించారు. విద్యార్థులందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యకరమైనటువంటి ఆహారం, క్రమశిక్షణ ఉన్నత విద్యా ప్రమాణాలు కలిగిన ఉపాధ్యాయులతో కూడిన బోధనను కలిగి ఉన్న ప్రభుత్వ పాఠశాలలపై ప్రతి ఒక్కరికి నమ్మకం కలిగించి విద్యార్థులు నమోదును పెంచుటకు కృషి చేయాలని ఉపాధ్యాయులను సూచించారు.ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వోక్సెన్‌లో 68వ వార్షిక నాసా సదస్సు విజయవంతం



హైదరాబాద్, జూన్ 18 (విజన్ ఆంధ్ర) : దేశంలోనే అతిపెద్ద విద్యార్థుల ఆధ్వర్యంలోని ఆర్కిటెక్చర్ సమావేశాలలో ఒకటైన 68వ వార్షిక నాసా సదస్సు(ఏఎన్సీ) 2026ను వోక్సెన్ విశ్వవిద్యాలయం జూన్ 11-14 తేదీల్లో హైదరాబాద్ క్యాంపస్‌లో విజయవంతంగా నిర్వహించింది. ఈ సదస్సులో దేశవ్యాప్తంగా 4,500 మందికి పైగా ఆర్కిటెక్చర్ విద్యార్థులు, 500 మందికి పైగా ఆర్కిటెక్టులు, డిజైనర్లు, విద్యావేత్తలు, పరిశ్రమ నాయకులు, విధాన రూపకర్తలు పాల్గొన్నారు. వోక్సెన్ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్, ప్లానింగ్, నాసా ఇండియా సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో మలేషియాకు చెందిన ఆర్కిటెక్ట్ ఆర్.కెవిన్ మార్క్ లో, ఆర్కిటెక్ట్-విద్యావేత్త ఆర్.నూరు కరీం, ప్రముఖ ఆవిష్కర్త సోనమ్ వాంగ్‌చుక్ కీలకోపన్యాసాలు ఇచ్చారు. గాయకుడు, సంగీత దర్శకుడు అమాల్ మాలిక్ ప్రత్యేక ప్రత్యక్ష ప్రదర్శన అందించారు. ఈ సదస్సులో 10 మాస్టర్‌క్లాస్‌లు, 20 సెమినార్లు, 60 వర్క్‌షాప్‌లు నిర్వహించగా, వాస్తుశిల్పం, సుస్థిరత, పట్టణాభివృద్ధి, సాంకేతికతలు, వారసత్వ పరిరక్షణ అంశాలపై చర్చలు జరిగాయి. నాసా ఇండియా రీసెర్చ్ కాన్ఫరెన్స్ రెండో ఎడిషన్ కూడా నిర్వహించారు. అలాగే రూబెన్స్ ట్రోఫీ, స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ ట్రోఫీ, గృహ ట్రోఫీ, వార్షిక నాసా డిజైన్ పోటీ తుది జ్యూరీలు నిర్వహించి విద్యార్థుల ప్రతిభను ప్రదర్శించారు.

## బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

- విద్యతోనే విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది

కామారెడ్డి బ్యూరో జూన్ 18(విజన్ ఆంధ్ర) : జిల్లాలోని గర్గుల్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూకేజీ తరగతిని ప్రారంభించి చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం సంచారజాతుల పిల్లలను పాఠశాలలో చేర్పించి వారికి అక్షరాభ్యాసం నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో రెండు మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. హైస్కూల్ , ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. గర్గుల్ పాఠశాలకు చెందిన నలుగురు జాతీయ స్థాయి హాకీ క్రీడాకారులు, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న 12 మంది క్రీడాకారులను జిల్లా కలెక్టర్ సన్మానించి అభినందించారు. క్రీడల్లో ప్రతిభ కనబరుస్తూనే విద్యలో కూడా రాణించాలని విద్యార్థులకు సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ శ్రీమతి దివ్య రవితేజ గౌడ్ గ్రామంలో విద్యాభివృద్ధికి ప్రత్యేక బాధ్యత తీసుకుని చదువుకు ప్రాధాన్యత ఇస్తుండటం అభినందనీయమని అన్నారు. విద్యార్థుల ప్రగతి కోసం గ్రామస్తులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమిష్టిగా పనిచేయాలని సూచించారు. ప్రతి చిన్నారి విద్యను అభ్యసించేలా అందరూ కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మల్లికార్జున్, ఎంఈఓ ఎల్లయ్య, ఎంపీడీవో, సర్పంచ్ దివ్య రవితేజ గౌడ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు పి.డి. మధుసూదన్, సీఆర్పీ రాములు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేసిన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి బ్యూరో జూన్ 18 (విజన్ఆంధ్ర) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన గృహాల నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గురువారం గర్గుల్ గ్రామంలో భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా పూరి గుడిసెల్లో నివసిస్తున్న లబ్ధిదారులు శ్రీమతి రావుల పెద్ద ఎల్లమ్మ, శ్రీ భిక్షపతి, శ్రీమతి దానబోయిన జ్యోతికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు కలెక్టర్ శంకుస్థాపన చేశారు.అనంతరం లబ్ధిదారులతో మాట్లాడి ప్రభుత్వం కల్పిస్తున్న గృహ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకొని నాణ్యతతో ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసి లబ్ధిదారులు త్వరగా గృహ ప్రవేశం చేసుకునేలా అధికారులు అవసరమైన సహకారం అందించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ తమకు జిల్లాలో మొదటిసారిగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా పూరి గుడిసెల్లో నివసిస్తున్న తమకు సొంత ఇంటి కల నెరవేరిందని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వానికి , జిల్లా పరిపాలనకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో హిమబిందు, డి ఎల్ పి ఓ శ్రీనివాస్, సర్పంచ్ దివ్య, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# గణపసముద్రం రిజర్వాయర్ భూ సేకరణ అంశంపై సమీక్ష



వనపర్తి జూన్ 18 (విజన్ ఆంధ్ర బ్యూరో ) : గణపసముద్రం రిజర్వాయర్ భూ సేకరణకు సంబంధించి రైతుల అభిప్రాయాలను తెలుసుకోవడం కోసమే జిల్లా స్థాయి చర్చల కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నామని, రైతుల విన్నపాలను ప్రభుత్వానికి నివేదిస్తామని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. గురువారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో గణపసముద్రం రిజర్వాయర్ భూ సేకరణ అంశంపై సంబంధిత గ్రామ రైతులతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి చర్చల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రిజర్వాయర్ పరిధిలోని 164 ఎకరాల భూముల రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు భూ సేకరణ అంశానికి సంబంధించి తమ అభిప్రాయాలను అధికారుల ముందు వెల్లడించారు. గణప సముద్రం రిజర్వాయర్ నిర్మాణంలో సేకరించనున్న 164 ఎకరాలకు సంబంధించి భూములు చాలా విలువైనవని, ఈ భూములు తమ గ్రామ రైతులకు ఎంతో ముఖ్యమని, విలువైన పంటలు పండుతాయని తమ గోడును ప్రభుత్వం అర్థం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఈ భూములపై పూర్తిస్థాయిలో స్టడీ చేసి పరిహారం విషయంలో రైతులకు న్యాయబద్ధమైన నిర్ణయం తీసుకోవాలన్నారు. తామంతా కేవలం వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తున్నామని, భూములు కోల్పోతే తమకు ఉపాధి కోల్పోయి రోడ్డున పడతామని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పంటలు పండక వలసలు వెళ్లిన పరిస్థితులు ఉండేవని, ఇప్పుడు కొంత నీటి సౌకర్యం ఏర్పడి పంటలు బాగా పండుతున్నాయని, ఈ సమయంలో భూసేకరణ పేరుతో తమకు అన్యాయం చేయవద్దని కోరారు. ప్రభుత్వం తమకు ఎకరానికి ప్రభుత్వం నిర్దేశించిన విధంగా రూ.12.50 లక్షలు కాకుండా, పెద్ద మొత్తంలో నష్టపరిహారం ఇవ్వాలని విన్నవించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గణపసముద్రం రిజర్వాయర్ భూ సేకరణలో భాగంగా భూములు కోల్పోనున్న రైతుల అభిప్రాయ సేకరణ కోసమే ఈ జిల్లాస్థాయి చర్చల కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ఆయా ప్రాంతాల్లో మార్కెట్ రేట్ల కు అనుగుణంగా ధరను నిర్ణయిస్తుందని తెలిపారు. రైతులు ఎవరూ కంగారు పడవద్దని, రైతులకు న్యాయం చేసేందుకే ప్రభుత్వం తరఫున తాము ఎప్పుడు ప్రయత్నిస్తామని తెలిపారు. సాటిల్ బండ్ విషయంలో సీఈ ల కమిటీ ఇచ్చిన నివేదికను పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం ఎంత ఇవ్వవచ్చు అనేది త్వరలోనే నిర్ణయించడం జరుగుతుందని తెలిపారు. త్వరలోనే గ్రామానికి అధికారులు వచ్చి పరిహారం గురించి చెప్పడం జరుగుతుందని తెలియజేశారు. రైతుల విన్నపాన్ని ప్రభుత్వానికి నివేదించి న్యాయం చేసే దిశగా అడుగులు వేస్తామని తెలియజేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిరుపతయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, నాయకులు సాయి చరణ్ రెడ్డి, సర్పంచి, నీటిపారుదల శాఖ సూపరిండెంట్ ఇంజనీర్, డివిజనల్ ఇంజనీర్, ఇతర రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల సత్వర పరిస్కారం కోసమే 'ముఖాముఖి' కార్యక్రమం

- అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు.
- ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రజలకు చేరువచేసేందుకే "ముఖాముఖి' కార్యక్రమం.
- అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు.



పాల్వంచ ప్రతినిధి, జూన్ 18 (విజన్ ఆంధ్ర) : ప్రజా సమస్యల సత్వర పరిస్కారంకోసమే 'ముఖాముఖి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, సమస్యలను నేరుగా తెలుసుకోవడంతోపాటు అధికార యంత్రాంగాన్ని, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను ప్రజలకు చేరువ చేసేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. 'మనకోసం..మన ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా గురువారం పాల్వంచ మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో 'ప్రజలతో ముఖాముఖీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజలనుంచి అనూహ్య స్పందన లభించింది. వివిధ శాఖల అధికారులు, వివిధ ప్రాంతాలలోని లబ్ధిదారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. అక్కడే ఉన్న అధికారులను వాటిని తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచించారు. పలురకాల వినతులు స్వీకరించి పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అధికారులను ప్రజలచెంతకు చేర్చెడుకే తాము "ముఖాముఖి' కార్యక్రమం చేపట్టామని తెలిపారు. దీని ద్వారా ప్రజాసమస్యలు నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి, వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని అన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాల మరమ్మతు పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

**- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



వనపర్తి జూన్ 18 (విజన్ ఆంధ్ర బ్యూరో): ప్రభుత్వ జూనియర్ కళాశాల మరమ్మతుల పనులను వెంటనే పూర్తి చేయాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురబి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ ఇసుక ఇంటర్మీడియట్ కళాశాలల ప్రిన్సిపల్స్ తో సమావేశమయ్యారు. కలెక్టర్ ఆయా కళాశాలలో మరమ్మతు పనులపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో భవనాల మరమ్మతుల కోసం మంజూరైన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కాంట్రాక్టర్లతో సమావేశం ఏర్పాటు చేసి రాబోయే నెల రోజుల్లోగా పనులన్నీ పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పనులు పూర్తయిన తర్వాత యుటిలైజేషన్ సర్టిఫికెట్స్ సమర్పించాల్సి ఉంటుందన్నారు. అదేవిధంగా జిల్లాలోని అంగన్వాడీలకు సంబంధించి మంజూరైన పనులను కూడా వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలి

జూన్ 25 నుంచి ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటర్ జాబితా సవరణ ప్రక్రియలో చెప్పుగా పాల్గొనాలని జిల్లా కలెక్టర్ సూచించారు. జూన్ 23వ తేదీన ఎస్ఐఆర్ పై అవగాహన కల్పించేందుకు నిర్వహించనున్న 2కే కార్యక్రమంలో అందరూ జూనియర్ కళాశాలల సిబ్బంది విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో జెడ్పి సీఈవో యాదయ్య, డి ఐ ఈ ఓ నరేంద్ర కుమార్, జిల్లా సంక్షేమ అధికారిని సుధారాణి, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, ఈడబ్ల్యుఐడీసీ ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆలేరు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం

**- ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి**



నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): జూన్ 17 : నాగర్ కర్నూల్ జిల్లా తుర్కపల్లి మండలం ఆలేరు గ్రామంలో ఇందూరమ్మ గృహప్రవేశాలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ కూచికుల రాజేశ్వర్ రెడ్డి, హాజరై ఇల్లు తిరిగి గృహప్రవేశాలు కొబ్బరికాయ గుమ్మడికాయలతో కొబ్బరి కాయలతో గుమ్మం ముందు అర్పించి నూతన గృహప్రవేశాలు చేయించడం జరిగింది. అనంతరం పాఠశాలలో మొక్కలు నాటడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టడం వల్ల పేద ప్రజల సొంతింటి కలలు నెరవేరుతున్నాయని ఆయన అన్నారు గ్రామంలో ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి ఆదుకుంటామని ఆయన అన్నారు పార్టీలతో సంబంధం లేకుండా పేద ప్రజలందరికీ ఇంద్ర మహిళను ప్రవేశపెడతానని ఆయన అన్నారు ఇందిరమ్మ రాజ్యం ప్రజల అండగా పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎంతగానో కృషి చేస్తుందని ఆయన అన్నారు ఆలేరు గ్రామంలో ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉండాలని ఆయన ప్రజలను యువతను విద్యార్థులను కోరారు. నేను డాక్టర్ గుత్తి బదిలీ పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం సేవా భావంతో రాజకీయ రంగంలోకి రావడం జరిగిందన్నారు అది కూడా కొత్త కాదు 60 సంవత్సరాలతో దామోదర్ రెడ్డి పేద ప్రజల పక్షాన అదే ఉన్నా లేకున్నా నిరంతరం కొనసాగుతున్నారు తన అడుగుజాడలో నేను కూడా ప్రజల పక్షాన కొనసాగుతానని ఆయన అన్నారు కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ రమణారావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బండ పర్వతాలు, సింగల్ డైరెక్టర్ యాదయ్య, సీనియర్ నాయకులు వెంకటయ్య గౌడ్, సూర్య బాలు గౌడ్, గ్రామ మాజీ సర్పంచి వెంకటరమణ గౌడ్, మాజీ ఎంపిటిసి ఈశ్వరయ్య, మాజీ కోఆప్షన్ నెంబర్ అవుట వెంకటస్వామి, యువజన నాయకుడు అంజి, కొరిమి మల్లేష్ బీరగాళ్ళ బాలయ్య, ఎం ప్రసాద్, దొండ బంగార, అధినారపు శ్రీరాములు, యస్ రాజు.

# కాంగ్రెస్ నాయకుడి ఇంట్లో అక్రమ మద్యం సామ్రాజ్యం బట్టబయలు..!

- ఎక్సైజ్, డీటీఎఫ్ సంయుక్త దాడుల్లో భారీ పట్టివేత..
- 422 సీసాలు స్వాధీనం
- 258 లీటర్లకు పైగా మద్యం సీజ్
- ఇద్దరిపై కేసులు నమోదు



బోడుప్పల్/మేడ్చల్ ,జూన్18(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అక్రమ మద్యం వ్యాపారంపై ఎక్సైజ్ శాఖ చేపట్టిన ప్రత్యేక దాడుల్లో సంచలన విషయాలు వెలుగుచూశాయి. జవహర్‌నగర్ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ స్థానిక నాయకుడి నివాసంలో అక్రమంగా గోవా, విదేశీ మద్యం నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించిన అధికారులు భారీ మొత్తంలో మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. డైరెక్టర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆదేశాలు, ఏసీఆర్ఆర్ సూచనల మేరకు నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా డీపీఈవో మల్కాజిగిరి, ఏఈఎస్ మల్కాజిగిరి పర్యవేక్షణలో డీటీఎఫ్ మల్కాజిగిరి, కాప్రా ఎక్సైజ్ బృందాలు సంయుక్తంగా జవహర్‌నగర్ ప్రాంతంలో ఆకస్మిక దాడులు నిర్వహించాయి. ఈ దాడుల్లో అక్రమ మద్యం విక్రయాలకు కేంద్రాలుగా మారిన రెండు ఇళ్లను గుర్తించి తనిఖీలు చేపట్టగా భారీగా మద్యం నిల్వలు బయటపడ్డాయి.

**ఇళ్లనే మద్యం గోదాములుగా మార్చి దందా..!**

బాలాజీనగర్‌లోని వెంకటేశ్వర కాలనీలో నివాసం ఉంటున్న రెడ్డి శెట్టి మహేష్ ఇంట్లో తనిఖీలు నిర్వహించిన అధికారులు 59 సీసాల గోవా, విదేశీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 51.55 లీటర్ల మద్యం లభ్యమైనట్లు అధికారులు వెల్లడించారు.మోహన్‌రావు కాలనీలోని మరో ఇంటిపై నిర్వహించిన దాడుల్లో రెడ్డి శెట్టి శ్రీనివాస్ వద్ద నుంచి 112 సీసాల గోవా, విదేశీ మద్యం, 251 సీసాల తెలంగాణ డ్యూటీ పేడ్ విస్కీ స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 205.41 లీటర్ల మద్యం పట్టుబడింది.

**ప్రత్యేక డ్రైవ్‌లో భారీ విజయం**

రెండు కేసుల్లో కలిపి 422 సీసాలు, 257.96 లీటర్ల మద్యం స్వాధీనం కావడం ఎక్సైజ్ శాఖకు పెద్ద విజయంగా అధికారులు పేర్కొంటున్నారు. ఇటీవల కాలంలో జవహర్‌నగర్, బాలాజీనగర్ ప్రాంతాల్లో అక్రమ మద్యం విక్రయాలు పెరుగుతున్నాయనే ఫిర్యాదుల నేపథ్యంలో నిఘా పెంచి ఈ దాడులు నిర్వహించినట్లు సమాచారం.



రాజకీయ అండ ఉందా..?

అక్రమ మద్యం నిల్వలు, విక్రయాలు సాగుతున్న ప్రాంతాలకు రాజకీయ అండదండలు ఉన్నాయా అనే కోణంలో కూడా అధికారులు విచారణ జరుపుతున్నట్లు తెలుస్తోంది. సాధారణ నివాస గృహాల్లోనే వందలాది మద్యం సీసాలు నిల్వ ఉండటం వెనుక మరింత పెద్ద నెట్‌వర్క్ ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇద్దరిపై కేసులు నమోదు

ఈ ఘటనలపై సిఓఆర్ నెం.30/2026, 31/2026 కేసులు నమోదు చేసిన అధికారులు సంబంధిత చట్టాల కింద విచారణ చేపట్టారు. అనంతరం నిందితులను బిఎన్ఎస్ఎస్-2023 సెక్షన్ 35(3) ప్రకారం బెయిల్‌పై విడుదల చేశారు.

లభించిన మద్యం సీసాలు ....

గోవా, విదేశీ మద్యం సీసాలు : 171
డ్యూటీ పేడ్ విస్కీ సీసాలు : 251
మొత్తం సీసాలు : 422
మొత్తం మద్యం : 257.96 లీటర్లు
నమోదు చేసిన కేసులు : 2

# ఎస్.ఐ.ఆర్ ప్రక్రియపై బీ.ఎల్.ఓలు, సూపర్వైజర్లకు శిక్షణ తరగతులు

- తప్పిదాలకు తావులేకుండా చిత్తశుద్ధితో నిర్వహించాలి : కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్, జూన్ 18 :( విజన్ ఆంధ్ర పారదర్శక ఓటరు జాబితా కోసం ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ఈ నెల 25 నుండి ప్రారంభం కానున్న ఎస్.ఐ.ఆర్ సర్వేను పురస్కరించుకుని నిజామాబాద్ నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్ లో గురువారం నిజామాబాద్ గ్రామీణ నియోజకవర్గ బూత్ లెవెల్ ఆఫీసర్లు, సూపర్వైజర్లు, సహాయ రిటర్నింగ్ అధికారులకు ఎస్.ఐ.ఆర్ సర్వే నిర్వహణ తీరుతెన్నులపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎస్.ఐ.ఆర్ సర్వే ఎలా చేయాలి, ఏయే అంశాలను పరిశీలించాలి, ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, పాటించాల్సిన పద్ధతులపై మాస్టర్ ట్రైనర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ ఇలా త్రిపాఠి కీలక అంశాలను వివరిస్తూ బీ.ఎల్.ఓలకు దిశానిర్దేశం చేశారు.ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 25 నుండి జూలై 24 వరకు బీఎల్ఓ లు ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఓటరు మ్యాపింగ్ ను పూర్తి చేయాలని సూచించారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ నిర్వహణలో పాల్గొంటున్న బీ.ఎల్.ఓలకు సర్వే కాలంలో నెల రోజుల పాటు వారివారి శాఖలకు సంబంధించిన దైనందిన విధుల నుండి మినహాయింపు కల్పించారని కలెక్టర్ తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎస్.ఐ.ఆర్ పైనే పూర్తి స్థాయిలో దృష్టిని కేంద్రీకరిస్తూ, ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా పకడ్బందీగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు. ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఓటరు జాబితాలో పేర్లు ఉన్నవారు ఇతర ప్రాంతానికి శాశ్వతంగా వలస వెళ్ళారా, మృతి చెందారా, రెండు చోట్ల పేర్లు ఉన్నాయా అనే అంశాలను నిశితంగా గమనించాలని సూచించారు. ఎస్.ఐ.ఆర్ సర్వే వివరాల ఆధారంగానే ఓటరు జాబితాను రూపొందించనున్న దృష్ట్యా పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తగా సర్వే జరపాలని హితవు పలికారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలని, ఏవైనా సందేహాలు ఉంటే ఏమాత్రం సంకోచించకుండా శిక్షణ తరగతులలో నివృత్తి చేసుకోవాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ఒక్క ఓటరు కూడా తప్పిపోకుండా చూడాలని, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఇతర వి.ఐ.పీల మ్యాపింగ్ పై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓ.టీ.పీని ఇతరులకు తెలుపకుడదని, ఇలా చేయడం నేరంగా పరిగణించబడుతుందని జాగ్రత్తలు సూచించారు. ప్రతి ఓటరుకు రెండు చొప్పున ఎన్యూమరేషన్ ఫారాలు అందించాలని, వాటిని ఓటరు సరైన విధంగా పూరించారా అన్నది పరిశీలించాలని అన్నారు. పూరించిన ఒక ఫారంను తీసుకుని, మరో ఫారంను ఓటరుకు ఎక్ నాలెడ్జ్ రూపంలో అందించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే ప్రీ-మ్యాపింగ్ చేసుకున్న ఓటర్లకు సంబంధించి కూడా ఏవైనా మార్పులు చేయాల్సి ఉంటే, వాటిని సరి చేయవచ్చని తెలిపారు. ఒక కుటుంబంలోని ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు కలిగి ఉండేలా చూడాలన్నారు. అక్టోబర్ 1, 2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తవుతున్న ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించబడుతుందని, ఈ మేరకు కొత్త ఓటర్లు ఉంటే ఫారం-6 తో పాటు ధృవీకరణ పత్రం తీసుకోవాలని తెలిపారు. ఉపాధి నిమిత్తం విదేశాలలో ఉంటున్న వారి ఎన్యుమరేషన్ ఫారంపై వారి కుటుంబ పెద్ద సంతకం తీసుకోవచ్చని సూచించారు. 01 జూలై 1987కు ముందు జన్మించిన వారు తమ స్వీయ గుర్తింపు లేదా జనన ఆధార పత్రాలు సమర్పిస్తే సరిపోతుందని, తల్లిదండ్రుల పత్రాలు అవసరం లేదన్నారు. 01 జూలై 1987 నుంచి 02 డిసెంబర్ 2004 మధ్య జన్మించిన వారు తమ పత్రాలతో పాటు తల్లి లేదా తండ్రి, తాతయ్య లేదా నానమ్మ ఎవరిదైనా ఒకరి ధ్రువపత్రం సమర్పించాలని, 02 డిసెంబర్ 2004 తర్వాత జన్మించిన వారు స్వీయ ధృవీకరణతో పాటు తల్లిదండ్రులు ఇద్దరి ధ్రువపత్రాలు సమర్పించాల్సి ఉంటుందని సూచించారు. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించబడుతుందని, ముసాయిదా జాబితా అనంతరం ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలు, క్లెయిమ్‌లు, దరఖాస్తులను పరిష్కరించి, అక్టోబర్ 01న తుది ఓటరు జాబితాను ప్రచురించడం జరుగుతుందన్నారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం పరిధిలో బీ.ఎల్.ఓల కృషితో జిల్లాలోనే అత్యధికంగా ప్రీ-మ్యాపింగ్ 93.5 శాతం జరిగిందని, ప్రస్తుత చివరి దశలో ఇదేవిధమైన కృషిని కొనసాగిస్తూ వంద శాతం మ్యాపింగ్ జరిగేలా చొరవ చూపాలని కలెక్టర్ సూచించారు. షెడ్యూల్ మేరకు నిర్ణీత గడువు లోపు ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ పక్కాగా పూర్తయ్యేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని ఈ.ఆర్.ఓలు, ఏ.ఈ.ఆర్.ఓలకు సూచించారు. శిక్షణా తరగతులలో నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, ఏఈఆర్ఓలు, బీ.ఎల్.ఓలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# పెద్దమందడి పోలీస్టేషన్ తనిఖీ చేసిన జిల్లా ఎస్పీసునిత రెడ్డి



పెద్దమందడి జూన్ 18 (విజన్ ఆంధ్ర ):ప్రజలకు న్యాయం పోలీసులకు బాధ్యత బాధితుల్లో భరోసా పెంచేలా సేవలందించాలనీ వనపర్తి జిల్లా ఎస్పీ సునీత రెడ్డి స్పష్టం చేశారు. పెద్దమందడి పోలీస్ స్టేషన్ ను గురువారం జిల్లా ఎస్పీ తనిఖీ చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణ, అసాంఘిక కార్యకలాపాలపై అప్రమత్తంగా వ్యవహరించాలనీ, గంజాయి, మట్కా, పేకాటపై కఠిన నిఘా ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు..బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ విధులు నిర్వహించే సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలనీ,పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడు పోలీసు శాఖ తనకు అండగా ఉందనే నమ్మకంతో తిరిగి వెళ్లాలన్నారు. బాధితులకు న్యాయం చేయడం, ప్రజలకు భద్రత కల్పించడం, నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించడం ప్రతి పోలీసు అధికారికి ప్రధాన బాధ్యతని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి అన్నారు పోలీస్టేషన్ చేరుకున్న ఎస్పీరికి పోలీసు అధికారులు పూల మొక్కలందజేసి స్వాగతం పలికారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించి పోలీస్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, రిసెప్షన్, స్టేషన్ రైటర్, టెక్ టీమ్, ఎస్ హెచ్ వో, మెన్ రెస్ట్ రూమ్ , లాక్ అప్ రూమ్ ను తదితర ప్రదేశాలను పరిశీలించారు. స్టేషన్ లో రోజు వారీగా నిర్వహిస్తున్న జనరల్ డైరీ,సెంట్రీ రిలీఫ్ బుక్, డ్యూటీ రోస్టర్, విలేజ్ రోస్టర్, ప్రాసెస్ రిజిస్టర్, బీట్ డ్యూటీ బుక్స్, సస్పెక్ట్ చెక్ రిజిస్టర్, సుపీరియర్ ఆఫీసర్స్ విసిటింగ్ బుక్స్, ఫైనల్ రిపోర్ట్స్ తదితర రికార్డ్స్ ను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్టేషన్ పరిధిలో ఎక్కువగా ఎలాంటి నేరాలు జరుగుతున్నాయి, పెండింగ్ లో ఉన్న కేసులు, దర్యాప్తు వివరాలను పెద్దమందడి ఎస్సై,జలంధర్ రెడ్డి ని అడిగి తెలుసుకున్నారు. పెద్దమందడి పోలీస్టేషన్ పరిధిలో గంజాయి, మట్కా, పేకాట లాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పర్యవేక్షించాలన్నారు. సాయంత్రం సమయాలలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాలను అరికట్టాలన్నారు. ముఖ్యంగా కేసుల దర్యాప్తునందు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సరైన సమయంలో దర్యాప్తు చేసి కోర్టుల నందు చార్జిషీటు దాఖలు చేసినప్పుడు బాధితులకు సరైన న్యాయం జరుగుతుందని తెలిపారు. దీర్ఘ కాలికంగా పెండింగ్లో ఉన్న కేసుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పోలీసు సిబ్బంది మాట్లాడుతూ పోలీసుశాఖ అందించిన కిట్ ఆర్టికల్స్ ను పరిశీలించి వాటిని జాగ్రత్తగా ఉంచుకోవాలని తెలిపారు. అలాగే సిబంది నిర్వహిస్తున్న విధులు, పని తీరు, వారికీ ఏదైనా సమస్యలు ఉన్నాయ అని తెలుసుకుని ఏమైనా సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకురావాలనని స్టేషన్ పరిధిలో ఎలాంటి నేరాలు అధికంగా జరుగుతున్నాయి అడిగి తెలుసుకొని గ్రామ పోలీస్ అధికారులు గ్రామాలను పూర్తిగా సమాచారం సేకరించి నేరాలు నిర్ములించాలని తెలిపారు. విలేజ్ పోలీసు అధికారులు తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, గ్రామ పెద్దలు, యువతతో సత్సంబంధాలు కొనసాగిస్తూ శాంతిభద్రతలకు సంబంధించిన ముందస్తు సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ హిస్టరీ షీటర్ల వివరాలను పరిశీలిస్తూ, వాటిని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. పగలు, రాత్రి బీట్ విధులలో భాగంగా అనుమానిత వ్యక్తుల వేలిముద్రలను పాపిలాన్ డివైస్ ద్వారా తనిఖీ చేసి, పాత నేరస్తులను గుర్తించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ అందుబాటులోకి తీసుకువచ్చిన సీసీటీఎన్ఎస్-2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, టీఎస్-కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ-సాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్, సీఈఐఆర్, సైబర్ క్రైమ్ పోర్టల్, సీడీఆర్, పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్ వంటి సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లపై పూర్తి స్థాయి పట్టు సాధించి, నేరాల నియంత్రణలో సమర్థవంతంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. స్టేషన్ రికార్డులైన పార్ట్-1 నుండి పార్ట్-5 వరకు ఎలాంటి పెండింగ్ లేకుండా సీసీటీఎన్ఎస్-2.0లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే సిబ్బందికి వర్టికల్ వారీగా విధులు కేటాయించాలని ఎస్సైకి సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని, అధిక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించి సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న గ్రామాలలో రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ, మారుతున్న సమాజానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, సిబ్బంది ప్రతి ఒక్కరూ అన్ని రకాల విధులపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ప్రస్తుతం నేర్చుకుంటున్న పనితీరు మీ సేవా కాలమంతా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని, ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించినప్పుడే పోలీస్ శాఖకు మంచి పేరు వస్తుందని అన్నారు. డ్యూటీ పరంగా లేదా వ్యక్తిగతంగా ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని సూచిస్తూ, హెల్మెట్ ధరించని సిబ్బందిని విధుల్లోకి అనుమతించకూడదని అధికారులకు సూచించారు. పోలీస్ స్టేషన్ నిర్వహణ, రికార్డుల నిర్వహణ సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొంటూ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం పెద్దమందడి ఎస్సై,జలంధర్ రెడ్డి జన్మదిన సందర్భంగా ఎస్పీ పోలీస్ స్టేషన్లో అధికారుల సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ కోర్టును ప్రారంభించి పాఠశాల విద్యార్థులతో వాలీబాల్ ఆడారు. వార్షిక తనిఖీ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పీ, గిరిబాబు ,కొత్తకోట సీఐ,రాంబాబు , పెద్దమందడి ఎస్సై,జలంధర్ రెడ్డి , డిసిఆర్బి ఎస్సై, తిరుపతి రెడ్డి,పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు పరిరక్షణ కోసం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పోరాడాలి

**- డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్**

**- సర్ పై బి ఎల్ ఏ లకు అవగాహన శిక్షణ కార్యక్రమం**



అయిజ జూన్ 17 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా అల్లంపూర్ నియోజకవర్గం లో తెలంగాణ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నటువంటి ఎస్ఐఆర్ ప్రత్యేక సమగ్ర సవరణ పై నియోజకవర్గం లోని 291 పోలింగ్ బూత్ ఏజెంట్లకు కొత్త ఓటర్లను చేర్చడం, మరణించిన లేదా స్థానికంగా నివాసం ఉందని వారి ఓట్లను తొలిగించే అంశాలపైన వివరణ ఇవ్వడం జరిగింది. బి ఎల్ ఏ విధులు, బాధ్యతలు, హక్కుల గురించి ట్రైనర్ కేతురి వెంకటేష్, వారి బృందం అత్యంత క్లుప్తంగా బి ఎల్ ఏ లకు వివరించడం జరిగింది. సర్ ప్రక్రియ పేరుతో ప్రజల ఓటు హక్కును దెబ్బతీసే కుట్రలకు కాంగ్రెస్ పార్టీ గట్టిగా ఎదురొడ్డి, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిరంతరం పోరాటం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. బీజేపీ బీఆర్ఎస్ పార్టీలు అధికారంలోకి రావడానికి రాజ్యాంగ విరుద్ధమైన విధానాలకు పాల్పడుతూ, ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు చేస్తున్నాయని ఏఐసీసీ కార్యదర్శి, ఛత్తీస్‌గఢ్ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్ విమర్శించారు ఓటు హక్కు పరిరక్షణే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుంది అని సంపత్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రాజీవ్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప, కొల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, రాష్ట్ర అధికార ప్రతినిధి మాస్టర్ షేక్షావలి ఆచారి, సింగిల్ విండో చైర్మన్ పోతుల మధుసూదన్ రెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీ సంకాపురం రాముడు, మున్సిపల్ కౌన్సిలర్ లు, సర్పంచులు, మాజీ కౌన్సిలర్లు, మండల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, నాయకులు, కార్యకర్తలు, బీఎల్ఏలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వ్యవసాయం గోదాము నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



గద్వాల జూన్ 17 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండల పరిధిలో చాగదోణ గ్రామంలో ఎన్ అర్ ఈ జి ఎస్. పథకం కింద 30 లక్షల వ్యయంతో నిర్మించనున్న వ్యవసాయ గోదాం భవనమునకు గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి భూమి పూజ చేసి పనులను ప్రారంభించడం జరిగింది.ఎమ్మెల్యే కి గ్రామ సర్పంచ్ విరేష్ స్వామి శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన పంటను వ్యవసాయం ఉత్పత్తులను నిలువ ఉంచడానికి వ్యవసాయం గోదాము ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు.రైతులు వ్యవసాయం గోదాము నందు రైతులు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర వచ్చినప్పుడు అమ్ముకునే విధంగా నిలువ ఉంచుకోవడానికి ప్రభుత్వం గోదాము ను ఏర్పాటు చేసి రైతులకు అందుబాటులో తీసుకురావడం జరిగిందని, కావున ప్రతి ఒక్క రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ మాజీ చైర్మన్ జంబురామన్ గౌడ, మాజీ ఎంపీపీ విజయ్ కుమార్ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, సర్పంచ్ వీరేష్ స్వామి, ఉప సర్పంచ్ రంగన్న ముచ్చోని పల్లి సర్పంచ్ వీరాంజనేయులు పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు నాయకులు మాజీ సర్పంచ్ శంకరన్న బి శివప్ప హరిచంద్ర గౌడ్ గుడిసె నర్సింలు వడ్డే ఉసేని ఎండి బడే సాబ్ , ఆకుల మునిస్వామి మిట్టదొడ్డి లక్ష్మిరెడ్డి సంగటి భాస్కర్ జె పరమేష్ మొండి భాస్కర్ నర్సింలు సుంకన్న ప్రవీణు ఫకీర్అన్న తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి

**ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల జూన్ 18 (విజన్ ఆంధ్ర బ్యూరో) బీ ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.గురువారం గద్వాల మండలం గోనుపాడు గ్రామం వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలోని పలు విభాగాలను పరిశీలించి, తరగతి గదుల్లో విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు తీసుకున్న వివిధ కోర్సులు, వారి భవిష్యత్తు లక్ష్యాల గురించి అడిగారు. వివిధ ల్యాబ్ లను సందర్శించి విద్యార్థులకు అర్థమయ్యేలా శిక్షణ ఇవ్వాలని, అవసరమైన సెమినార్లు నిర్వహించి వివిధ అంశాలపై అవగాహన కల్పించాలని అక్కడి అధ్యాపకులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గద్వాలలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఇప్పటికే ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్ కోర్సులు ఉండగా ఈ సంవత్సరం నూతనంగా సైబర్ ఫిజికల్ సిస్టం సెక్యూరిటీ కోర్స్ ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. పాలిసెట్ కౌన్సిలింగ్ సందర్భంగా ఇప్పటికే వివిధ కోర్సుల్లో చేరిన విద్యార్థులు కొత్త కోర్సులోకి మారేందుకు అవకాశం ఉందన్నారు. ఇటీవల పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షలు రాసిన విద్యార్థులకు కూడా ఈ కళాశాలలో చేరేందుకు స్పాట్ అడ్మిషన్స్ ద్వారా అవకాశం ఉంటుందన్నారు. వడ్డేపల్లి లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్స్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ప్రతి కోర్సులో 60 సీట్లు ఉంటాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడి కళాశాలలో చేరిన విద్యార్థులు గద్వాలలోని పలు వసతి గృహాల్లో ఉన్నందున వారు కళాశాలకు వెళ్లి వచ్చేందుకు ఇబ్బంది లేకుండా బస్సులను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ సమీపంలోని గద్వాల మండలానికి చెందిన కస్తూర్బా విద్యాలయాన్ని సందర్శించారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ ను పరిశీలించి తగు సూచనలు చేశారు. కొత్త విద్యార్థుల అడ్మిషన్స్ గురించి అడిగి, నిబంధనల ప్రకారం విద్యార్థులను చేర్చుకోవాలన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు రోజులవుతున్న విద్యార్థులు పూర్తిస్థాయిలో విద్యాలయానికి రాకపోవడమేమిటిని ప్రశ్నించారు. ఈ సందర్భంగా పలు తరగతి గదులలో విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు బాగా చదువుకొని మంచి స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేశారు. మెనూ ప్రకారం భోజనం వండించాలని అక్కడి ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం కస్తూర్బా విద్యాలయ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ పర్యటనలో డీఈవో విజయలక్ష్మి, సెక్టోరియల్ అధికారి జ్యోతి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్, కస్తూర్బా విద్యాలయ ప్రత్యేక అధికారిని గోపీలత, తదితరులున్నారు.

# నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

**- ప్రభుత్వం సూచించిన వరి వంగడాలనే విక్రయించాలి**

**- విత్తనాలు, ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల జూన్ 18 (విజన్ ఆంధ్ర బ్యూరో) : గడువు ముగిసిన, విడిగా ఉండే, నకిలీ విత్తనాలను రైతులకు అంటగడితే సహించేది లేదని, సంబంధిత డీలర్ల పై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ హెచ్చరించారు. గురువారం గద్వాలలోని పాత బస్టాండ్ లో పలు విత్తనాలు, ఎరువుల దుకాణాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు కంపెనీలకు చెందిన వివిధ రకాల విత్తనాల ప్యాకెట్లను పరిశీలించారు. వానాకాలం 2026 సీజన్ కు సంబంధించి వ్యవసాయ శాఖ సూచించిన ఎనిమిది రకాల వరి వంగడాలను మాత్రమే రైతులు సాగు చేయాల్సి ఉన్నందున డీలర్లు వాటిని మాత్రమే విక్రయించాలన్నారు. బిపిటి 5204, ఆర్ఎన్ఆర్ 15048, కేఎన్ఎం 1638, డబ్ల్యూ జిఎల్ 962, డబ్ల్యూజిఎల్ 44, జేజిఎల్ 1798, జైశ్రీరామ్, హెచ్ఎంటి (సోనా) రకాలకు మాత్రమే ప్రభుత్వం ఈ ఏడాది బోనస్ చెల్లించడం జరుగుతుందన్నారు. రైతులు నానో యూరియాను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ప్రతి పెస్టిసైడ్, సీడ్స్ దుకాణాల వద్ద స్టాక్ బోర్డ్ లు తప్పనిసరిగా ఏర్పాటు చేసి అందులో సమగ్ర వివరాలను పొందుపరచాలన్నారు. ఆయా రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని, రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని దుకాణాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుపుకోవాలని డీలర్లకు సూచించారు. పలువురు డీలర్లు రైతులకు ఇచ్చే రసీదుల్లో ఇష్టానుసారం సొంతంగా నిబంధనలను ముద్రించడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో సంబంధిత డీలర్లకు నోటీసులు ఇవ్వాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గద్వాల పట్టణంలోని ప్రధాన రహదారుల్లో, ముఖ్యమైన కూడళ్లలో ఇష్టానుసారం ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంపై సంబంధిత అధికారులపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతులు లేకుండా ఏర్పాటు చేసే ప్రకటనల బోర్డులను తొలగించాలని, ఫ్లెక్సీల కారణంగా ఇబ్బందులు ఉన్నందున వెంటనే తీసివేయించాలని మున్సిపల్ కమిషనర్ జానకిరామ్ సాగర్ కు సూచించారు. ఈ పర్యటనలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి వీరప్ప, మండల వ్యవసాయ అధికారి ప్రతాప్ కుమార్, టెక్నికల్ ఏవోలు చంద్రశేఖర్, భవాని తదితరులున్నారు.

# జిల్లాలో నేరాల నియంత్రణలో గణనీయ పురోగతి

**- శాంతిభద్రతల పరిరక్షణలో నాయకుల, ప్రజల సహకారం అభినందనీయం.**

**- జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్**



కడప,జూన్ 18 (విజన్ ఆంధ్ర) గత రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో వైఎస్ఆర్ కడప జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు శాంతిభద్రతల పరిరక్షణలోనూ గణనీయమైన పురోగతి సాధించామని జిల్లా పోలీసు సూపరింటెండెంట్ షెల్కే నచికేత్ విశ్వనాథ్ తెలిపారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా. గురువారం కడప నగరంలోని పుత్తా ఎస్టేట్ లో ఘనంగా ప్రారంభం అయిన "రాష్ట్రంలో రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి – సంక్షేమం" విజయోత్సవ సభలో జిల్లా ఎస్పీ ప్రసంగించారు.ఈ సందర్భంగా ఎస్ పి మాట్లాడుతూ.జిల్లాలో నేరాల నియంత్రణకు పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ సమర్థవంతమైన చర్యలు చేపట్టడంతో పలు రకాల నేరాల శాతం తగ్గుముఖం పట్టిందన్నారు.ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పోలీసు శాఖ నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తోందని పేర్కొన్నారు.జిల్లాలో శాంతిభద్రతల నిర్వహణలో ప్రజాప్రతినిధులు, అధికారులు,పోలీసు యంత్రాంగం మధ్య సత్సంబంధాలు నెలకొనడం వల్ల పరిపాలన మరింత సమర్థవంతంగా సాగుతోందన్నారు. రాజకీయ భేదాలకు అతీతంగా ప్రజల సంక్షేమం, భద్రతే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయనన్నారు. మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, మహిళా హెల్ప్‌డెస్క్‌లు, షీ టీమ్స్, సైబర్ అవగాహన కార్యక్రమాల ద్వారా రక్షణ చర్యలను మరింత బలోపేతం చేశామని ఎస్పీ తెలిపారు.బాలల రక్షణ, మహిళలపై నేరాల నివారణ, సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు.సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు జిల్లావ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై త్వరితగతిన స్పందిస్తూ బాధితులకు న్యాయం చేయడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. అక్రమ మద్యం, గంజాయి, మాదక ద్రవ్యాల రవాణా, విక్రయాలపై నిరంతర నిఘా కొనసాగుతోందని, నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల కదలికలపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ వివరించారు. ప్రజలకు సురక్షిత వాతావరణం కల్పించడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని చెప్పారు. జిల్లాలో శాంతి, సామరస్య వాతావరణం కొనసాగేందుకు ప్రజలు పోలీసు శాఖకు అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్న ఎస్పీ, భవిష్యత్తులో కూడా ప్రజల భాగస్వామ్యంతో మరింత మెరుగైన పోలీసింగ్ అందించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు.

# సచివాలయం ముట్టడికి జర్నలిస్టుల యత్నం

**-అడ్డుకున్న పోలీసులు**

**- గన్ పార్కు వద్ద అరెస్టులు**





హైదరాబాద్, జూన్ 18 (విజన్ ఆంధ్ర ): రాష్ట్ర ప్రభుత్వ వివక్ష, నిర్లక్ష్య వైఖరికి నిరసనగా,తమ డిమాండ్ల సాధనకై గురువారం జర్నలిస్టులు "ఛలో హైదరాబాద్" కార్యక్రమం నిర్వహించారు. గన్ పార్క్ నుంచి సచివాలయం ముట్టడికి బయలుదేరిన జర్నలిస్టులను పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ఇచ్చిన "ఛలో హైదరాబాద్" పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల నుంచి తరలివచ్చిన జర్నలిస్టుల గన్ పార్క్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ వ్యవస్థాపక,రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య గన్ పార్క్ లోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద పూలు పెట్టి నివాళు లర్పించారు. అనంతరం తెలంగాణ అమరవీరుల స్థూపానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో పన్నెండేళ్ళుగా జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకుండా పాలకులు వివక్ష చూపుతున్నారని విమర్శించారు. తెలంగాణ కోసం తెలంగాణ జర్నలిస్టులు అన్న నినాదంతో తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన జర్నలిస్టులను పాలకులు చిన్నచూపు చూడడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినప్పటికీ, జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం మొండి చేయి చూపుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. తెలంగాణలో అనేక చిన్న, మధ్య తరహా పత్రికలు మూతపడే పరిస్థితి ఏర్పడిందని, రెండున్నర సంవత్సరాలుగా ప్రభుత్వం అడ్వర్టైజ్మెంట్స్ బిల్స్ ఇవడంలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్స్ వెంటనే ఇవ్వాలని, ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు అక్రెడిటేషన్ కార్డుతో పాటు హెల్త్ కార్డు ఇవ్వాలని, గ్రేటర్ హైదరాబాద్ తో సహా రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్లస్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్ఎన్ఐ, పీఆర్జీఐ రిజిస్ట్రేషన్ తో రెగ్యులారిటీ ఉన్న పత్రికలను ఎంపానెల్మెంట్ చేయాలని, జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు, కళాశాలల్లో ఉచిత విద్యను అందించాలని, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి జర్నలిస్టుకు ఉచిత బీమా పథకం ఏర్పాటు చేయాలని, 60 సంవత్సరాలు దాటిన జర్నలిస్టులకు పెన్షన్లు ఇవ్వాలని, జర్నలిస్టుల సంక్షేమానికి బడ్జెట్ లో రూ.100 కోట్లు కేటాయించాలని, జర్నలిస్టుకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన అనేక మంది జర్నలిస్టులు పాల్గొని ప్లకార్డులతో నినదించారు. అనంతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించగా పోలీసులు వారిని అడ్డుకొని అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిని పంజాగుట్ట పోలీస్ స్టేషన్,ఆసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్ లకు తరలించారు. జర్నలిస్టుల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం నెరవేర్చకపోతే రాబోయే కాలంలో గత ప్రభుత్వాని పట్టిన గతే ఈ ప్రజా ప్రభుత్వానికీ పడుతుందని మామిడి సోమయ్య హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కో-కన్వీనర్లు బండి విజయ్ కుమార్, యాదగిరి, తన్నీరు శ్రీనివాస్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ చిర్రా శ్రీనివాస్, దామెర జగదీశ్వర్ గుప్తా, కే. పాండురంగారావు, పద్మనాభరావు, సామ్రాట్ గుప్తా, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవి కుమార్, కో-కన్వీనర్లు ఆర్. శ్రీనివాస్ గౌడ్, సంతోష్ కుమార్, ఎం.రవికుమార్, సుభాష్, రేగటి వెంకన్న, ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నానబాల రామకృష్ణ, అర్వపల్లి నగేష్, మహబూబ్ నగర్ జిల్లా కార్యాధ్యక్షుడు గండీటి నర్సింహా, కార్యదర్శి గోపాల్, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు మధు, సూర్యాపేట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల్వాయి జానయ్య, ముషం హరిప్రసాద్, వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జక్కుల విజయ్ కుమార్, స్వామిదాస్, పాలడుగు సురేందర్, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు దూమర్ల బాస్కర్, రంగారెడ్డి జిల్లా నాయకులు అశోక్ కుమార్ గౌడ్, పర్వతాలు, మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, గడ్డమీది అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో యూరియా కొరతకు కేంద్రమే కారణం!!

**- ప్రభుత్వ విప్ విజయరమణ రావు**



పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 18 (విజన్ ఆంధ్ర): తెలంగాణలో యూరియా కొరతకు కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని తెలంగాణ ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని సీఎల్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న యూరియా ఎరువులను మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ వంటి ఇతర రాష్ట్రాలకు తరలించడం వల్ల తెలంగాణలో తీవ్ర కొరత ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

**కేంద్ర మంత్రుల నిర్లక్ష్యంపై విమర్శలు**

ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన 47 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఇంకా రాష్ట్రానికి రావాల్సి ఉందని విజయరమణ రావు తెలిపారు. ఈ విషయంలో రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు ఏనాడూ పట్టించుకోలేదని ఆయన మండిపడ్డారు. "రైతు గోస" పేరిట యాత్రలు చేసిన బీజేపీ నాయకులకు యూరియా సమకూర్చే ఆలోచన లేదని విమర్శించారు. రాష్ట్రంలో ఎనిమిది మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ, రైతు సమస్యలను ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "రైతు గోస ఏమో గానీ, బీజేపీ నేతల గోసే చూస్తే జాలి వేస్తోంది" అని ఎద్దేవా చేశారు.

**కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా**

గతంలో కేసీఆర్ ప్రభుత్వం సన్నవడ్లకు ఎన్నడూ బోనస్ ఇవ్వలేదని గుర్తు చేస్తూ, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సన్నవడ్లకు బోనస్ ఇస్తుందని విజయరమణ రావు స్పష్టం చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రూ. 2 వేల కోట్ల బోనస్‌ను రైతులకు చెల్లించిందని తెలిపారు. అలాగే, రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా వడ్ల కొనుగోళ్లను పూర్తి చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో 75 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను సేకరించడం జరిగిందని, మార్క్‌ఫెడ్ ద్వారా 15 లక్షల మెట్రిక్ టన్నుల మక్కలను సేకరించినట్లు వివరించారు. మక్కల కొనుగోలు వల్ల ప్రభుత్వానికి నష్టం వచ్చినప్పటికీ, రైతుల కోసం భరించిందని పేర్కొన్నారు. సన్నవడ్లకు మళ్లీ బోనస్ చెల్లించడం జరుగుతుందని ఆయన హామీ ఇచ్చారు.

**పంటల మార్పిడిపై స్పష్టత**

వరి పంట వేయవద్దని తమ ప్రభుత్వం ఏనాడూ చెప్పలేదని విజయరమణ రావు స్పష్టం చేశారు. పంటల మార్పిడి వల్ల భూసారం పెరుగుతుందని, అలాగే పామాయిల్ తోటల పెంపకం లాభసాటి వ్యాపారమని రైతులకు చైతన్యం కల్పించడం జరిగిందని ఆయన అన్నారు. భవిష్యత్తు అవసరాల కోసం పామాయిల్ విత్తనాలను ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకోకుండా, రాష్ట్రంలోనే తోటల పెంపకం చేయాలని మాత్రమే రైతులకు చెప్పడం జరిగిందని వివరించారు.

**కేటీఆర్, హరీష్ రావులపై విమర్శలు**

కేటీఆర్, హరీష్ రావులు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని విమర్శించడమే ధ్యేయంగా పెట్టుకున్నారని విజయరమణ రావు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడానికి ఇద్దరూ పోటీపడుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఈ విలేకరుల సమావేశం ద్వారా రాష్ట్రంలో యూరియా కొరత, రైతుల సమస్యలు, ప్రభుత్వ విధానాలపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని విజయరమణ రావు స్పష్టం చేశారు.

# సింగరేణి కార్మికుల సమస్యలపై కవిత గళం!!

**- రామగుండం ఓసిపి-3 వద్ద గేట్ మీటింగ్**

**- వేతనాలు, ఉద్యోగ భద్రత, వైద్య సౌకర్యాలపై డిమాండ్**

**- సింగరేణి కార్మికులకు అండగా తెలంగాణ రక్షణ సేన పార్టీ చీఫ్ కవిత**



పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 18 (విజన్ ఆంధ్ర): సింగరేణి కార్మికుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రక్షణ సేన చీఫ్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత గళమెత్తారు. "సింగరేణి బాయిబాట" కార్యక్రమంలో భాగంగా గురువారం రామగుండం ఓసిపి-3 వద్ద జరిగిన గేట్ మీటింగ్లో ఆమె పాల్గొని కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా కార్మికుల సంక్షేమం, సింగరేణి సంస్థ భవిష్యత్తుపై ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు.

**కార్మికుల సమస్యలపై కవిత ప్రసంగం**

టిఆర్ఎస్ చీఫ్ కవిత తన ప్రసంగంలో సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రస్తావించారు. వేతన సవరణలు, ఉద్యోగ భద్రత, కార్మికుల పిల్లలకు ఉద్యోగావకాశాలు, వైద్య సౌకర్యాలు వంటి అంశాలపై ఆమె మాట్లాడారు. సింగరేణి కార్మికులు దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి శ్రమకు తగిన గుర్తింపు, గౌరవం లభించాలని ఆమె అన్నారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణిని ప్రైవేటీకరించే ఆలోచనలను విరమించుకోవాలని, కార్మికుల ప్రయోజనాలకు విరుద్ధంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోకూడదని ఆమె డిమాండ్ చేశారు. టీఆర్ఎస్ ఎల్లప్పుడూ సింగరేణి కార్మికులకు అండగా ఉంటుందని ఆమె హామీ ఇచ్చారు.

**సింగరేణి బాయిబాట లక్ష్యం**

"సింగరేణి బాయిబాట" కార్యక్రమం ద్వారా సింగరేణిలోని అన్ని గనులు, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులను సందర్శించి కార్మికుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం, వాటి పరిష్కారం కోసం ప్రభుత్వంతో చర్చించడం పార్టీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా కార్మికులలో ఆత్మవిశ్వాసం నింపి, వారి హక్కుల కోసం పోరాడే స్ఫూర్తిని రగిలించాలని ఆమె ఆశిస్తున్నారు. ఈ గేట్ మీటింగ్ సింగరేణి కార్మికులలో కొత్త ఉత్సాహాన్ని నింపిందని, వారి సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం చేస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ గేట్ మీటింగ్ లో హెచ్ఎంఎస్ నాయకులు రియాజ్ అహ్మద్, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మనోజా గౌడ్ తో పాటు పలువురు కార్మిక సంఘాల ప్రతినిధులు, టీఆర్ఎస్ నాయకులు, పెద్ద సంఖ్యలో సింగరేణి కార్మికులు పాల్గొన్నారు. రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ, కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని, కవిత నాయకత్వంలో పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. మనోజా గౌడ్ మాట్లాడుతూ, సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం టీఆర్ఎస్ కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. కవిత నాయకత్వంలో అన్ని వర్గాల వారికి సమ న్యాయం జరుగుతుందని జోస్యం చెప్పారు.

# మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 18 (విజన్ ఆంధ్ర) : అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగ మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం (International Day Against Drug Abuse and Illicit Trafficking) సందర్భంగా వనపర్తి జిల్లాలో నిర్వహించనున్న “నషా ముక్త్ భారత్ సప్తాహ్“ కార్యక్రమాల పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి గురువారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కల్పించడం, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, సమాజాన్ని నషా రహితంగా తీర్చిదిద్దేందుకు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి కె. సుధారాణి, డీసీపీఓ ఎం. రాంబాబు, జిల్లా బాలల అభివృద్ధి ప్రాజెక్టు అధికారులు (సీడీపీఓలు), డ్రగ్ డీ-అడిక్షన్ సెంటర్ కో-ఆర్డినేటర్ వెంకట్ రెడ్డి మరియు వారి బృందం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ పేరుతో ఫేక్ వాట్సాప్ సందేశాలు

**- అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్ హెచ్చరిక**

**- అధికారిక సమాచారం కేవలం అధికారిక మార్గాల్లోనే**



ములుగు జూన్ 18 , విజన్ ఆంధ్ర ప్రతినిధి : జిల్లా కలెక్టర్ లిబోర్థడే హేమంత్ సహదేవరావులి పేరుతో కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు వాట్సాప్ ద్వారా ఫేక్ మెసేజ్‌లు పంపుతూ అధికారులను సంప్రదించే ప్రయత్నం చేస్తున్నారని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ఇటువంటి నకిలీ సందేశాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ స్పందించవద్దని జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లా కలెక్టర్ అధికారిక సమాచార వ్యవహారాలు కేవలం అధికారిక మార్గాల ద్వారానే జరుగుతాయని స్పష్టం చేశారు. తెలియని నంబర్ల నుంచి, జిల్లా కలెక్టర్ పేరు, ఫోటో, ఇతర వివరాలు ఉపయోగించి వచ్చే సందేశాలను నమ్మవద్దని కోరారు. ఇలాంటి ఫేక్ మెసేజ్‌లు వస్తే వెంటనే జిల్లా కలెక్టర్ కార్యాలయం దృష్టికి లేదా స్థానిక పోలీసు అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ప్రతి అధికారి, ఉద్యోగి అప్రమత్తంగా ఉండి సైబర్ మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

# ఓటరు లిస్టు సవరణకు ‘స్పెషల్ హెల్ప్ డెస్క్’

**- కలెక్టర్ ఆకస్మిక తనిఖీ.**

**- దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి, మర్యాదగా స్పందించాలి.**

**- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని ఆదేశం**

**- జిల్లా కలెక్టర్ బోర్థడే హేమంత్ సహదేవరావు.**





ములుగు జూన్ 18, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ఓటరు జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) కార్యక్రమంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకూడదని, పారదర్శకంగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ లిబోర్థడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఎస్.ఐ.ఆర్ ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. హెల్ప్ డెస్క్ పనితీరు, దరఖాస్తుల స్వీకరణ, నమోదు ప్రక్రియ, పరిష్కార విధానాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఓటర్లకు అవసరమైన సమాచారం, మార్గదర్శకాలను లిఎలాంటి జాప్యం లేకుండా అందించాలని సూచించారు. 18 ఏళ్లు నిండి అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలాలి ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. పేర్ల చేర్పు, తొలగింపు, చిరునామా మార్పు వంటి సవరణలకు సంబంధించిన దరఖాస్తులను వేగంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. హెల్ప్ డెస్క్‌కు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సందేహాలను అక్కడికక్కడే నివృత్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ చందర్ శేఖర్, డీపీఆర్ఓ రఫిక్, అడిషనల్ పీడీ శ్రీనివాస్, ఎన్నికల డీటీ నితీష్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గ్యాస్ సబ్సిడీ కావాలంటే జూన్ 30 లోపు e-KYC మస్ట్: డీఎస్వో.

ములుగు జూన్ 18, విజన్ ఆంధ్ర ప్రతినిధి: రబీ 2025-26 సీజన్ ధాన్యం కొనుగోళ్లను ములుగు జిల్లా యంత్రాంగం విజయవంతంగా పూర్తి చేసింది. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 149 కొనుగోలు కేంద్రాల ద్వారా 14,220 మంది రైతుల నుంచి 1,11,766 మెట్రిక్ టన్నుల వడ్లను సేకరించినట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సయ్యద్ షా ఫైసల్ హుస్సేని వెల్లడించారు. రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రూ.265 కోట్లను వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. కలెక్టర్ (పౌర సరఫరాలు) పర్యవేక్షణలో కొనుగోళ్లు సజావుగా సాగాయన్నారు.ద ఎల్పీజీ వినియోగదారులకు అలర్ట్: అదే విధంగా, జిల్లాలోని ఎల్పీజీ వినియోగదారులంతా 30 జూన్ 2026 లోగా వ-ఖ్జ పూర్తి చేయాలని డీఎస్వో సూచించారు. గడువు దాటితే గ్యాస్ సబ్సిడీ నిలిపివేతతో పాటు బకాయిలు కూడా రావని స్పష్టం చేశారు. వెంటనే దగ్గరలోని గ్యాస్ ఏజెన్సీని సంప్రదించి వేలిముద్ర ద్వారా వ-ఖ్జ పూర్తి చేసుకోవాలని కోరారు.

# ప్రజల భద్రతే లక్ష్యంగా మహబూబ్‌నగర్‌లో భారీ ఫ్లాగ్ మార్చ్



మహబూబ్‌నగర్ అర్బన్ జూన్18 (విజన్ ఆంధ్ర) :మహబూబ్‌నగర్ పట్టణంలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో గురువారం టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) బలగాలతో కలిసి భారీ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ స్వయంగా పాల్గొని బలగాలను సమీక్షించారు. ఫ్లాగ్ మార్చ్ ఓల్డ్ డీఈఓ కార్యాలయం, రైల్వే స్టేషన్, ఎర్రసత్యం క్రాస్ రోడ్, బోయపల్లి గేట్, తెలంగాణ చౌరస్తా, న్యూ బస్ స్టాండ్, మల్లికార్జున చౌరస్తా తదితర ప్రధాన ప్రాంతాల్లో నిర్వహించారు. ప్రజా రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో పోలీసులు అప్రమత్తంగా నిఘా కొనసాగిస్తున్నట్లు ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇజాజుద్దీన్, ఆర్ఏఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్, ఆర్ఏఎఫ్ సిబ్బంది, పోలీసు అధికారులు మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి. జానకి మాట్లాడుతూ, జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో జీవించేలా జిల్లా పోలీసు యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తోందన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, నేరాలను సమర్థవంతంగా అరికట్టడంతో పాటు ప్రజల్లో భద్రతా భావన పెంపొందించడమే ఫ్లాగ్ మార్చ్ ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ప్రజా రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు వెల్లడించిన ఎస్పీ, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనల గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. జిల్లాలో శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ ప్రజలతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తుందని, ప్రజల సహకారం పోలీసులకు ఎంతో కీలకమని ఎస్పీ డి.జానకి తెలిపారు.

# టెట్ నుంచి మినహాయింపు ఇవ్వండి

**- ఏబీఆర్ఎస్ ఎం ఆధ్వర్యంలో ప్రభుత్వానికి వినతి**



ములుగు జూన్ 18, విజన్ ఆంధ్ర ప్రతినిధి : 2010 కి ముందు నియమితులైన ఉపాధ్యాయులకు ఆర్డినెన్స్ ద్వారా పరిష్కారం కోరుతూ కలెక్టర్ ద్వారా ప్రధాని, కేంద్ర విద్యాశాఖ మంత్రి, సీఎంకు రిప్రజెంటేషన్లు ములుగు: 2010కి ముందు నియమితులైన ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) సమస్యకు శాశ్వత పరిష్కారం కోరుతూ అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ (ఏబీఆర్ఎస్ ఎం) ఆధ్వర్యంలో బుధవారం దేశవ్యాప్తంగా జిల్లా కలెక్టర్ల ద్వారా వినతిపత్రాలు సమర్పించారు. ఇందులో భాగంగా ములుగు జిల్లాలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టిపియూఎస్) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గౌరవ ప్రధానమంత్రి, కేంద్ర విద్యాశాఖ మంత్రి, తెలంగాణ ముఖ్యమంత్రిలకు ఈ వినతిపత్రాలను పంపించాలని కోరారు. 23 ఆగష్టు 2010 న జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్.సి.టి.ఇ) ఇచ్చిన నోటిఫికేషన్ ద్వారా టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి చేస్తూ నిబంధన విధించారు. ఈ నోటిఫికేషన్‌ను సమర్థిస్తూ గౌరవ సుప్రీంకోర్టు 29 మే 2026 న ఇచ్చిన తాజా తీర్పుతో 23 ఆగష్టు 2010 కి ముందు నియమితులైన ఉపాధ్యాయుల్లో తీవ్ర ఆందోళన, అభద్రతాభావం నెలకొందని వినతిపత్రంలో పేర్కొన్నారు. “2010 కి ముందు నియామకాలు అప్పటి నిబంధనలు, అర్హతల ప్రకారమే జరిగాయి. తర్వాత వచ్చిన నిబంధనలను పూర్వపు నియామకాలకు వర్తింపజేయడం ఆందోళనకరం. కోర్టు తీర్పును గౌరవిస్తూనే, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా పార్లమెంటు, శాసనసభలకు చట్టాలు చేసే అధికారం ఉంది. కావున ఈ వర్షాకాల సమావేశాల్లోనే ఆర్డినెన్స్ తీసుకువచ్చి 2010 ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు కల్పించాలి. వారి పదోన్నతులు, సర్వీసు ప్రయోజనాలకు ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలి“ అని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టిపియూఎస్ ములుగు జిల్లా అధ్యక్షురాలు వాంకుడోత్ జ్యోతి , జిల్లా ప్రధాన కార్యదర్శి గోనె రవీందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సల్లగొండ పద్మాకర్ రెడ్డి, జిల్లా బాధ్యులు నల్ల రాజి రెడ్డి, ఎడ్ల సంపత్, బానాల సుధాకర్, తాతా ఓదెల్, బి.భద్రయ్య, కె.సమ్మయ్య, ఒల్లాల రాజేందర్, శ్యామ్, కొర్ర రాజన్న, బలరాం తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తాం

**- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్.**

**- వెల్దండ మండలంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ విస్తృత పర్యటన.**



వెల్దండ జూన్ 18 (విజన్ ఆంధ్ర) : ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సూచించారు. గురువారం వెల్దండ మండల పరిధిలోని పెద్దాపూర్, వెల్దండ గ్రామాలలో జిల్లా కలెక్టర్ పర్యటించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. వెల్దండ గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్రమం పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న గృహాలను సందర్శించి లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి,ఇంటి నిర్మాణ పనుల స్థితిగతులు, ప్రభుత్వ సహాయం అందుతున్న తీరు, ఎదురవుతున్న సమస్యల గురించి ఆరా తీశారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, నిర్మాణాలను నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని అమలు చేస్తున్న పథకాలను అర్హులందరికీ చేరవేయడం అధికారుల బాధ్యత అని తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలులో నిర్లక్ష్యానికి తావు లేకుండా క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా గృహ నిర్మాణ కార్యక్రమాలను వేగవంతం చేసి లబ్ధిదారులకు సకాలంలో గృహ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వెల్దండ గ్రామానికి చెందిన ఉడుత సుమాతమ్మ భర్త ఉడుత జంగయ్య దివ్యాంగుడని, ఆయనకు సదరం ధ్రువీకరణ పత్రం మంజూరు చేయడంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సంబంధిత అంశాలను పరిశీలించి, ప్రభుత్వ నిబంధన మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తదనంతరం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీసీ బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ సందర్శించారు. అక్కడి వసతులు, పరిశుభ్రత, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, భోజన నాణ్యత తదితర అంశాలపై సమగ్రంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా వసతి గృహ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. నూతన భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని వారు కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులు అవసరమైన ప్రతిపాదనలు వెంటనే సమర్పించాలని ఆదేశించారు. విద్యార్థుల అవసరాలు, భద్రతను దృష్టిలో ఉంచుకుని తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం, పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వసతి గృహాల నిర్వహణలో ఎటువంటి లోపాలు ఉండరాదని స్పష్టం చేశారు. మండలంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు అందుబాటులో ఉండాలని, ప్రభుత్వ లక్ష్యాల సాధనలో పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి,వెల్దండ తహసీల్దార్ కార్తీక్ కుమార్, ఎంపీడీవో కృష్ణయ్య, ఎంఈవో చంద్రుడు నాయక్, వెల్దండ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, పెద్దాపూర్ సర్పంచ్ కేశమల్ల అనూష, వివిధ శాఖల అధికారులు, మండల స్థాయి అధికారులు, ఆయా గ్రామాల గ్రామపంచాయతీ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు పనులను అడ్డుకున్న సింగరేణి

**- ఎవరిని కాపాడేందుకు సూచిక బోర్డు ఏర్పాటు.?**



మందమర్రి, జూన్ 18 (విజన్ ఆంధ్ర) : మందమర్రి మండలంలోని క్యాతన్ పల్లి మున్సిపాలిటీలో నాలుగు కార్మిక వాడలను కలుపుతూ మునిసిపాలిటీ ఆధ్వర్యంలో చేపట్టే సీసీ రోడ్డు రహదారి పనులను సింగరేణి విభాగానికి చెందిన ఎస్టేట్ అధికారులు అడ్డుకున్నట్లు తెలుస్తుంది. గత కొన్నేళ్లుగా జయశంకర్ చౌరస్తా మీదుగా ప్రమాణం సాగిస్తున్న నాలుగు వాడల కార్మిక కుటుంబాలకు సులువైన రహదారి మార్గాన్ని ఏర్పాటు చేసేందుకు టెండర్ పూర్తిగా కాగా ఇప్పటి వరకు సింగరేణి సహకరించకపోవడంతోనే పనులు నిలిచిపోయినట్లు స్థానికులు చెప్తున్నారు. గత రెండు రోజులుగా పనులు చేసేందుకు అక్కడికి వచ్చిన గుత్తేదారులను సింగరేణి ఎస్ అండ్ పిసి విభాగానికి చెందిన సెక్యూరిటీ గార్డ్ అడ్డుకోవడంతో సదరు గుత్తేదారు ఎస్టేట్ అధికారులతో మాట్లాడినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం ఓ రెండు రోజుల పాటు పనులు నిలిపివేయాలంటూ మౌకిక ఆదేశాలు జారీ చేయడంతో నిలిచిపోయాయి.కాగా టెండర్ ఆర్డర్ కాపీని సింగరేణి ఎస్టేట్ విభాగానికి మున్సిపల్ అధికారులు అందించే లోపే బుధవారం సూచిక బోర్డు ఏర్పాటు చేయడం విశేషం.

**అభివృద్ధి మరిచి.. సూచిక బోర్డు ఏర్పాటు**

కార్మిక వాడలలో మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన సింగరేణి అధికారులు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న రహదారి నిర్మాణ పనులను నిలిపివేయడంతో పాటు హుటాహుటిన సూచిక బోర్డు ఏర్పాటు చేయడం పట్ల స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న ప్రజల సమస్యను పరిష్కరించేందుకు మున్సిపాలిటీ ముందుకు వచ్చిన సింగరేణి మాత్రం అడ్డుకుంటుందనే చర్చ కార్మిక వర్గం నుంచి వినిపిస్తుంది. సింగరేణిలో ఎన్నో క్వార్టర్లు,ఖాళీ స్థలాలు కబ్జాలకు గురవుతున్న కనీస రక్షణ చర్యలు పాటించకపోవడంతో పాటు కంచె వేయడంలో సింగరేణి అధికారులు పూర్తిగా విఫలమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్మిక కుటుంబ సభ్యుల సౌకర్యార్థం నిర్మాణం చేస్తున్న సీసీ రోడ్డు పనులకు సింగరేణి ఎస్టేట్ అధికారులు అనుమతులు ఇచ్చి సహకరిస్తారా..? ఇలాగే అభివృద్ధిని అడ్డుకుంటారా అనేది వేచి చూడాల్సిందే..?

# కడప జిల్లా లో రూ.1.07 లక్షల కోట్ల పెట్టుబడులు వేలాది ఉద్యోగాలకు మార్గం

**- పునరుత్పాదక ఇంధన రంగంలో రాష్ట్రంలోనే ముందంజలో కడప జిల్లా.**

**- జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**



కడప,జూన్ 18: (విజన్ ఆంధ్ర) పునరుత్పాదక ఇంధన రంగం లో కడప జిల్లా వేగంగా అభివృద్ధి చెందుతూ రాష్ట్రం లోనే కీలక కేంద్రంగా మారుతోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు.ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా.గురువారం కడప నగరంలోని పుత్తా ఎస్టేట్ లో “రాష్ట్రంలో రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి - సంక్షేమం“ విజయోత్సవ సభ.ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం సుమారు 4.5 మెగావాట్లు (4,500 మెగావాట్లు) సోలార్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని వెల్లడించారు. జిల్లాలో ప్రతిపాదిత పంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్టులు మరియు సోలార్ విద్యుత్ ప్రాజెక్టుల ద్వారా సుమారు రూ.1.07 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్ష, పరోక్షంగా వేలాది ఉద్యోగ అవకాశాలు కల్పించబడనున్నాయని చెప్పారు.ఇప్పటికే సుమారు 1,100 మెగావాట్లకు పైగా విద్యుత్ ఉత్పత్తి యూనిట్లు గ్రిడ్‌కు అనుసంధాన మయ్యాయని, మరిన్ని ప్రాజెక్టులు త్వరలో ఉత్పత్తి ప్రారంభించనున్నాయని వివరించారు. పునరుత్పాదక ఇంధన రంగం అభివృద్ధితో పాటు జిల్లాలో పారిశ్రామికీకరణకు కూడా ఊతం లభిస్తోందన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు అమలు చేస్తోందని కలెక్టర్ తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించి స్థానిక యువతను ఉపాధికి సిద్ధం చేస్తున్నామని చెప్పారు. మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా జిల్లాలో రోడ్లు, రైల్వే కనెక్టివిటీ విస్తరణకు ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. దాదాపు 500 కిలోమీటర్లకు పైగా రహదారి అభివృద్ధి పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని, వీటి కోసం రూ.18 వేల కోట్లకు పైగా వ్యయం ప్రతిపాదించ బడిందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే కడప నుంచి బెంగళూరు, హైదరాబాద్, చెన్నై వంటి ప్రధాన నగరాలకు ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుందని చెప్పారు. మెరుగైన రవాణా సదుపాయాలతో పెట్టుబడులు, పరిశ్రమలు, వాణిజ్య కార్యకలాపాలు మరింతవేగవంతమవుతాయని కలెక్టర్ తెలిపారు విద్య, ఉపాధి,మౌలిక వసతులు, ఇంధన రంగాల్లో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ద్వారా కడప జిల్లాను రాష్ట్రంలోనే అభివృద్ధి చెందిన జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

# “ఆచార్య రత్న“ పురస్కార గ్రహీత శర్మ కు ఘన సన్మానం



కరీంనగర్ (విజన్ ఆంధ్ర) జూన్ 18..శ్రీ చైతన్య పీజీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ నాగిళ్ల సదాశివ శర్మ ఇటీవల నెల్లూరు లో నిర్వహించిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ప్రతిష్టాత్మకమైన “ఆచార్య రత్న“పురస్కారాన్ని అందుకున్నారు.ఈ పురస్కారాన్ని అఖిల భారత జాతీయ బ్రాహ్మణ ఐక్య వేదిక అధ్యక్షుడు అవధానం సాయికుమార్ చేతులమీదుగా ప్రదానం చేశారు.ఈ సందర్భంగా విద్యా రంగానికి ఆయన అందించిన విశిష్ట సేవలను పలువురు వక్తలు కొనియాడారు.అనంతరం శర్మ కు పుష్ప గుచ్చాన్ని అందించి శాలువా తో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎం. దత్తాత్రేయ శర్మ, కే. వి. ఎన్. ఆచార్య,సుబ్రహ్మణ్య శర్మ, కె. శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కడప ను ఇంధన, పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దుతాం

**- రూ.1.07 లక్షల కోట్ల పెట్టుబడులు వేలాది ఉద్యోగాలకు మార్గం**

**- యువత, మహిళలు, రైతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం**

**- జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్. సవిత**

కడప,జూన్ 18 (విజన్ ఆంధ్ర)రాష్ట్ర అభివృద్ధి,పారిశ్రామిక ప్రగతి, ఉపాధి కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్. సవిత అన్నారు. కడప జిల్లా లో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి మంత్రి మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతాన్ని ముఖ్యంగా కడప జిల్లాను పునరుత్పాదక ఇంధన, పారిశ్రామిక రంగాలకు కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా. గురువారం కడప నగరంలోని పుత్తా ఎస్టేట్ లో ఘనంగా ప్రారంభం అయిన “రాష్ట్రంలో రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి - సంక్షేమం“ విజయోత్సవ సభ.ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి పరిశ్రమల శాఖ మంత్రి మరియు జిల్లా ఇన్చార్జి మంత్రి ఎస్. సవిత తోపాటు జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ సెల్కే నచికేత్ విశ్వనాథ్ లు హాజరయ్యారు. వారితో పాటు జిల్లా ప్రజాప్రతినిధులు ప్రభుత్వ విప్ లు, కడప, జమ్మలమడుగు ఎమ్మెల్యేలు సి. ఆదినారాయణ రెడ్డి, ఆర్.మాధవి రెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్త కృష్ణ చైతన్య రెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధి మీన, కడప నగర కమీషనర్ హెచ్.ఎస్. భావన హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా సౌర, వాయు విద్యుత్ వంటి పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో కడప జిల్లాలో భారీ స్థాయిలో సోలార్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు అమలవుతున్నాయని మంత్రి పేర్కొన్నారు.జిల్లాలో సుమారు 4,500 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ విద్యుత్ ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉండగా, ఇప్పటికే 1,100 మెగావాట్లకు పైగా విద్యుత్ ఉత్పత్తి యూనిట్లు గ్రిడ్‌కు అనుసంధానమయ్యాయని



తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రూ.1.07 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు జిల్లాకు రానుండటంతో పాటు వేలాది ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు సృష్టించబడతాయని చెప్పారు.యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రత్యేక స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణలు అందించి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని వివరించారు. ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన అవసరం లేకుండా జిల్లాలోనే అవకాశాలు సృష్టిస్తున్నామని పేర్కొన్నారు.విద్యా రంగంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి తెలిపారు నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచామని, మరుగుదొడ్లు, తాగునీటి వసతులు, తరగతి గదుల ఆధునీకరణ వంటి పనులు చేపట్టామని తెలిపారు.ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.రాష్ట్ర,దేశ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని మంత్రి పిలుపునిచ్చారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం లో దేశం అన్ని రంగాల్లో పురోగమిస్తోందని,మహిళా సాధికారత,యువత అభ్యున్నతి, రైతుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు అవుతున్నాయని పేర్కొన్నారు.అభివృద్ధి ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికీ చేరేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా జిల్లాలో రోడ్లు, రైల్వే కనెక్టివిటీ విస్తరణకు ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి వెల్లడించారు. సుమారు 500 కిలోమీటర్లకు పైగా రహదారి అభివృద్ధి పనులు కొనసాగుతుండగా, వాటి కోసం రూ.18 వేల కోట్లకు పైగా వ్యయం ప్రతిపాదించబడిందని చెప్పారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే కడప నుంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి ప్రధాన నగరాలకు ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుందని పేర్కొన్నారు. పండుగలు,సంప్రదాయాలు భారతీయ సంస్కృతికి ప్రతీకలని మంత్రి సవిత అన్నారు.మన పెద్దలు అందించిన విలువలు, ఆచారాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పండుగలు ప్రజల్లో ఐక్యత, సామరస్యాన్ని పెంపొందిస్తాయని, యువత సంస్కృతి పరిరక్షణలో ముందుండాలని పిలుపునిచ్చారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తూ కడప జిల్లాను రాష్ట్రంలోనే ప్రముఖ పెట్టుబడుల గమ్యస్థానంగా, పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ప్రజల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, చివరికి నిజాయితీ, పారదర్శకత, అభివృద్ధే విజయం సాధిస్తాయని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పలు రాష్ట్ర అభివృద్ధి కార్పొరేషన్లకు చెందిన జిల్లా నాయకులు, వివిధ సంక్షేమ శాఖల అధికారులు పలువురు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, ఎన్డీఏ కూటమి నాయకులు తదితరులుహాజరయ్యారు.

## ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను కళాకారులు ప్రజలకు చేరవేసే సారధులు కావాలి

**- : జూపల్లి కృష్ణారావు**

హైదరాబాద్ జూన్ 2026, విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ. విశ్వనాథ్) : సామాజిక రుగ్మతలపై ప్రజలలో చైతన్యం కల్పించే విధంగా, అవగాహనతో కూడిన సందేశాత్మక కళారూపాలు ఉండాలని, రూపొందించాలని, ఆవిధంగా సాంస్కృతిక సారథి కళాకారులు ప్రదర్శనలు ఇస్తూ ప్రజలలో మంచి మార్పుకు కృషి చెయ్యాలని రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. తెలంగాణ ప్రభుత్వ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలపై తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో 33 జిల్లాల కళాకారులతో ఒక్కరోజు అవగాహన కార్యక్రమం రవీంద్రభారతి మినీ హాల్ లో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లా డుతూ, ఉమ్మడి రాష్ట్రంలో 18 మంది ముఖ్యమంత్రులు 65 వేల కోట్లు అప్పులు చేస్తే, పది సంవత్సరాల కెసిఆర్ ప్రభుత్వ హాయంలో 8 లక్షల కోట్లు అప్పు చేశారని విమర్శించారు. సోషల్ మీడియాలో వస్తున్న కథనాలు ప్రజల ఆలోచనా విధానాన్ని మళ్లిస్తూ తప్పుడు కథనాలు ప్రసారమవుతున్నాయని తెలుపుతూ, ప్రజలకు వాస్తవాలతో కూడిన పాటలు, మాటల ద్వారా కళాకారులు ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాలపై అవగాహన కల్పించాలన్నారు. కళాకారులకు ప్రభుత్వం ఎంత చేసినా తక్కువేనని, ఇంకా కళాకారుల అభివృద్ధికి చేయాల్సింది చాలా ఉందని మంత్రి పేర్కొన్నారు. భాష సాంస్కృతిక శాఖ ముద్రించిన కళాకారుల గుర్తింపు కార్డులను తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్పర్సన్ డాక్టర్. జి.వి వెన్నెల, బాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ ఏనుగు నరసింహా రెడ్డి తో కలిసి మంత్రి కళాకారులకు



అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కోణంలో కాకుండా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తుందని స్పష్టం చేశారు. ఈ అవగాహన సదస్సు, శిక్షణ శిబిరాలు కళాకారులలో నైపుణ్యాన్ని పెంచి ఆత్మస్థైర్యాన్ని పెంచుతుందని సాంస్కృతిక సారథి చైర్పర్సన్ డాక్టర్. జి.వి వెన్నెల అన్నారు. భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ, పాఠశాల, కళాశాలలో ప్రభుత్వం అందిస్తున్న అల్పాహారం, మధ్యాహ్న భోజనం పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కళాకారులను ఆదేశించారు. ఎస్టి కార్పొరేషన్ చైర్మన్ బెల్లం నాయక్ ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు అనే అంశంపై కళాకారులకు అవగా హన కల్పించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రొఫెసర్ రియాజ్ కళలు కళాకారులు అనే అంశంపై మాట్లాడా రు. రెండున్నర ఏళ్ళ ప్రజా పాలన అభివృద్ధిపై భాషా సాంస్కృతిక శాఖ సలహా మండలి సభ్యులు దినకర్ మాట్లాడా రు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్. పి. విజయ్ కుమార్, సాంస్కృతిక సారధి రచయితలు అభినయ్ శ్రీనివాస్, ఎస్ పాల్, కోదారి శ్రీనివాస్, అంబటి వెంకన్న, బోడ చంద్రప్రకాష్, వేముల పుష్ప సాంస్కృతిక కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సుమధురంగా సాగిన "మ్యూజికల్ మెలోడీస్ ఆఫ్ మాస్ట్రోస్ "

హైదరాబాద్ జూన్ 2026 విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ విశ్వనాథ్) : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో ప్రముఖ ఈవెంట్ ఆర్గనైజర్ 'లక్ష్మి శ్రీవాస్తవ్' నేతృత్వంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి "కాయస్త్ గీత్మాల" "మ్యూజికల్ మెలోడీస్ ఆఫ్ మాస్ట్రోస్" హిందీ హిట్స్ పాటల కార్యక్రమం ఆహుతులను ఎంతగానో అలరించింది. బుధవారం సాయంత్రం రవీంద్రభారతి మెయిన్ హాల్ హైదరాబాద్ లో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయనీ గాయకులు మధు కాంత, సీలం రమణ, నందిత జ్యోతి శ్రవణానందకరంగా, సుమధురంగా పాటలు ఆలపించి ప్రేక్షకుల హృదయాలను దోచుకున్నారు. వీరికి లిటిల్ మ్యూజిషియన్స్ అకాడమీ గాయని గాయకులు కోరస్ సహకారం అందించారు. లైవ్ ఆర్కెస్ట్రా తో నిర్వహించిన ఈ "మ్యూజికల్ మెలోడీస్ ఆఫ్ మాస్ట్రోస్" పాటల కార్యక్రమానికి వాయిద్య సహకారం బి.ఎస్ కృష్ణ లీడ్ అలాగే ఎలక్ట్రానిక్ రిథమ్ ప్యాడ్స్, ఎస్,కె చిన్న ఎలక్ట్రానిక్ కీబోర్డ్, సాయి ఎలక్ట్రానిక్ కీబోర్డ్, పవన్



ఎలక్ట్రానిక్ కీబోర్డ్,రవి శంకర్ వేణువు పైన,టిమ్మీ శ్రీనివాస్ గిటార్ పై, జెపాల్ రాజ్ తబలా-ధోలక్ పై, జోగా రావు తబ్లా-ధోలక్ పైన పి.ఎ. స్వామి ఎలక్ట్రానిక్ రిథమ్ ప్యాడ్స్, సాయి రామ్ జాజ్ డ్రమ్, మోహన్ ధోల్-డుఫ్లీ పైన అద్భుతంగా అందించారు. ఈ సినీ సంగీత విభావరి కార్యక్రమానికి అనితా సెహగల్ చక్కటి వ్యాఖ్యానాన్ని అందించారు.ఈ కార్యక్రమంలో సంగీత ప్రియులు, శ్రేయోభిలాషులు, బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమ నిర్వాహకురాలు ఆర్గనైజర్ 'లక్ష్మీ శ్రీవాస్తవ్' ను బృందాన్ని అభినందించి తమ శుభాకాంక్షలు తెలిపారు.

## తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళనాని విజయవంతం చేయండి:బోరెల్లి సురేష్

హైదరాబాదు జూన్ 18 (విజన్ ఆంధ్ర) : జూన్ 21న ఇందిరా పార్క్ హైదరాబాదులో నిర్వహించే తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని లిబిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బోరెల్లి సురేష్లి పిలుపునిచ్చారు ఈరోజు ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ఆవరణంలో లిబిఎస్ఎఫ్ ఓయు అధ్యక్షులు కల్వకుర్తి శ్రీశైలం ఆధ్వర్యంలోలి తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళన గోడపత్రిక విడుదల కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి లిముఖ్య అతిథులుగా విచ్చేసిన బి ఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బోరెల్లి సురేష్లి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులు ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి గారి ఆధ్వర్యంలో చేపట్టిన తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారులకు రావలసిన గుర్తింపు రాలేదని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలు భాగంగా 250 గజాల ఇంటి స్థలం ఉద్యమకారులకు గుర్తింపు కార్డు అదేవిధంగా పెన్షన్ వెంటనే ప్రజా ప్రభుత్వం అమలు చేసి ఉద్యమకారులకు న్యాయం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. 250 గజాల స్థలం మరియు ఇతర డిమాండ్లను పూర్తి చేయాలని జూన్ 21న ఆదివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి ఇందిరా పార్కులో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ



కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులు వేలాదిగా తరలివచ్చి తమకు దక్కవలసిన ప్రభుత్వ పలాల గురించి గళం విప్పాలని విజ్ఞప్తి చేశారు. రానున్న రోజుల్లో డాక్టర్ పిడమర్తి రవి గారి ఆదేశాలతో రాష్ట్ర వ్యాప్తంగా బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉద్యమకారుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో ఉద్యమకారులకు సముచిత స్థానం లేకపోవడం బాధాకరం అని అన్నారు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులను ప్రజా ప్రభుత్వంలో భాగస్వామ్యం చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎఫ్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మొగిలిగిద్ద ప్రసాద్, తెలంగాణ ఉద్యమకారుల సంఘం సైఫాబాద్ సైన్స్ కాలేజ్ అధ్యక్షులు గణేష్, దీూఖీ ఓయూ ఉపాధ్యక్షులు ఆరెకంటి శ్రీకాంత్, శ్రీనివాస్, సందీప్, రాజేందర్, ఓంకార్, ప్రసిద్ధి కృష్ణ, రాజు ముదిరాజ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల జాబితా ప్రత్యేక సవరణకు సన్నద్ధం కావాలి

**- కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు.**

ములుగు జూన్ 18; విజన్ ఆంధ్ర ప్రతినిధి : ఎన్నికల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమానికి అధికారులు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని, లిస్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్)లి నిర్వహణలో లిబూత్ లెవల్ ఆఫీసర్లు (బి.ఎల్.ఓ), బూత్ లెవల్ ఏజెంట్ల (బి.ఎల్.ఏ) పాత్ర కీలకంగా ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. గురువారం ఎస్.ఐ.ఆర్ నిర్వహణ, బి.ఎల్.ఓలు, బి.ఎల్.ఏల శిక్షణ తరగతుల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ములుగు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో చేపట్టనున్న ఎస్.ఐ.ఆర్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు బూత్ లెవల్ ఆఫీసర్లు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైనదని, ప్రతి ఓటరుకు సరైన నమోదు, మార్పులు, సవరణలు ఖచ్చితంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత బి.ఎల్.ఓలపై ఉందన్నారు. కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి తొలగింపు, చిరునామా మార్పులు, డూప్లికేట్ ఓట్ల గుర్తింపులో నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. శిక్షణ తరగతులను పకడ్బందీగా నిర్వహించాలని, ఎస్.ఐ.ఆర్ మార్గదర్శకాలపై బి.ఎల్.ఓలు, బి.ఎల్.ఏలకు పూర్తి అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్వచ్ఛమైన, దోషరహిత ఓటరు జాబితా రూపకల్పనకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పని చేయాలని కలెక్టర్ కోరారు. ఈ టెలికాన్ఫరెన్స్లో జిల్లా రెవెన్యూ అధికారి, ఎన్నికల విభాగం అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

## ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు జోయాలుక్కాస్ స్కూల్ బ్యాగుల పంపిణీ.

కాప్రా/జూన్ 18(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : :విద్యార్థుల విద్యావసరాలకు తోడ్పాటునందిస్తూ జోయాలుక్కాస్ హాబ్సిగూడ బ్రాంచ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (వీూరూ) విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. పాఠశాలలోని 1వ తరగతి నుండి 4వ తరగతి వరకు చదువుతున్న




100 మంది విద్యార్థులకు ఈ బ్యాగులను అందజేశారు. విద్యార్థులకు ఉపయోగపడేలా ప్రతి బ్యాగులో ఒక గొడుగు, వాటర్ బాటిల్, లంచ్ బాక్స్ మరియు పెన్సిల్ బాక్స్ వంటి వస్తువులను ఉంచారు. ఈ కార్యక్రమంలో హాబ్సిగూడ మాజీ కార్పొరేటర్ చైతన్య మేడం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ ఎస్. విజయ్ కుమార్, జెడ్పీహెచ్ఎస్ హాబ్సిగూడ ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి ఉపేంద్ర ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విద్యార్థులకు బ్యాగులను అందజేసిన అనంతరం వారు మాట్లాడుతూ.. కార్పొరేట్ సంస్థలు ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఆదుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎం. సుజాత, ఎ. కల్యాణి, చ. అనిత, కె. శ్రీదేవి మరియు కుమారి తదితరులు పాల్గొన్నారు.

## గణపసముద్రం రిజర్వాయర్ భూసేకరణ రైతుల ప్రయోజనాలే లక్ష్యం

**- కలెక్టర్ ఆదర్శ్ సురభి**

వనపర్తి జిల్లా ప్రతినిధి జూన్ 18 (విజన్ ఆంధ్ర) : గణపసముద్రం రిజర్వాయర్ భూ సేకరణకు సంబంధించి రైతుల అభిప్రాయాలను తెలుసుకోవడం కోసమే జిల్లా స్థాయి చర్చల కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నామని, రైతుల విన్నపాలను ప్రభుత్వానికి నివేదిస్తామని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. గురువారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో గణపసముద్రం రిజర్వాయర్ భూ సేకరణ అంశంపై సంబంధిత గ్రామ రైతులతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి చర్చల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రిజర్వాయర్ పరిధిలోని 164 ఎకరాల భూముల రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు భూ సేకరణ అంశానికి సంబంధించి తమ అభిప్రాయాలను అధికారుల ముందు వెల్లడించారు. గణప సముద్రం రిజర్వాయర్ నిర్మాణంలో సేకరించనున్న 164 ఎకరాలకు సంబంధించి భూములు చాలా విలువైనవని, ఈ భూములు తమ గ్రామ రైతులకు ఎంతో ముఖ్యమని, విలువైన పంటలు పండుతాయని తమ గోడును ప్రభుత్వం అర్థం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం



ఈ భూములపై పూర్తిస్థాయిలో స్టడీ చేసి పరిహారం విషయంలో రైతులకు న్యాయబద్ధమైన నిర్ణయం తీసుకోవాలన్నారు. తామంతా కేవలం వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తున్నామని, భూములు కోల్పోతే తమకు ఉపాధి కోల్పోయి రోడ్డున పడతామని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పంటలు పండక వలసలు వెళ్లిన పరిస్థితులు ఉండేవని, ఇప్పుడు కొంత నీటి సౌకర్యం ఏర్పడి పంటలు బాగా పండుతున్నాయని, ఈ సమయంలో భూసేకరణ పేరుతో తమకు అన్యాయం చేయవద్దని కోరారు. ప్రభుత్వం తమకు ఎకరానికి ప్రభుత్వం నిర్దేశించిన విధంగా రూ.12.50 లక్షలు కాకుండా, పెద్ద మొత్తంలో నష్టపరిహారం ఇవ్వాలని విన్నవించారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గణపసముద్రం రిజర్వాయర్ భూ సేకరణలో భాగంగా భూములు కోల్పోనున్న రైతుల అభిప్రాయ సేకరణ కోసమే ఈ జిల్లాస్థాయి చర్చల కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ఆయా ప్రాంతాల్లో మార్కెట్ రేట్ల కు అనుగుణంగా ధరను నిర్ణయిస్తుందని తెలిపారు. రైతులు ఎవరూ కంగారు పడవద్దని, రైతులకు న్యాయం చేసేందుకే ప్రభుత్వం తరఫున తాము ఎప్పుడు ప్రయత్నిస్తామని తెలిపారు. సాటిల్ బండ్ విషయంలో సీఈ ల కమిటీ ఇచ్చిన నివేదికను పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం ఎంత ఇవ్వవచ్చు అనేది త్వరలోనే నిర్ణయించడం జరుగుతుందని తెలిపారు. త్వరలోనే గ్రామానికి అధికారులు వచ్చి పరిహారం గురించి చెప్పడం జరుగుతుందని తెలియజేశారు. రైతుల విన్నపాన్ని ప్రభుత్వానికి నివేదించి న్యాయం చేసే దిశగా అడుగులు వేస్తామని తెలియజేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిరుపతయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, నాయకులు సాయి చరణ్ రెడ్డి, సర్పంచి, నీటిపారుదల శాఖ సూపరింటెంట్ ఇంజనీర్, డివిజనల్ ఇంజనీర్, ఇతర రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ స్కూళ్లలో ఫీజు పుస్తకాల దోపిడిని ఆపాలని యాదాద్రి జిల్లా DEO గారికి వినతి పత్రం

**- పల్లగొర్ల మోదీరాందేవ్**

యాదాద్రి భువనగిరి జూన్ 18 (విజన్ ఆంధ్ర) : జిల్లాలో ప్రవేట్ స్కూల్లు ఇష్టరాజ్యాంగ ఫీజు పుస్తకాల దోపిడిపై , కఠిన చర్యలు తీసుకొవాలని లియాదాద్రి జిల్లా డీఈవో బిక్షపతి గారికి వినతిపత్రం ఇచ్చి వారిని సన్మానించారు బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్,సామాజిక కార్యకర్త నిమ్మల వీరన్నలి వారు మాట్లాడుతూ ఫీజు పుస్తకాల దోపిడి చేస్తున్న ప్రైవేట్ స్కూల్ లపై కఠిన చర్యలు తీసుకోవాలని అలాగే శానిటైజేషన్, బిల్డింగ్ సేఫ్టీ, టెట్ అర్హత,ఫైర్ సేఫ్టీ, బస్సుల ఫిట్నెస్, అధిక ఫీజులు, టీసీ విషయంలో వేధింపులు చేస్తున్న ప్రైవేట్ స్కూళ్లను గుర్తించి స్కూలు సీజ్ చేసి యజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి

1 ప్రైవేట్ స్కూళ్లలో పుస్తకాలు అమ్మడం పూర్తిగా నిషేధించాలి. ఎక్కడైనా పుస్తకాలు అమ్ముతున్నట్లు తెలిస్తే, ఆ స్కూళ్లను తక్షణమే సీజ్ చేయాలి.

2 అధిక ఫీజులు వసూలు చేస్తూ, విద్యార్థుల రక్తం



తాగుతున్న ప్రైవేట్ స్కూళ్లను గుర్తించి, వాటిని సీజ్ చేయాలి.

3 సరైన గుర్తింపు అనుమతులు లేని ప్రైవేట్ స్కూళ్లను మూసివేయాలి.

శానిటైజర్ మరియు బిల్డింగ్ సేఫ్టీ సర్టిఫికెట్లు లేని స్కూళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

4 టెట్ అర్హత లేని ఉపాధ్యాయులను తొలగించాలి.

ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు పాటించని స్కూళ్లపై యాక్షన్ తీసుకోవాలి.

5 ఫిట్నెస్ లేని స్కూల్ బస్సుల రిజిస్ట్రేషన్ రద్దు చేయాలి. యజమాన్యం పై కఠిన చర్యలు తీసుకోవాలి ప్రైవేట్ స్కూల్ నుండి గవర్నమెంట్ స్కూల్ కి వస్తున్న విద్యార్థులను టీసీ విషయంలో వేధిస్తున్న స్కూళ్లను గుర్తించి, యజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి.

బుక్ ఫీజ్ అని బడి ఫీజు అని బస్సు ఫీజు అని ట్యూషన్ ఫీజ్ అని డొనేషన్ ఫీజ్ అని ప్రైవేట్ విద్యాసంస్థలు దోచుకుంటున్నారు స్కూల్లో ఎలాంటివి అమ్మొద్దని గైడెన్స్ ఉన్న అవి పెడచెవిన పెట్టి సొమ్ము చేసుకుంటున్నారు 2005 ఫీజు నియంత్రం చట్ట అమలులో ఉన్న అవన్నీ పట్టించుకోకుండా విద్యార్థుల రక్తం తాగుతున్నారు అలాంటి ప్రైవేట్ విద్యాసంస్థలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని,, విద్యాశాఖ మంత్రిని నియమించి ప్రభుత్వ స్కూల్లో మెరుగైన వసతులు కల్పించాలని ప్రభుత్వం వెంటనే ఫీజు నియంత్రణ చట్టం అమలు తీసుకొచ్చి పేద విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు లిఈ సమావేశంలో బీసీ విద్యార్థి సంఘ రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్ సామాజివేత్త నిమ్మల వీరన్న, ఎడ్ల మహాలింగం, ధరావత్ గిరిధర్ , సందీప్,రాకేష్, అజయ్,అఖిల్, యుగంధర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు

## ట్రాఫిక్ సమస్య పరిష్కారానికై రోడ్డు విస్తరణ కై తీసుకోవలసిన చర్యలపై అధికారులతో కలిసి పాదయాత్ర చేసిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

శేరిలింగంపల్లి. జూన్ 18: (విజన్ ఆంధ్ర) : కొండాపూర్ డివిజన్ పరిధిలోని అంజయ్యనగర్లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికై నూతనంగా చేపట్టబోయే హెచ్-సిటీ ప్రాజెక్ట్ ప్రాంతాన్ని సీ .ఎం. సి . కమిషనర్ సృజన డీసీ బాలకృష్ణ చీఫ్ సిటీ ప్లానర్ వెంకన్న సిటీ ప్లానర్ తులసి రామ్ శైలజ , ఏసిపి సురేందర్ రెడ్డి , సిఎంసి ఇంజనీరింగ్ విభాగం మరియు టౌన్ ప్లానింగ్ విభాగం అధికారుల తో కలిసి పరిశీలించిన పీఏసీ చైర్మన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ కొండాపూర్ అంజయ్య నగర్ పరిసర ప్రాంతంలో ప్రజలు నిత్యం ట్రాఫిక్ తో సతమవుతున్నారు అని ట్రాఫిక్ సమస్య





పరిష్కారాని కై నూతనంగా ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టడం జరుగుతుంది అని, ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ పురోగతిని సమీక్షించి , రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన ప్రారంభించేందుకు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ప్రతిపాదిత రోడ్డు విస్తరణ ద్వారా కొండాపూర్ మెయిన్ రోడ్డుపై ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు వాహనదారులకు మెరుగైన రాకపోకల సౌకర్యం కలగనుంది అని .పనుల అమలులో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, ప్రాజెక్టును నిర్ణీత గడువులో పూర్తి చేసేలా అవసరమైన చర్యలు చేపట్టాలని నిత్యం ట్రాఫిక్ సమస్య తో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారుఅని,ట్రాఫిక్ సమస్య పరిష్కారానికై రోడ్డు విస్తరణ కై తీసుకోవాల్సిన చర్యల పై అధికారులతో కలిసి పాదయాత్ర గా స్వయంగా నడుచుకుంటూ వెళ్లడం జరిగినదిఅని, సాఫ్ట్ వెర్ ఉద్యోగులు,పాఠశాలలకు, కళశాలలకు వెళ్లే విద్యార్థులకు, ఉద్యోగులకు, వ్యాపారస్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని, వాహన దారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని , రోడ్డు ఆక్రమణ ల పై ఉక్కుపాదం తో తొలగిస్తామని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తామని, ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన పనులు పై అధికారులకు పలు సూచనలు, సలహాలు తెలియచేయడం జరిగినది. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అదేవిధంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ,అన్నివేళలో ప్రజలకు అందుబాటులోకి ఉంటానని ,మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని ,నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని తెలిపారు

## నేరాల నియంత్రణ, బాధితులకు సత్వర న్యాయం అందించడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యం

**- సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేశ్ ఐపీఎస్ ఆధ్వర్యంలో నేర సమీక్ష సమావేశం**

**- పెండింగ్ కేసుల పరిష్కారం, ట్రాఫిక్ నిర్వహణ, మహిళలు-చిన్నారుల భద్రత, సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి**

శేరిలింగంపల్లి.జూన్ 18: (విజన్ ఆంధ్ర) : సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, పెండింగ్ కేసుల త్వరితగతిన పరిష్కారం, కోర్టు వ్యవహారాల పురోగతి మరియు ప్రజా భద్రతకు సంబంధించిన అంశాలపై సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేశ్, ఐపీఎస్., అధ్యక్షతన సైబరాబాద్ సీపీ ఆఫీసులోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్ లో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కమిషనరేట్ పరిధిలోని జోనల్ డీసీపీలు, అదనపు డీసీపీలు, క్రైమ్ విభాగాల అధికారులు హాజరయ్యారు. సమావేశంలో పెండింగ్లో ఉన్న క్రిమినల్ కేసులు, కోర్టు కేసులు, పీటీ కేసులు, ఈఓడబ్ల్యూ కేసులు, యూఐ కేసులు, కిడ్నాప్ కేసులు, సైబర్ క్రైమ్ కేసులు, పోక్సో, అత్యాచారం, హత్య కేసులు మరియు ఇప్పటివరకు ఛేదించని గ్రేవ్ కేసుల దర్యాప్తు పురోగతిని సీపీ సమీక్షించారు. తీవ్రమైన నేరాల దర్యాప్తులో వేగం పెంచి, నిందితులను గుర్తించి చట్టం ముందు నిలబెట్టేందుకు అన్ని వనరులను



వినియోగించాలని అధికారులను ఆదేశించారు. మహిళల భద్రత, చిన్నారుల రక్షణకు సంబంధించిన కేసులను అత్యంత ప్రాధాన్యంతో విచారించాలని, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే జీరో ఎఫ్ఐఆర్ కేసుల నమోదు, ఇతర పోలీస్ స్టేషన్ల నుంచి వచ్చిన మరియు బదిలీ చేసిన కేసుల వివరాలను సమీక్షించి, బాధితులకు తక్షణ సేవలు అందేలా చూడాలని పేర్కొన్నారు. డయల్-100 కాల్స్కు స్పందన, ఫుట్ పెట్రోలింగ్, క్షేత్రస్థాయి పోలీసింగ్, సీడీవోల విధుల నిర్వహణ, నేర నియంత్రణలో కన్విక్షన్ రేటు పెంపు అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు. కేసుల దర్యాప్తు నాణ్యతను మెరుగుపరచి, కోర్టుల్లో శిక్షలు పడే శాతాన్ని పెంచేందుకు పటిష్టమైన సాక్ష్యాధారాలు సమర్పించాలని సూచించారు. సీసీటీఎన్ఎస్ డేటా అప్డేషన్, ఆన్-సైట్ ఎఫ్ఐఆర్ విధానం అమలు, సైబర్ నేరాల దర్యాప్తు, ఆర్థిక నేరాల విచారణ మరియు డిజిటల్ రికార్డుల నిర్వహణపై కూడా సమీక్ష నిర్వహించారు. ప్రతి కేసుకు సంబంధించిన సమాచారాన్ని సకాలంలో అప్డేట్ చేయాలని అధికారులకు ఆదేశించారు. అదేవిధంగా డ్రగ్స్ నిర్మూలన చర్యలు, కార్మిక శిబిరాల (లేబర్ క్యాంప్స్) పరిస్థితులు, పెండింగ్ నాన్-బెయిలబుల్ వారెంట్ల అమలు, లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారం తదితర అంశాలపై కూడా సమావేశంలో చర్చించారు. ట్రాఫిక్ నిర్వహణకు సంబంధించి ఐటీ కారిడార్, ప్రధాన జంక్షన్లు, రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు చేపడుతున్న చర్యలను సమీక్షించారు. సమావేశం ముగింపులో సీపీ డా. ఎం. రమేశ్ మాట్లాడుతూ, "ప్రజల భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, నేరాల నియంత్రణ మరియు బాధితులకు సత్వర న్యాయం అందించడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యం. ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేస్తూ పెండింగ్ కేసుల పరిష్కారం, మహిళలు మరియు చిన్నారుల భద్రత, సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి" అని సూచించారు. ఈ సమావేశం లో సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్, ఐపీఎస్., అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, ఐపీఎస్., కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి, ఐపీఎస్., కూకట్పల్లి డీసీపీ రితిరాజ్, ఐపీఎస్., శేరిలింగంపల్లి డీసీపీ సి. హెచ్. శ్రీనివాస్, ఐపీఎస్., ట్రాఫిక్ డీసీపీ శేషాద్రిని రెడ్డి, ఐపీఎస్., డీసీపీ క్రైమ్స్ ముత్యం రెడ్డి, డీసీపీ స్పెషల్ బ్రాంచ్ వై.వి.ఎస్. సుధీంద్ర, డబ్ల్యు అండ్ సీఎస్డబ్ల్యూ డీసీపీ సృజన కరణం, సైబర్ క్రైమ్స్ డీసీపీ టి. సాయి మనోహర్, ఎస్ఓటీ డీసీపీ శోభన్ కుమార్, సైబరాబాద్ సీఏఆర్ హెడ్క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, ఏడీసీపీలు, ఏసీపీలు, ఎస్ హెచ్ ఓ లు తదితరులు పాల్గొన్నారు.

## 29వ ఉచిత మెగా కంటి వైద్య శిబిరశీ.

ములుగు జూన్ 18, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా నాయకులు భూక్య జంపన్న కార్యాలయంలో బుధవారం నిర్వహించిన 29వ ఉచిత మెగా కంటి వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. జిల్లాలోని వివిధ మండలాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. వైద్య నిపుణుల బృందం బాధితులకు పరీక్షలు నిర్వహించి, శుక్లాలు, కంటి చూపు సమస్యలు ఉన్నవారిని గుర్తించింది. కంటి ఆపరేషన్ అవసరమైన వారిని ఉచిత శస్త్ర చికిత్సల కోసం హైదరాబాద్లోని శంకర కంటి ఆసుపత్రికి ప్రత్యేక బస్సుల్లో తరలించారు.



గత రెండున్నర సంవత్సరాలుగా జిల్లాలోని అన్ని మండలాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో కంటి సమస్యలతో బాధపడుతున్న వృద్ధులు, నిరుపేదలకు భూక్య జంపన్న స్వంత నిధులతో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించడంతో పాటు రవాణా, వైద్య ఖర్చుల భారం తగ్గించే విధంగా సహకారం అందిస్తున్నారు. గతంలో ప్రభుత్వం చేపట్టిన లి"కంటికి వెలుగు" పథకం స్ఫూర్తితోలి ప్రస్తుతం సొంత ఖర్చులతోనే ఈ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుంచి వైద్య శిబిరాలు, విద్యార్థులకు ఆర్థిక సాయం, ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నారని స్థానికులు తెలిపారు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువవుతున్న భూక్య జంపన్నను శిబిరానికి హాజరైన ప్రజలు అభినందించారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని కోరారు.

# రైతులకు నాణ్యమైన సేవలందించాలి

- రైతు సంక్షేమానికి ఐకేపీ రైతు సేవా కేంద్రాలు కీలకం
- లైసెన్సులను స్పష్టంగా ప్రదర్శించాలి
- ప్రారంభించిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



జనగామ, జూన్18(విజన్ ఆంధ్ర): రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉండేలా ఐకేపీ రైతు సేవా కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు.గురువారం, జనగామ మండలంలోని మరిగడి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐకేపీ రైతు సేవా కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించి, కేంద్రంలోని సౌకర్యాలు, నిర్వహణ విధానాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఐకేపీ రైతు సేవా కేంద్రంలో విక్రయించే ఎరువులు, విత్తనాలు, పురుగుమందులకు సంబంధించిన లైసెన్సులను దుకాణంలో స్పష్టంగా కనిపించే విధంగా భద్రంగా ప్రదర్శించాలని ఆదేశించారు. రైతులు కొనుగోలు చేసే వ్యవసాయ ఇన్‌పుట్‌లపై పూర్తి సమాచారం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.రైతులకు ఎలాంటి నష్టాలు కలగకుండా నాణ్యమైన విత్తనాలు, ప్రమాణాలకు అనుగుణమైన ఎరువులు, పురుగుమందులను మాత్రమే విక్రయించాలని పేర్కొన్నారు. నకిలీ (లేదా) నాసిరకం ఉత్పత్తులకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రైతుల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా సేవలు అందించాలన్నారు. అనంతరం కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈ-పాస్ యంత్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. రైతులకు విక్రయాల నమోదు, బిల్లుల జారీ, స్టాక్ నిర్వహణ వంటి అంశాలను పరిశీలించి, సంబంధిత నిర్వాహకులకు సూచనలు చేశారు.అలాగే బిల్లు బుక్కులను పరిశీలించి, ప్రతి లావాదేవీకి తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని, పారదర్శకతతో వ్యవహరించాలని ఆదేశించారు.రైతు సేవా కేంద్రాన్ని క్రమబద్ధంగా, సమర్థవంతంగా నడిపిస్తే ప్రతి నెల రూ. 20 వేల నుంచి రూ. 30 వేల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందని తెలిపారు. వ్యవసాయ రంగ అభివృద్ధిలో రైతు సేవా కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, రైతులకు నాణ్యమైన సేవలు అందించడం ద్వారా వ్యవసాయ ఉత్పాదకత పెంపునకు తోడ్పడాలని కలెక్టర్ సూచించారు.రైతు సేవా కేంద్రాలు రైతులకు విశ్వసనీయ సేవా కేంద్రాలుగా ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఏపీడీ నూరుద్దీన్, ఇతర సంబంధిత అధికారులు, రైతు సేవా కేంద్రాల మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# వన మహోత్సవానికి ప్రణాళికలు సిద్ధం చేయాలి

- ప్రజల్లో మొక్కల సంరక్షణపై అవగాహన పెంచాలి
- పెద్దాపూర్ నర్సరీని పరిశీలించిన
జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్,



నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): కల్వకుర్తి నియోజకవర్గంలోని వెల్దండ మండల పరిధిలోని పెద్దాపూర్, వెల్దండ గ్రామాలలో కలెక్టర్ విస్తృతంగా పర్యటించి గ్రామాభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించి, ప్రజలకు అందుతున్న సేవలపై అధికారులతో చర్చించారు.కల్వకుర్తి నియోజకవర్గంలోని వెల్దండ మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న నర్సరీని సందర్శించిన కలెక్టర్ అక్కడ మొక్కల పెంపకం, సంరక్షణ, నిర్వహణ విధానాలను పరిశీలించారు. నర్సరీలో పెంచుతున్న వివిధ రకాల మొక్కల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొక్కల నాణ్యత, నీటి వసతి, సంరక్షణ చర్యలు, వాటి పంపిణీ విధానాలపై ప్రత్యేకంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. గ్రామాల్లో పచ్చదనం పెంపొందించడంలో నర్సరీల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామాల అందాన్ని పెంచడంలో మొక్కల పెంపకం ముఖ్యమని చెప్పారు. అందువల్ల నాణ్యమైన మొక్కల ఉత్పత్తి, వాటి సంరక్షణ, సరైన సమయంలో పంపిణీ వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నర్సరీలో ప్రస్తుతం సుమారు 3,500 మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్, త్వరలో నిర్వహించనున్న వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఇప్పటి నుంచే సమగ్ర ప్రణాళికలురూపొందించాలని ఆదేశించారు. గ్రామాల్లో విస్తృత స్థాయిలో మొక్కల నాటకం చేపట్టి, ప్రతి గ్రామాన్ని పచ్చదనంతో కళకళలాడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా గ్రామపంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రజలు నాటిన మొక్కలు జీవించేలా వాటి సంరక్షణపై ప్రత్యేక అవగాహన కల్పించాలని తెలిపారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని పరిరక్షించడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కలెక్టర్ సూచనల మేరకు గ్రామాల్లో అభివృద్ధి పనులు, పచ్చదనం కార్యక్రమాలు మరింత వేగవంతంగా అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి, కల్వకుర్తి మార్కెట్ డైరెక్టర్ కృష్ణ,వెల్దండ తహసీల్దార్ కార్తీక్ కుమార్, ఎంపీడీవో కృష్ణయ్య, ఎంఈవో చంద్రుడు నాయక్, వెల్దండ సర్పంచ్ యాదమ్మ వెంకటయ్య గౌడ్, పెద్దాపూర్ సర్పంచ్ కేశమల్ల అనూష, వివిధ శాఖల అధికారులు, మండల స్థాయి అధికారులు, ఆయా గ్రామాల గ్రామపంచాయతీ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రైవేటు స్కూల్స్ లో అధిక ఫీజు లను నియంత్రణ చేయాలి..

- విద్యా హక్కు చట్టం -2009 ని అమలు చేయాలి..
- టీఆర్ పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్య యాదవ్..



సూర్యాపేట జూన్ 18:(విజన్ ఆంధ్ర) : ప్రైవేట్ స్కూళ్లలో ఫీజులపై నియంత్రం లేదని, ఇష్ట రాజ్యాంగ ఫీజులు వసూలు చేస్తున్నారని, ఫీజులు కట్టలేక చాలామంది మధ్యతరగతి తల్లిదండ్రులు తమ పిల్లల్ని చదివించలేని పరిస్థితి ఏర్పడిందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్య యాదవ్ అన్నారు.గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సూర్యాపేటలో విద్యావ్యవస్థ పూర్తిగా వ్యాపారంగా మారిందని, చాలా పాఠశాలలో అడ్డగోలుగా ఫీజు వసూలు చేస్తున్నారని అన్నారు. కొన్ని పాఠశాలలో మధ్యతరగతి వారు తమ పిల్లలను చదివించలేని పరిస్థితి ఏర్పడిందని ఆయన చెప్పారు. జిల్లా లోని పాఠశాలలో విద్యాహక్కు చట్టం 2009 ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టాన్ని జిల్లాలో కచ్చితంగా అమలు చేయాలని అందుకోసం తాము పోరాటం చేస్తామని అన్నారు. పేదలకు రాజ్యాంగం కల్పించిన హక్కును జిల్లా యంత్రాంగం అమలు చేయడం లేదని ఆయన అన్నారు. ప్రైవేట్ పాఠశాలలో అధిక ఫీజులతో పాటు పుస్తకాలు ఇంకా యూనిఫాంలు స్టేషనరీ బలవంతంగా అంట కడుతున్నారని, వీటి కోసం పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని వీటి పై జిల్లా యంత్రాంగం ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని ఆయన అన్నారు. ప్రైవేటు స్కూల్స్ లో పేరెంట్స్ కమిటీని పొలిటికల్ కమిటీని ఏర్పాటు చేయాలని ఫీజులపై కచ్చితంగా నియంత్రణ చేయాలని అన్నారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ విద్యార్థి విభాగం ఆధర్యంలో అన్ని పాఠశాలలో తాము ఆందోళన చేస్తామని చెప్పారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన చేయాలని, మరుగుదొడ్లు సౌకర్యం లేక విద్యార్థినులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం చేసి పరిశుభ్రంగా ఉంచడానికి తగిన సిబ్బంది నియమించాలని ఆయన అన్నారు.

# వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరిన జిల్లా కలెక్టర్



సిద్దిపేట జిల్లా ప్రతినిధి18 జూన్ : సిద్దిపేట జిల్లా కేంద్రంలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం రంగారెడ్డి జిల్లాలోని గుర్రంగూడ గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి రాష్ట్రవ్యాప్తంగా 16 కోట్ల మొక్కలను ఈ సంవత్సరంలో నాటాలని టార్గెట్ గా పెట్టుకోవాలని నిర్ణయించడం జరిగిందని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములైవనభోత్సవంకార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని కొండపాక మండలం మర్పడగా తేజోవనం అర్బన్ పార్క్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు, కమిషనర్ ఆఫ్ పోలీస్ సాధన రష్మీ పెరుమాళ్, జిల్లా అటశాఖ అధికారి పద్మజరాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపెల్లి చంద్రం మరియు జిల్లా అధికారులతో కలిసి డిజిటల్ తెరపై వీక్షించిన జిల్లా కలెక్టర్ కే. హేమావతి విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మొక్కలను నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ఎంత దోహదం చేస్తామని, రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు జిల్లాలో నిర్దేశించిన 20 లక్షల మొక్కలను నాటేందుకు అటవీ శాఖ మరియు ఇతరశాఖలసమన్వయంతో నర్సరీలలో మొక్కలను సిద్ధం చేయడం జరిగిందని వాటిని నాటి సంరక్షించే కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా చేపట్టడం జరుగుతుందని అన్నారు. మొక్కలు నాటే ఈ బృహత్తర కార్యక్రమంలో జిల్లా ప్రజలందరూ భాగస్వామ్యమై విజయవంతం చేయాలని కోరారు.

# అమ్మో జూన్ నెల వచ్చేసింది!!

- పిల్లల నవ్వుల వెనుక... తండ్రి జేబుకు పడుతున్న చిల్లులు
- పుస్తకాల సంచీ బరువు కాదు... ఫీజుల రేట్లే మోయలేకపోతున్నాం
- అక్షరాలు నేర్పే చోట... అప్పులు మిగులుస్తున్న 'కమర్షియల్' స్కూల్స్
- యూనిఫాం రేట్లకు చెమటలు... బుక్స్ ధరలకు గుండెలు గుభేల్

*కొత్త బట్టలు,కొత్త పుస్తకాలు పిల్లలకు ఆనందాన్ని ఇస్తే...వాటిని ఖరీదు చేసే తల్లిదండ్రులకు మాత్రం కరెంట్ షాక్ కొట్టినట్లు దడ వస్తుంది.... జూన్ నెల గండంపై "విజన్ ఆంధ్ర" ప్రత్యేక కథనం*






**హైదరాబాద్, జూన్ 18**

క్యాలెండర్‌లో జూన్ నెల రాగానే మధ్యతరగతి ఇళ్లలో టెన్షన్ మొదలవుతుంది. వర్షాల కంటే ముందు ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల మోత పేరెంట్స్‌ను వణకిస్తోంది. కొత్త క్లాసులకి వెళ్తున్నామని పిల్లలు సంబరపడుతుంటే, వాళ్ల బుక్స్ రేట్లు, యూనిఫాం ధరలు చూసి తల్లిదండ్రుల గుండె బరువెక్కుతోంది. ఒకప్పుడు చదువు సంస్కారం... కానీ ఇప్పుడు అదొక పక్కా కమర్షియల్ బిజినెస్!

**ఫీజుల 'షాక్'... బుక్స్ 'రాక్'**

మధ్యతరగతి తండ్రి నెలాఖరు జీతం ఎంత స్పీడ్‌గా అకౌంట్‌లో పడుతుందో... అంతకంటే డబుల్ స్పీడ్‌తో స్కూల్ కౌంటర్లలో కరిగిపోతోంది.

**ఫీజుల బాదుడు**

ట్యూషన్ ఫీజ్, డెవలప్‌మెంట్ ఫీజ్, డిజిటల్ క్లాస్ ఫీజ్... ఇలా పేర్లు ఏవైనా, పేరెంట్స్ జేబుకు చిల్లు పడటం మాత్రం ఖాయం.

**బంగారమాయె పుస్తకాలు**

కేవలం స్కూల్‌లోనే కొనాలనే కండిషన్. బయట వంద రూపాయల్లో దొరికే నోట్‌బుక్, అక్కడ 'బ్రాండెడ్' ముసుగులో వందల రూపాయలు పలుకుతోంది.
యూనిఫాం యూనివర్స్ బట్టల రేట్లు చూస్తే సామాన్యుడికి చెమటలు పడుతున్నాయి. రెండు జతల యూనిఫామ్స్, షూస్ కొంటే ఒక నెల బడ్జెట్ తలకిందులవ్వాల్సిందే.
"నాన్న... నాకు ఈ కలర్ పెన్సిల్ బాక్స్ కావాలి" అని పాప అడిగినప్పుడు, తన అకౌంట్ బ్యాలెన్స్ చూసుకుని కూడా "సరే అమ్మా" అని నవ్వే తండ్రి గుండె కోత ఏ ప్రైవేట్ స్కూల్ మేనేజ్‌మెంట్‌కి అర్థమవుతుంది?
పిల్లల భవిష్యత్తు కోసం తమ ఇష్టాలను, అవసరాలను చంపుకుని... రక్తాన్ని చెమటగా మార్చి ఫీజులు కడుతున్నారు తల్లిదండ్రులు. కార్పొరేట్ స్కూళ్లు మాత్రం 'ర్యాంకుల' బోర్డులు తిరగేస్తూ, అడ్మిషన్ల వేటలో బిజీగా ఉన్నాయి. పేరెంట్స్ ప్రేమని, బాధ్యతని పెట్టుబడిగా మార్చుకుని వేలకు వేలు గుంజడం ఈ రోజుల్లో ఒక ట్రెండ్ అయిపోయింది.

**ప్రభుత్వ నిఘా అవసరం!!**

కార్పొరేట్ సంస్థల ఈ ఇష్టారాజ్యానికి అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత ప్రభుత్వం, విద్యాశాఖపైనే ఉంది.

**ఫీజుల నియంత్రణ**

ప్రతి స్కూల్ వసూలు చేసే ఫీజులపై విద్యాశాఖ కఠినమైన పర్యవేక్షణ జరపాలి.

**దోపిడీకి బ్రేక్**

స్కూల్ ప్రాంగణాల్లోనే బుక్స్, యూనిఫామ్స్ కొనాలనే నిబంధనను పూర్తిగా నిషేధించాలి.

**కఠిన చర్యలు**

రూల్స్ పాటించని కమర్షియల్ స్కూళ్ల గుర్తింపును రద్దు చేయాలి.
చదువు చెప్పడం ఉచిత సేవ కానక్కర్లేదు, కానీ మరీ ఇంత దోపిడీ అవసరమా? "మా బ్రాండ్ ఇంతే... చదివిస్తే చదివించండి" అనే మోడర్న్ ఆటిట్యూడ్ మారాలి. అప్పుడే ఏ తండ్రీ అప్పులపాలు కాకుండా, ఏ తల్లీ కన్నీళ్లు పెట్టుకోకుండా తమ పిల్లల్ని హ్యాపీగా స్కూల్‌కి పంపించగలరు.

**- గడ్డం సంతోష్ రాజ్**
స్పెషల్ కరస్పాండెంట్ (విజన్ ఆంధ్ర)

# యూరియా బుకింగ్ యాప్ ప్రారంభం

- రైతులు నేరుగా యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకునే అవకాశం,
- యూరియా పంపిణీలో పారదర్శకత, సులభతర సేవలే లక్ష్యం,
- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి,



నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): జూన్ 18లో రైతులకు యూరియా పంపిణీలో పారదర్శకతను పెంపొందించడంతో పాటు, ఎరువుల కోసం పడే ఇబ్బందులను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన యూరియా బుకింగ్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, జిల్లాలోని 20 మండలాల్లో ఈ సేవలను నేటి నుండి ప్రారంభించగా, రైతులు ఇకపై నేరుగా తమ మొబైల్ ఫోన్ ద్వారా యూరియాను బుక్ చేసుకునే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ తెలిపారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో హాకా, ఆగ్రోస్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, క్రిమిసంహారక మందుల విక్రయ కేంద్రాల డీలర్లతో యూరియా పంపిణీ, యూరియా నిల్వలు, యాప్ ఆధారిత బుకింగ్ విధానం తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శాసన మండలి సభ్యుడు కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి చేతుల మీదుగా యూరియా బుకింగ్ యాప్‌ను అధికారికంగా ప్రారంభించారు. అనంతరం యాప్ పనితీరు, రైతులకు అందించే సేవలు, బుకింగ్ విధానం గురించి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ..., రైతులకు యాప్ వినియోగంపై పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు, డీలర్లు, సహకార సంఘాల ప్రతినిధులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలనికోరారు. యూరియా బుకింగ్ ప్రక్రియను రైతులకు సులభంగా వివరించి, ప్రతి రైతు సాంకేతిక సేవలను వినియోగించుకునేలా సహకరించాలని ఆయన సూచించారు. యాప్ ప్రారంభ దశలో కొన్ని సాంకేతిక సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉన్నప్పటికీ, వాటిని అధిగమిస్తూ సేవలను విజయవంతంగా అమలు చేయాలని అధికారులను కోరారు.రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందుగానే యూరియా నిల్వలను సిద్ధం చేసిందని ఎమ్మెల్సీ తెలిపారు. జిల్లాలో యూరియా కొరత లేకుండా పంపిణీ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లో నెలకొన్న యుద్ధ వాతావరణం కారణంగా యూరియా సరఫరాపై కొంత ప్రభావం పడే అవకాశం ఉన్నప్పటికీ, రైతులకు కొరత రాకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన వెల్లడించారు. అవసరమైన మేరకు యూరియా నిల్వలను సమకూర్చి రైతుల అవసరాలను తీర్చేందుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా పంపిణీ జరగడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 32 వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతుల అవసరాలకు అనుగుణంగా వాటిని సకాలంలో పంపిణీ చేసేలా చర్యలుతీసుకోవాలని అధికారులను ఆదేశించారు. యాప్ ద్వారా బుకింగ్ చేసుకున్న రైతులకు ప్రాధాన్యతనిస్తూ, వారికి ఎరువులు సులభంగా అందే విధంగా వ్యవస్థను పటిష్టం చేయాలని సూచించారు. యాప్ ద్వారా రైతులు తమ అవసరానికి అనుగుణంగా యూరియాను ముందుగానే బుక్ చేసుకోవచ్చని, దీంతో ఎరువుల కోసం డీలర్ల వద్ద పడిగాపులు కాయాల్సిన అవసరం తగ్గుతుందని కలెక్టర్ తెలిపారు. యాప్ ద్వారా నమోదైన వివరాల ఆధారంగా యూరియా పంపిణీ చేపట్టడం వల్ల పారదర్శకత పెరగడంతో పాటు అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌కు కూడా అడ్డుకట్ట పడుతుందని చెప్పారు.జిల్లాలో యూరియా పంపిణీ వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చేందుకు డిజిటల్ విధానాలను అమలు చేస్తున్నామని అధికారులు తెలిపారు. రైతులు యాప్‌ను సద్వినియోగం చేసుకొని ముందస్తుగా యూరియాను బుక్ చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అమరేందర్, జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్ రావు, జిల్లా సహకార అధికారి రఘునాథ్ రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అశోక్, హర్షవర్ధన్, మండల స్థాయి వ్యవసాయ అధికారులు, హాకా, ఆగ్రోస్ ప్రతినిధులు, సహకార సంఘాల అధికారులు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన లబ్ధిదారుల ఇంటికి సంక్షేమ ఫలాలు చేర్చే బాధ్యత నాది..



సూర్యాపేట, చివ్వేంల జూన్ 18:(విజన్ ఆంధ్ర) : ఇండ్లు లేని ప్రతి నిరుపేదకు పక్కా ఇండ్లు కట్టించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతీ ఒక్కరికి దశలవారీగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి తెలిపారు. బుధవారం చివ్వేంల మండలంలోని అక్కలదేవి గూడెం గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు ధారవత్ వీరన్న నాయక్ తో కలిసి మండవ నాగరాజు మౌనిక ల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు.అనంతరం వారు మాట్లాడుతూ పేదల సొంతింటి కలలను నిజం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేద ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. ఎన్నో సంవత్సరాలుగా సొంతిల్లు లేక అద్దె ఇళ్లలో ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు ఇప్పుడు ఇంద్రమ్మ ఇళ్ల పథకం ద్వారా గౌరవప్రదమైన జీవనం అందుతోందన్నారు.ఇల్లు అనేది ప్రతి కుటుంబానికి ఒక భద్రత, ఒక ఆత్మగౌరవం. ఆ గౌరవాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పేద కుటుంబానికి అందించేందుకు కట్టుబడి ఉంది అని పేర్కొన్నారు.ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల మంజూరు ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఇల్లు లేని నిరుపేదల జీవితాల్లో వెలుగు నింపుతున్నామని తెలిపారు.అర్హులైన ప్రతి పేద కుటుంబానికి దశలవారీగా ఇళ్లు అందజేస్తూ సొంతింటి కలలను నిజం చేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని స్పష్టం చేశారు.గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో సమాన ప్రాధాన్యతతో ఇళ్ల నిర్మాణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు.అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాలు మహిళల ఆర్థిక సాధికారత కోసం మహాలక్ష్మి పథకం, రైతులకు రైతు భరోసా, ఉచిత విద్యుత్, గృహ వినియోగదారులకు 200 యూనిట్ల ఉచిత కరెంట్, రూ.500కే గ్యాస్ సిలిండర్, యువతకు ఉపాధి అవకాశాలు వంటి పథకాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువస్తున్నాయని అన్నారు.ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా ప్రతి హామీని అమలు చేస్తున్నామని, పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని సర్వోత్తమ్ రెడ్డి గారు స్పష్టం చేశారు. అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలు మరింత వేగంగా కొనసాగిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అమరగాని ఆంజనేయులు,ఉప సర్పంచ్ అనూష, గ్రామ కాంగ్రెస్ నాయకులు అమరగాని అబ్బులు, మండల కాంగ్రెస్ నాయకులు నంద్యాల సోమిరెడ్డి, పాచ్య నాయక్ తండా సర్పంచ్ సోమాని, గ్రామ కాంగ్రెస్ నాయకులు మిర్యాల గోవింద్ రెడ్డి, అమరగాని సావిత్రి నాగయ్య, మండల కాంగ్రెస్ నాయకులు బొప్పాని అనిల్, పొడిశెట్టి గురువయ్య, పుట్ట వెంకన్న, వేముల చిన్న, అమరగాని రాములు, అమరగాని ఎల్లయ్య, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, మున్సిపల్ కౌన్సిలర్ నాగుల వాసు, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఏలిమినేటి అభినయ్ నాయుడు, జిల్లా కాంగ్రెస్ సేవదల్ అధ్యక్షుడు ఆలేటి మాణిక్యం గౌడ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు పడిదల రవి, శాంతయ్య, ఆత్మకూర్(ఎస్) యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లెపాక అనిల్ తదితరులు పాల్గొన్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.